మెయిన్ గత వారం రోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Khammam, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-9-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 216 పేజీలు: 10+4 వెల: 6.50



ఎన్డీయే కూటమిలో తెలని సర్దుబాట్లు
ముంబయి మహానగరానికి మానవ బాంబుల ముప్పు 5లో




శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన మంత్రి లోకేష్

## ప్రధాని మోడీతో మంత్రి లోకేష్ భేటీ

### రాష్ట్రంలో పెట్టుబడుల సాధనకు సహకరించాలని వినతి

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీతో రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు సహకారం అందించాలని కోరారు.ఏపీలో సెమీ కండక్టర్ యూనిట్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో ఐటి,ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని >>2

# గురువు స్ఫూర్తితో ముందుకు

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** పిల్లల్లోవిజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న వారందరికీ సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. విజయవాడ ఏ కన్వెన్షన్‌లో గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, సత్యకుమార్ యాదవ్ లతోపాటు ఇతర నేతలు పాల్గొన్నారు. విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్ బెస్ట్ ప్రాక్టీసెస్ విధానాలను సీఎం పరిశీలించారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని మంత్రి లోకేశ్ కు సీఎం సూచించారు. విద్యార్థులు జాతీయ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు సాధించేలా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. ఎన్ ఐఆర్ ఎఫ్ ర్యాంకింగ్‌లో ఆంధ్రవర్సిటీకి 4వ ర్యాంకు రావడం శుభపరిణామమన్నారు, ఇలాంటి ర్యాంకులు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. అలానే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా నెలకొల్పిన గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్‌ను నిర్వాహకులు ముఖ్యమంత్రికి అందించారు. గురుపూజోత్సవం చాలా పవిత్రమైన కార్యక్రమమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. విజయవాడలో ఏ సమావేశ ప్రాంగణంలో దివంగత భారత రాష్ట్రపతికి విగ్రహానికి నివాళి అర్పించారు.జ్యోతి ప్రజలన అనంతరం మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత మనం గుర్తు పెట్టుకునేది ఉపాధ్యాయులనే అని, అలాంటి వారిని జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేమని అన్నారు. విద్యార్థి దశలో పిల్లల్లో స్ఫూర్తిని కలిగించేది, అలానే మనలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి బయటకు తీసేది గురువేనని తెలిపారు. భక్తవత్సలం అనే ఉపాధ్యాయుడు నా జీవితంలో స్ఫూర్తి నింపారని, నేను నిత్య విద్యార్థిని ప్రతిరోజు ఏదో ఒకటి నేర్చుకుంటానని సీఎం వివరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం మనకు ఆదర్శప్రాయమని చెప్పారు. రాధాకృష్ణన్ రేణిగుంట పాఠశాలలో టీచర్‌గా, ఏయూలో ఆచార్యుడిగా పని చేశారని అన్నారు. గత ఏడాది బుడమేరు వరదల కారణంగా గురుపూజోత్సవం జరుపుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేసారు. 175 మంది ఉపాధ్యాయులు ఇచ్చిన సూచన, సలహాలతో వారి ఫొటోలతో పుస్తకాన్ని ముద్రిస్తామని వెల్లడించారు. సాధారణంగా రాజకీయ నాయకుల పిల్లలు చదువుకోరు కాని మా ఇంట్లో లోకేశ్ చదువు గురించి నా భార్య భువనేశ్వరి చూసేవారన్నారు.ఈ విషయంలో ఆ క్రెడిట్ ఆవిడదేనని సీఎం అన్నారు.విద్యను రాజకీయాలకు దూరం >>2




శుక్రవారం విజయవాడలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రసంగిస్తున్న చంద్రబాబు. చిత్రంలో మంత్రులు సత్యకుమార్, లోకేష్ తదితరులు

విజ్ఞానంతోపాటు లౌకికం కూడా పెంపొందించుకోవాలి

పిల్లలకు పుస్తకాల బరువు తగ్గించాం

ఆంధ్ర వర్సిటీకి 4వ ర్యాంక్ శుభపరిణామం

నేను నిత్యవిద్యార్థిని..రోజూ నేర్చుకుంటా: సిఎం చంద్రబాబు

# తురకపాలెం ఘటనపై ప్రభుత్వం సీరియస్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 5:** గుంటూరు జిల్లా తురకపాలెంలో 5 నెలలుగా చోటుచేసుకుంటున్న మహమ్మారితో మృతులపై రాష్ట్ర ప్రభుత్వం అధికారులతో సీరియస్ అయ్యింది. అయిదు నెలలుగా మహమ్మారి వెంటాడుతున్నా ఎందుకు అలసత్వం వహించారంటూ జిల్లా వైద్యఅధికారులపై ప్రభుత్వం మండి పడినట్టు సమాచారం. పదుల సంఖ్యలో చనిపోయినా పట్టించుకోరా. అంటూ అధికారులను ప్రభుత్వం తీవ్రంగా హెచ్చరించినట్టు తెలిసింది. తురకపాలెం ఘటన నివేదికపై సమీక్షించిన సిఎం చంద్రబాబు ముమ్మర చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. బాధితులందరికీ తాము ఉన్నామంటూ ధైర్యం చెప్పాలంటూ వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఆ గ్రామానికి వెళ్లాలని సిఎం ఆదేశించటంతో శుక్రవారం తురకపాలెంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించి ఘటనపై ఆరా తీశారు. ఊరులోని అన్నివీధుల్లో పర్యటించి బాధితుల అభిప్రాయాలను తెలుసుకున్నారు.మహమ్మారి కబళించిన బాధిత కుటుంబాలకు వెళ్లిన సత్యకుమార్ వారిని ఓదార్చి పరామర్శించారు. మహమ్మారి ప్రబలటంపై కారణంపై నివేదికలకు ఆదేశించామని, త్వరలో రానున్న >>2

అధికారుల అలసత్వంపై సిఎం మండిపాటు

వారం రోజులపాటు బాధితులకు ఆహారం, నీరు సరఫరా

నేడు రక్త, నీటి నమూనాల సేకరణకు 50 బృందాల రాక



శుక్రవారం తురకపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్




## 18 నుంచి అసెంబ్లీ

### 14,15న తిరుపతిలో మహిళా ఎమ్మెల్యేల జాతీయ సదస్సు

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీసమావేశాలు ఈ నెల 18వ తేదీ నుంచి జరుగబోతున్నాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు.అసెంబ్లీ సమావేశాలు18వతేదీ ఉదయం 9గంటలకు, కౌన్సిల్ సమావేశాలు ఉదయం 10గంటలకు మొదలవుతాయి. మొదటి రోజుసమావేశం అనంతరం ఉభయ సభల బిఏసిసమావేశాలు జరుగుతాయి. >>2

## సిట్ విచారణలో వైఎస్ అనిల్ రెడ్డి పిఎ

**విజయవాడ, సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ప్రత్యేక దర్యాప్తు సంస్థ ( సిట్) శుక్రవారం కీలక పురోగతి సాధించింది. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ సోదరుడు, ఆయనకు అత్యంత సన్నిహితు వైఎస్ అనిల్ రెడ్డి వద్ద పీఏగా విధులు నిర్వహిస్తున్న దేవరాజులను ఉన్నతాధికారులు శుక్రవారం సిట్ కార్యాలయానికి పిలిపించారు. మద్యం కుంభకోణం వ్యవహారంలో పలువురి పాత్రపై ఆయనకు ప్రశ్నలు సంధించి.. అతని నుంచి జవాబులు రాబడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విచారణలో అతడు ఇచ్చే సమాచారం ఆధారంగా ఈ కేసు కీలక పురోగతి సాధిస్తుందని సిట్ అధికారులు భావిస్తున్నారు. అయితే ఈ మద్యం కుంభకోణంలో ఇప్పటి వరకు పలువురిని సిట్ అధికారులు విచారించారు. ఆ క్రమంలో 12 మందిని అరెస్ట్ చేసిన విషయం విదితమే. ఇక ఇదే కేసులో జగన్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం, మంత్రిగా పని చేసిన నారాయణ స్వామిని సైతం సిట్ అధికారులు విచారించారు. ఈ సందర్భంగా ఆయన స్టేట్‌మెంట్‌ను వారు రికార్డు చేసుకున్నారు.జగన్ ప్రభుత్వం హయాంలో మద్యం విక్రయాల లావాదేవిలన్ని నేరుగా జరిగాయి. అంటే ఎక్కడ డిజిటల్ చెల్లింపులు అనేవి జరగలేదు. ఈ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం విక్రయాలకు తెర తీశారు. ఈ మద్యం తాగడం వల్ల అనేక మంది మృత్యువాత పడ్డారు. అలాగే పలువురు అనారోగ్యానికి గురయ్యారు. అంతేకాకుండా.. ఈ మద్యం విక్రయాల్లో భారీగా అవినీతి చోటు చేసుకుందంటూ ఆరోపణలు సైతం వెల్లువెత్తాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి ఓటరు పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం మద్యం కుంభకోణంపై సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డిను సిట్ అధికారులు అరెస్ట్ చేసి.. విచారించారు. అతడు ఇచ్చిన సమాచారం ఆధారంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డితోపాటు బాలాజీ గోవిందప్ప తదితరులను అరెస్ట్ చేశారు. వీరికి బెయిల్ కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కానీ వీరికి కోర్టు మాత్రం బెయిల్ మంజూరు చేయడం లేదు. దాదాపు రూ 3,500 కోట్ల మద్యం కుంభకోణం జరిగినట్లు తెలుస్తోంది. అదీకాక.. ఈ కేసు విచారణలో భాగంగా హైదరాబాద్ శంషాబాద్‌లో రూ. 11 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ మద్యం కుంభకోణం ద్వారా సంపాదించిన నగదుతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రాజ్ కసిరెడ్డి పలు ఆస్తులు కొనుగోలు చేసినట్లు గుర్తించి.. వారిని సైతం సిట్ అధికారులు జప్తు చేసింది.

# పెట్టుబడులకు మరింత ప్రోత్సాహం

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ఉపాధి,ఉద్యోగ అవకాశాల కల్పన కీలకంగా ప్రభుత్వం పెట్టుబడులకు ముందస్తు ప్రోత్సాహకాలు అందిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.నాయుడుపేటలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు, కాపర్ క్లాడ్ లామినెట్ ప్లాంట్, ఈఎంఎస్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. దీని కోసం సిర్మా ఎస్‌జీఎస్ టెక్నాలజీ లిమిటెడ్, దాని సంయుక్త వెంచర్లకు 26.70 ఎకరాల కేటాయించారు. రూ.1,595 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడి పెడుతున్నారు. దీంతో 2,168 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఇంటిగ్రేటెడ్ అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ ఫెసిలిటీని ఏర్పాటు చేసేందుకు హిండాల్కో ఇండస్ట్రీస్ చేసిన ప్రతిపాదనకు తాజా మంత్రి మండలి సమావేశంలో ఆ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ నెలలోనే జరుగునున్న అసెంబ్లీ సమావేశాల్లో మంత్రిమండలిలో ఆమోదించిన పథకాలన్ని చట్టపరమైన ఆమోదం నిమిత్తం ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు.శుక్రవారం సీఎంవో ద్వారా అందించిన సమాచారంలో పెట్టుబడికి ముందస్తు ప్రోత్సాహకాలుగా రూ.586 కోట్ల అందచేయడం ద్వారా 613 మందికి ఉద్యోగాలు లభించనున్నాయని సీఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ఈ సౌకర్యం ఆపిల్‌తో సహా ప్రపంచ సాంకేతిక సంస్థలకు నాణ్యత కలిగిన అల్యూమినియం ఉత్పత్తులను తయారు చేస్తుంది. తిరుపతి మండలం సెట్టిపల్లి గ్రామంలోని అందరికీ ఇళ్లు విధానం ప్రకారం ప్రతి ఫ్లాట్ యజమానికి కనీసం 2 సెంట్లు కేటాయించేందుకు 2019లో రెవెన్యూ శాఖ చేసిన సవరణ ఆమోదించారు. ఎక్సైజ్ చట్టాన్ని సవరిస్తూ కుష్ఠు వ్యాధి లేదా ఏదైనా ఇతర అనే పదాలను తొలగించేందుకు ఉద్దేశించి ముసాయిదా బిల్లుకు ఆమోదం.

ఉపాధి, ఉద్యోగావకాశాలే లక్ష్యం: సిఎం చంద్రబాబు

భవనాల గరిష్ఠ ఎత్తు 24 మీటర్లకు పెంపు

నాయుడుపేటలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు ఏర్పాటు



రాష్ట్రంలోని 16 జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి దీపం2 పథకం ద్వారా 5 కిలోల ఎల్‌పీజీ సిలిండర్లు ఇస్తున్నారు. అయితే ఇక పై వీరికి 14.2 కిలోల గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. 5 కిలోల సిలిండర్లు ఉన్న లబ్ధిదారులకు ఇప్పటివరకూ 14.2 కిలోల సిలిండర్లకు ఇచ్చే రాయితీ అందలేదు. దీనిపై తాజాగా మంత్రిమండలి నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లోని 23,912 మందికి ప్రయోజనం కలుగుతుంది.ఏపీలో భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచనున్నారు. ఈ మేరకు శాసనసభలో బిల్లు ప్రవేశపెడతారు. మంత్రిమండలిలో తీసుకున్న నిర్ణయాలను సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అందులో ముఖ్యమైనవి ఇలా ఉన్నాయి.

2025 జనవరి 1 లేదా ఆ తర్వాత రాజధాని అమరావతిలో విద్యా ఆరోగ్య సంరక్షణ సంస్థలకు భూమిని కేటాయించారు. అయితే వీటి అమ్మకం లేదా లీజు డీడ్ ఒప్పందాలను అమలు చేసే సందర్భంలో రీయింబర్స్‌మెంట్ ప్రాతిపదికన స్టాంపు డ్యూటీ చెల్లింపు నుంచి మినహాయింపు ఇచ్చే ప్రతిపాదన ఆమోదించారు. పారిశ్రామికాభివృద్ధి విధానం 2024- 29లోని ఎర్లీబర్డ్ పథకం కింద అదానీ విల్మర్ లిమిటెడ్, రామ్ షీ బయో ప్రైవేట్ లిమిటెడ్, బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్, టైరోమర్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, పట్టాభి ఆగ్రోఫుడ్స్‌లకు ప్రోత్సాహకాలు అందించేందుకు గతంలో చేసిన సిఫార్సులను ఎస్ఐపీబీ ఆమోదించింది.

స్పేస్ సిటీకి సంబంధించి తదుపరి నాలుగు ప్రధాన తయారీ ప్రతిపాదనలకు ఎకరానికి రూ.5లక్షలు కేటాయించారు. ఎర్త్ స్టోరబుల్ ఇంజిన్ టెస్ట్ ఫెసిలిటీ, క్రయోజనిక్ ఇంజిన్ టెస్ట్ ఫెసిలిటీ, క్రయోజనిక్ ఇంజిన్ టెస్ట్ ఫెసిలిటీ2 సదుపాయాలను ఈ స్పేస్ సిటీలో కల్పించనున్నారు. రూ.427 కోట్ల పెట్టుబడితో మదర్ డైరీ ఫ్రూట్, వెజిటెబుల్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా 180 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.



# 9.5 లక్షల మె.ట ఎరువుల కేటాయింపు

### రబీసీజన్‌కు ఎలాంటి కొరతలేదు: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో యూరియాకు ఎటువంటి కొరత లేదని ఈ విషయంలో ఎటువంటి దుష్ప్రచారం నమ్మవద్దని ఏపీ వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేసారు.రాష్ట్రంలో యూరియా నిల్వలు, పంపిణీ, సరఫరాలపై క్రిష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం, బాపట్ల, విజయనగరం, కడప, ఏలూరు,శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, ఈ.ఓ స్పెషల్ సిఎస్ రాజశేఖర్, డైరెక్టర్ ఢిల్లీరావులతో టెలీ కాన్ఫరెన్స్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిర్వహించారు. యూరియా సరఫరా సమస్యలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను అధిగమించాలని సూచించిన మంత్రి అచ్చెన్నాయుడు.భవిష్యత్ అవసరాల కోసం రబీ సీజన్ కు 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు ఇప్పటికే రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్న మంత్రి అచ్చెన్నాయుడుఅధికారిక లెక్కలకు, గ్రౌండ్ లెవల్ లో ఉన్నటువంటి యూరియా నిల్వలకు తేడా లేకుండా పర్యవేక్షణ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు.జిల్లాలో ఉన్నటువంటి యూరియా నిల్వల గురించిన వివరాలను అత్యవసరంగా అందచేయాలని కలెక్టర్లను ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు..కిష్ణా, బాపట్ల, కడప, జిల్లాల్లో ఇబ్బందులు ఎక్కువగా వస్తున్నాయని వీటిపై త్వరితగతిన స్పందించి కలెక్టర్లు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు.యూరియా నిల్వలు ఎక్కువగా ఉన్నటువంటి ప్రాంతాల నుండి డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు యూరియా సరఫరా చేసే విధంగా కలెక్టర్లు చర్యలు చేపట్టాలి, రవాణా ఖర్చులను ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకుంటామన్న మంత్రి అచ్చెన్నాయుడు..గంగవరం, కాకినాడ పోర్టుల నుండి రాష్ట్రానికి రావలసిన 53 వేల మెట్రిక్ టన్నుల యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే విధంగా పోర్ట్ అధికారులు, రైల్వే అధికారులతో రాష్ట్ర అధికారులు సమన్వయం చేసుకొని అనుకున్న సమయానికి యూరియా అందే విధంగా సమన్వయం చేసుకోవాలని తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు.సోషల్ మీడియాలో, వార్తా పత్రికల్లో వచ్చే తప్పుడు కథనాలపై స్పందించాలని, ప్రతిరోజు వాస్తవికత విషయాలను, యూరియా నిల్వల గురించి కలక్టర్లు మీడియాకు వివరించాలని ఆదేశించిన మంత్రి అచ్చెన్నాయుడు.



## సిఎం చంద్రబాబుకు కొత్త హెలికాప్టర్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు భద్రత దృష్ట్యా కొత్త హెలికాప్టర్‌ను వినియోగిస్తున్నారు. రెండు వారాలుగా ఇందులోనే జిల్లాల పర్యటనలకు వెళ్తున్నారు. ఇటీవలి వరకు వాడిన బెల్ తయారీ ఛాపర్ పాతది కావడంతో అధునాతన ఫీచర్లతో కూడిన ఎయిర్‌బస్ హెచ్160 మోడల్ హెలికాప్టర్‌కు మారారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రయాణాలకు అనువుగా ఉంటుందని నిపుణులు దీన్ని ఎంపిక చేశారు. పాత ఛాపర్ ఎక్కువ దూరం ప్రయాణానికి పనికొచ్చేది కాదు. సీఎం ఏదైనా జిల్లాకు వెళ్లాలంటే ఉండవల్లి నివాసంలోని హెలిప్యాడ్ నుంచి ఛాపర్‌లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో వెళ్లాల్సిన ప్రాంతానికి సమీపంలోని ఎయిర్‌పోర్టుకు వెళ్లేవారు.

## రూ.65వేల కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు

### అవసరమైన భూములు రిలయన్స్‌కు కేటాయించాలి: సిఎస్ విజయానంద్



**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో రిలయన్స్ ఆధ్వర్యంలో రూ.65 వేల కోట్లతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటుకు అవసరమైన భూములు త్వరితగతిన అప్పగించాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ.. రిలయన్స్ సంస్థకు 9 జిల్లాల్లో 2.34 లక్షల ఎకరాల భూమిని అప్పగించాలన్నారు. వృధాగా పోతున్న వర్షపు నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని అన్ని చెరువులను పూర్తిగా నింపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటి సంరక్షణ భూగర్భ జలాలు పెంపును కలెక్టర్లు బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు. యూరియా, పరిశ్రమలు, గురుకులాలు, కెజిబివిలు తదితర అంశాలపై ఈ సమావేశంలో కలెక్టర్లకు సూచనలు ఇచ్చారు. రాష్ట్రంలో ప్రస్తుతం సరిపడి యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ రైతులకు విజ్ఞప్తి చేశారు..మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,భుగర్భ జలాలు,పియం కుసుమ్,కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లకు భూమి అప్పగించుట,స్వచ్ఛాంధ్ర అవార్డులు తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో రిలయెన్స్ సంస్థ ద్వారా ఏర్పాటు చేయనున్నకంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లకు సంబంధించి మొదటి దశ కింద 9 జిల్లాల్లో 2లక్షల 34 వేల ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని ఆయా భూములను త్వరిత గతిన అప్పగించాలని కలక్టర్లను ఆదేశించారు.అనంతరం మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు,భూగర్భ జలాల పెంపు అంశాలపై మాట్లాడుతూ వృధాగా పోతున్న వర్షపు నీటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు అన్ని మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను పూర్తిగా నింపేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

# ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం

## మీడియేషన్, ఆర్బిట్రేషన్‌లతో వివాదాలకు పరిష్కారం

## విశాఖలో ఏడీఆర్ సెంటర్ ఏర్పాటుకు సిద్ధం



శుక్రవారం విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**విశాఖపట్నం, సెప్టెంబరు 5 ప్రభాతవార్త:** ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం అందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ వ్యవస్థలో మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలే ముఖ్య భూమిక పోషిస్తాయని అన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్సుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ద్వారా న్యాయం అందరికీ అందుబాటులోకి రావటంతో పాటు వేగంగా సమర్ధ వంతంగా చేరుతుందన్నారు. మీడియేషన్ అంశం భారత్ కు కొత్తదని తరాలుగా మనకు అందుబాటులో ఉందని తెలిపారు. పురాణాల్లో శ్రీకృష్ణుడు ఓ సమర్ధవంతమైన మీడియేటర్ గా వ్యవహరించారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గతంలో మన పూర్వీకులు, గ్రామపెద్దలు సమర్ధంగా మీడియేషన్ ప్రక్రియను నిర్వహించేవారని తెలిపారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ విశాఖ పట్నంలో జ్యుడిషియల్, మధ్యవర్తిత్వ రంగాలపై చారిత్రాత్మక కాన్ఫరెన్స్ నిర్వహించటం సంతోషదాయకమని ప్రజాస్వామ్యంలో భారతీయ న్యాయవ్యవస్థ ఓ మూల స్తంభంలాంటిదన్నారు. రాజ్యాంగపరమైన హక్కుల్ని, చట్టాన్ని కాపాడే అత్యంత కీలకమైన వ్యవస్థ. నిబద్ధతకు, నిష్పాక్షి కతకు, పారదర్శకతకు పెట్టింది పేరు. కొన్ని సమయాల్లో కాస్త ఆలస్యమైనా న్యాయం దక్కుతుందనే నమ్మకం ప్రతీపౌరుడికీ ఉంది. భారత్ అత్యంత వేగంగా సంస్క రణల్ని అమలు చేస్తోందేన్నారు. గత ఏడాదిగా ఏపీలో వంద బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయి. ప్రతిష్టాత్మక సంస్థలు తమ కార్యకలాపాలు ఏర్పాటు చేస్తున్నాయి. కంపెనీలు, వ్యవస్థలు వస్తున్న నేపథ్యంలో వివాదాల పరిష్కారానికి మీడియేషన్ లాంటి ప్రత్యామ్నాయ న్యాయ వ్యవస్థలు అందుబాటులోకి రావాలి. ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ సిస్టం రావాలి. సులభంగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు టెక్నాలజీని కూడా అందిపుచ్చుకోవాలి." అని అన్నారు. విశాఖలో ఏడీఆర్ ఏకో సిస్టం ఏర్పాటుకు సిద్ధంవిశాఖలో ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ఏకో సిస్టం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. పెరిగిపోతున్న వివాదాలు, కేసుల పరిష్కారానికి కొత్తగా కోర్టులు ఏర్పాటు చేయటంతో పాటు మీడియేషన్, ఆర్బిట్రేషన్ కు కొత్త వ్యవస్థలు రావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా మంది పౌరులు కేసులు దాఖలు చేసి కోర్టులకు వెళ్లటం అవమానంగా భావిస్తారని దీన్ని మీడియేషన్ ప్రక్రియ చక్కని పరిష్కారమని అన్నారు. దేశం అమలు చేస్తున్న సంస్కరణలు, కొత్త వ్యవస్థలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వివాదాలు తగ్గించుకోవటమే ఆర్థిక వ్యవస్థకు కీలకం అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. దానికి అనుగుణంగా వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వ్యవస్థలను రూపొందించుకోవాల్సి ఉందన్నారు. ఈజ్ ఆఫ్ జస్టిస్ ప్రక్రియలో భాగంగా వర్చువల్ హియరింగ్స్, ఈ-ఫైలింగ్, మొబైల్ అప్‌డేట్స్ లాంటి సాంకేతికతను అమలు చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఏపీలో ఈ ప్రక్రియ చాలా అవసరంప్రస్తుతం ఏపీలో 650 మంది జడ్జిలు ఉన్నారు. కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు మరో 800 మంది న్యాయమూర్తులు అవసరమౌతుందని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాగూర్ అభిప్రాయ పడ్డారు.ప్రస్తుతం మీడియేషన్ ప్రక్రియ చాలా అవసరం . మీడియేషన్ నిపుణులను తయారు చేసేందుకు 40 గంటల ట్రైనింగ్ అవసరం అవుతుందన్నారు.మీడియేషన్ చేసే వారికి చాలా నైపుణ్యం ఉండాలి. దానిని కొలిచేందుకు ఓ ప్రత్యేకమైన సర్టిఫికేషన్ ఉండాలి ఆర్బిట్రేషన్ రంగంలోకి విశ్రాంత న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు వస్తున్నారు. హౌసెస్, డిస్పెన్సెస్ ఆర్బిట్రేటర్లు కూడా ఉన్నారు. దీనికో ప్రత్యేకమైన యంత్రాంగం ఉండాలని భావిస్తున్నారు. ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పిఎస్ నరసింహా, ఏపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ఇతర న్యాయ మూర్తులు, న్యాయ నిపుణులు హాజరయ్యారు.

# 18 నుంచి అసెంబ్లీ

>> ఆ రోజు సమావేశాల ఏజెండా, ఎన్ని రోజులు సభలు జరగాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటారు. ఈ సారి కూడా అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకూడదని ఇప్పటికే వైసీపీ అధినేత జగన్ చెప్పారు. అయితే, వరుసగా 60 అసెంబ్లీ పని దినాలు హాజరుకానిపక్షంలో అనర్హత వేటు పడుతుందని ఇప్పటికే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు వైసీపీ నేతల్ని హెచ్చరించారు. తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీల్లో మహిళా ఎమ్మెల్యేలకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సమావేశానికి దేశంలోని అన్ని రాష్ట్రాల పరిధిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన సుమారు 300 మంది మహిళా ఎమ్మెల్యేలు సదస్సుకు హాజరు కానున్నట్లు ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ వెల్లడించారు సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి తొలిరోజు సీఎం చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్ హాజరవుతారు. సమావేశాల ముగింపు రోజున గవర్నర్ హాజరుకానున్నారని ఏపీ స్పీకర్ తెలిపారు. సదస్సుకు హాజరయ్యే ఎమ్మెల్యేలకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సెప్టెంబరు 18 నుంచి శాసనసభ సమావేశాలు జరుగుతాయని, ఎమ్మెల్యేలకు సమాచారం పంపించనున్నట్లు అయ్యన్న పేర్కొన్నారు.

# అలిపిరి మెట్ల మార్గంలో 'కంచె' అవశ్యం

## హైకోర్టు ఆదేశాలతో నడకదారి భక్తుల భద్రతకోసం

## టిటిడి చర్యలకు అడుగులు



**తిరుమల,సెప్టెంబరు 5ప్రభాతవార్తప్రతినిధి:** "ఏడుకొండలవాడ గోవిందా...తిరుమలవాసా గోవింద"నామస్మరణతో భక్తితో కాలినడకన అలిపిరి మెట్లమార్గంలో తిరుమలకు చేరుకునే భక్తులకు పూర్తిస్థాయిలో రక్షణకల్పించాలని హైకోర్టు ఆదేశాలతో ఇప్పుడు తక్షణకర్తవ్యంపై టిటిడి ఆలోచన చేయాల్సిన అవసరం వచ్చింది. నడకమార్గంలో ఇరువైపులా ఇనుప "కంచె"ఏర్పాటుకు మూడునెలల్లో చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఇందుకు జెఎసి కూడా ఏర్పాటుచేసుకుని తగిన విధంగా స్పందించాలని న్యాయస్థానం ఆదేశాలతో టిటిడి అధికారులు ,అటవీశాఖ వన్యప్రాణిసంరక్షణవిభాగం సంయుక్తంగా కంచె పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈనెలలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనుండటం, 24వతేదీ సిఎం చంద్రబాబునాయుడు తిరుమలకు వస్తుండటంతో హైకోర్టు ఆదేశాలపై టిటిడి ధర్మకర్తలమండలి, అధికారులు చర్చించి తదుపరి కంచె ఏర్పాటుకు ఉపక్రమించనున్నారనేది తెలుస్తోంది. రెండుసంవత్సరాల క్రిందట అలిపిరి మెట్లమార్గంలో ఓ చిన్నారిని చిరుతపులి లాక్కెళ్ళి చంపితినిన దారుణ విషాద ఘటన తరువాత అలిపిరి నడకమార్గంలో కంచె శరణ్యమని భక్తులు,నిపుణులు సూచనలు చేశారు. అయితే అప్పటి టిటిడి పాలకమండలి అందుకు చర్యలు తీసుకునే దిశగా కార్యాచరణ సిద్దంచేసినా చివరకు వన్యప్రాణిచట్టం అంగీకరించకపోవడంతో ఆలోచనకు బ్రేక్ పడింది. ఇప్పుడు మళ్ళీ నడకమార్గంలో చిరుతపులులు, ఏనుగులు, ఎలుగుబంట్లు సంచారంతో భక్తులు భయపడుతున్నారు. భక్తులను చిరుతపులి గాయపరిచిన ఘటనలు ఉన్నాయి.దీంతో కాలినడక మార్గానికి ఇరువైపులా కంచె ఏర్పాటుచేయాలని హైకోర్టు న్యాయస్థానం ఆదేశాలతో టిటిడి ముందుకు కదలనుంది.

శేషాచలం అటవీప్రాంతంలో కొండలను విడదీసి కొన్ని ఏళ్ళక్రిందట నడకమార్గాలను ఏర్పాటుచేసిన టిటిడి ఇరువైపులా రక్షణకంచె విషయం అప్పట్లో అవసరం లేకపోయింది. ఇప్పుడు వన్యప్రాణులు యధేచ్ఛగా అడవులను వదలి జనసంచారంలోకి వస్తుండటంతో భక్తుల భద్రతపై పునరాలోచన చేయాల్సివస్తోంది. తిరుమలకు ఎంతో పవిత్రంగా,భక్తితో కాలినడకన వచ్చే భక్తులకు నడకమార్గాల్లో క్రూరమృగాల నుంచి పూర్తి రక్షణ కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. సుమారు 8కిలోమీటర్లు దూరం దట్టమైన కొండల మధ్య ఉన్న అలిపిరి కాలినడక మార్గం మెట్లదారికిరువైపులా అటవీప్రాంతమే. మెట్లమార్గానికి రెండువైపులా ఎత్తయిన రక్షణ గోడలు లేకపోవడం, అడవికి ఆనుకునే ఉండటంతో ఎటువైపు నుండి ఎప్పుడు,ఎక్కడ ఎలా చిరుతలు, ఎలుగుబంట్లు భక్తులపై దాడిచేస్తాయో తెలియని భయం. ఈ నేపథ్యంలో భక్తుల రక్షణకు మెట్లమార్గంలో బలమైన ఇనుప"కంచే" ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన హైకోర్టు ఆదేశాలతో ఆచరణకు రానుంది. గతంలో 2023లో చిన్నారిని చిరుతపులి చంపి తినడంతో భక్తుల రక్షణకు ప్రాథమికంగా చేతులకు "ఊతకర్రలు"ఇచ్చి పంపారు. తిరుమలకొండలు రిజర్వుఫారెస్టు ప్రాంతంలో ఉన్న కాలినడక మార్గాల్లో వన్యప్రాణుల సంచారం యధేచ్ఛగా ఉండేలా చూడటం అటవీశాఖ చట్టంలోని అంశం. అయితే అందుకు భిన్నంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలకొండకు దారులు పూర్తిగా దట్టమైన అడవిని చీల్చి మధ్యలో ఏర్పాటుచేసినవేకావడం విశేషం. దేవునిపై విశ్వాసంతో సాధారణరోజుల్లో 20వేలమంది వరకు భక్తులు నడకమార్గంలో తిరుమలకు వస్తున్నారు. తరచూ చిరుతలు కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్లలో భక్తులను వెంబడించడం, దాడిచేయడం,గాయాలతో విడిచిపెట్టడం జరుగుతున్నాయి. కంచే ఏర్పాటు చేస్తే భక్తులకు రక్షణ కల్పించవచ్చనేది హైకోర్టు ఆదేశాలు. శేషాచలంఅడవిలో వందకుపైగా చిరుతలు సంచరిస్తున్నా దాదాపు 10వరకు చిరుతలు ఇటు ఘాట్‌రోడ్లలో,కాలినడక మార్గాల్లో సంచరిస్తున్నాయనేది ఇటీవల తెలిసిన విషయం. అయితే నడకమార్గాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాటుచేసిన ట్రాఫ్ సిసికెమెరాల నిఘాతో నాలుగు చిరుతలు మాత్రమే అడవిలో ఇటు ఘాట్‌రోడ్లు, అటు నడకమార్గాల వైపు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికీ నడకమార్గంలో భక్తులకు భద్రత సిబ్బంది తోడుగా రక్షణకల్పిస్తున్నారు. భక్తులను గుంపులుగా అనుమతినిస్తున్నారు.

### వారం - వర్జ్యం

06-09-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
చతుర్దశి రా.1.38
ధనిష్ఠ రా.10.52
వర్జ్యం : తె.5.41-ఉ.7.12
దు.తె.5.56-ఉ.7.33
రాహుకాలం - ఉ.9.00-10.30

### వార్తాఫలం

**మేషం :** భూముల విషయంలో ఏర్పడిన వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి.

**వృషభం :** ఆరోగ్యం వాహనాల విషయంలో మెలుకువ అవసరం. సోదరుల కలయిక.

**మిథునం:** సంతాన విద్యా విషయంలో నూతన బాధ్యతలు చేపడతారు. శుభవార్తలు.

**కర్కాటకం :** సోదరి, సోదరులతో విభేదాలు తలెత్తుతాయి. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

**సింహం:** చిన్ననాటి మిత్రుల ద్వారా కీలక సమాచారం తెలుసుకుంటారు. వాహనసౌఖ్యం.

**కన్య :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ప్రయాణాలు.

**తుల :** గృహం కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. సంఘంలో ఓ ప్రత్యేక గౌరవం పొందుతారు.

**వృశ్చికం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కొత్త పెట్టుబడులకు అనుకూల సమయం.

**ధనుస్సు:** కోర్టు కేసులు పరిష్కార మవుతాయి. శుభకార్యాలలో బంధు మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**మకరం:** రాజకీయ, కళా రంగాల వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**కుంభం:** భూముల విషయంలో నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు. ఋణాలు తీరుస్తారు.

**మీనం :** కొన్ని అవకాశాలు అప్రయత్నంగా లాభిస్తాయి. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# గురువు స్ఫూర్తితో ముందుకు

>> గా ఉంచాం. గురువులు చూపించిన దారిలో నడవడం వల్లే తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకోగలిగానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, విద్యాశాఖలో ఏడాదిలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. అందరం కలిసి కట్టుగా ఆంధ్రా మోడల్ విద్యా వ్యవస్థను ప్రపంచానికి చాటుదామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యలో రాజకీయాలను దూరం పెట్టాలని సూచించారు. లీప్ మోడల్‌ను అందరం కచ్చితంగా అమలు



ఉత్తమ ఉపాధ్యాయురాలికి అవార్డు అందచేస్తున్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

చేయాలని సూచించారు. అలానే మెగా పేరెంట్‌టీచర్ సమావేశాలు ఏర్పాటు చేశామని ఇంకా పిల్లలను యోగా, క్రీడలు, ఎన్‌సీసీ వైపు ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అలానే కొన్ని పథకాలకి సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ పేర్లు పెట్టామని తెలిపారు. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం అందరికి ఆదర్శప్రాయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి రోజు తాను ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉంటానన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు. టీచర్లను జీవితంలో ఎప్పుడూ మరచిపోలేమన్నారు. తాను కూడా టీచర్ కావాల్సిందన్నారు. లెక్చరర్‌గా చేరాలని యూనివర్సిటీ వీసీ తనను కోరారని తెలిపారు. లెక్చరర్‌గా కాదు ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని ఆయనకు తెలిపానని చెప్పారు. హైదరాబాద్‌ను నెంబర్‌వన్‌గా చేసేందుకు తాను ఎంతో కష్టపడ్డానని పేర్కొన్నారు. ప్రపంచంలో తెలుగు వారు నెంబర్ వన్‌గా ఉండాలన్నదే తన కోరిక అని తెలిపారు. ఐఐటీ కోచింగ్ విషయంలో చుక్కా రామయ్య కచ్చితంగా ఉండేవారన్నారు. సీఎం సిఫార్సు చేసినా సీటు ఇవ్వబోనని ఆయన నిక్కచ్చిగా చెప్పేవారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. అందుకే చుక్కా రామయ్య అంటే తనకు ఎంతో గౌరవం పెరిగిందని చెప్పారు. 10 వేలమంది దరఖాస్తు చేస్తే 100 మందికే ఐఐటీ శిక్షణ ఇచ్చేవారని.. అలా వందకు వంద మందినీ ఐఐటీకి ఆయన పంపేవారంటూ చుక్కా రామయ్యలోని విశిష్ట లక్షణాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సోదాహరణగా వివరించారు. ఇక రాష్ట్ర విభజన కంటే కూడా గత పాలకుల వల్లే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎక్కువ నష్టం కలిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు ఆస్తులు ఇవ్వడం కన్నా చదివిస్తే ఊహించనంత ఎత్తుకు ఎదుగుతారు. 2014-19 మధ్య రాష్ట్రం కోసం కష్టపడ్డాను.. కానీ ఆ తర్వాత రకరకాల కారణాల వల్ల ఓడిపోయాను.నేను రాజకీయాలపై ఫోకస్ పెట్టిన ప్రతిసారీ గెలిచాను. ఉద్యోగులు, టీచర్లు ఈ ప్రభుత్వం నుంచి ఏం ఆశిస్తున్నారో... అవన్నీ రానున్న రోజుల్లో అందించే బాధ్యత తీసుకుంటాం. రాష్ట్రాన్ని నెంబర్1గా చేసేందుకు అవసరమైన వసతులు కల్పించే బాధ్యత నాది... దాన్ని అందిపుచ్చుకునే బాధ్యత టీచర్లది. జీఎస్టీ సంస్కరణలతో ప్రజల జీవితాల్లో కేంద్రం మార్పులు తెచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. 2047 నాటికి ప్రపంచంలోనే భారత్ నెంబర్ వన్ అవుతుందని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలోనే ఏపీ నెంబర్‌వన్‌గా మారాలనేదే తన లక్ష్యమన్నారు. రానున్న 22 ఏళ్ల పాటు మనమంతా దృష్టి పెడితే ఇది సాధ్యమే అవుతుందని సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు.

# మేం సిద్ధంగా ఉన్నాం.. వైద్య సేవలు పొందండి

## తురకపాలెంవాసులకు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ భరోసా

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 5:** రాష్ట్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమం , వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ , జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులతో కలసి శుక్రవారం మధ్యాహ్నం గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో పర్యటించారు. అక్కడి వైద్యశిబిరానికి వెళ్లి అక్కడ ఇప్పటివరకు జరిగిన పరీక్షల నిర్వహణ వివరాలను వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ, గుంటూరు జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఇప్పటి వరకు స్థానికులకు అందించిన వైద్య సేవల్ని మంత్రికి వివరించారు. శిబిరం వద్ద పరీక్షల కోసం వేచి ఉన్న స్థానికులతోను మాట్లాడారు. మీకు అండగా ప్రభుత్వం ఉంది. వైద్యుల ద్వారా చికిత్స పొందాలని, ఆందోళన చెందొద్దు అని వైద్యారోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ తురకపాలెం గ్రామవాసులకు ధైర్యం చెప్పారు. స్వల్పంగా అనారోగ్యం ఉన్నప్పటికీ ఆసుపత్రుల్లో చికిత్స పొందేందుకు స్థానికులు సంశయిస్తున్న విషయాన్ని

గుర్తించిన మంత్రి సత్యకుమార్ నేరుగా ఓ ఇంటికి వెళ్లి భార్యాభర్తలకు నచ్చచెప్పారు. ఈ సందర్భంగా స్థానికులు ఆసుపత్రుల్లో ఉండి చికిత్స పొందేందుకు వెనకాడుతున్నారని, సాధారణ వైద్యంతో సరిపెడుతున్నారని మంత్రి గమనించారు. తానే స్వయంగా వైద్య శిబిరానికి అరకిలో మీటరు దూరంలో ఉన్న దంపతులు జి.శ్రీనివాసరావు, విజయకుమారి ఇంటికి మంత్రి సత్యకుమార్ నడుచుకుంటూ వెళ్లారు.

ఈ సందర్భంగా అనారోగ్యంతో ఉండి కోలుకుంటున్నానని చెప్పిన విజయకుమారితో గుంటూరు జీజీహెచ్ కు వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామని, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. రక్త పరీక్షలతో పాటు అవసరమైతే స్కానింగ్ వంటి పరీక్షల్ని ఉచితంగా చేస్తారని, సంశయించవద్దని మంత్రి కోరారు. తురకపాలెం గ్రామ వాసులకోసం గుంటూరు జీజీహెచ్‌లో ప్రత్యేకంగా ఒక వార్డును ఏర్పాటు చేశామని తెలిపారు. ఇదే సమయంలో అక్కడున్న ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి , ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు కూడా ఆసుపత్రిలో చికిత్స పొందాలని నచ్చచెప్పారు. గుంటూరు జీజీహెచ్ లో మరణించిన వారి కేస్ షీట్లను వైద్య నిపుణులతో పరిశీలన చేయించాలని డిఎంఇ డాక్టర్ రఘునందన్‌ను వైద్యారోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం ఆయన మాట్లాడారు.

# తురకపాలెం ఘటనపై ప్రభుత్వం సీరియస్

>> నమూనా ఫలితాల ఆదారంగా నివారణ చర్యలు చేపడతామని బాధితులకు భరోసా నిచ్చారు. అయితే సిఎం ఆదేశాలతో అధికార యంత్రాంగం ఆగ్రామంలో ముమ్మర చర్యలకు శ్రీకారం చుట్టింది. సిఎం చంద్రబాబునాయుడు తురకపాలెంలో పూర్తిగా మహమ్మారి అదుపులోకి వచ్చేంతవరకు నిత్యం వైద్యాధికారులు, ఇతర అధికారులు ఏరోజుకు ఆరోజు ఆగ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షిస్తూ బాధితులకు ధైర్యం చెప్పాలని కోరారు. బాధిత కుటుంబాలకు వారం రోజులపాటు రాష్ట్ర ప్రభుత్వమే ఆహారం మంచినీరు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రక్త, నీటి నమూనాల ఫలితాలు వచ్చేంతవరకు బాధిత కుటుంబాలందరికీ ప్రభుత్వమే ఆహారం, మంచినీటి సరఫరా చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఏ బాధిత కుటుంబం కూడా ఆహారం తయారు చేసుకోకుండా, ప్రభుత్వమే వారికి ఈ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. వీధుల్లోని పారిశుధ్య పనులను కూడా ముమ్మరం చేశారు. జిల్లా పంచాతీయ అధికారి సాయికుమార్ నేతృత్వంలో పారిశుధ్య సిబ్బంది తురకపాలెంలో ప్రతివీధిలో పారిశుధ్యం పనులను ముమ్మరం చేశారు. ఈ పనులు పూర్తిస్థాయిలో పూర్తయ్యేంతవరకు సిబ్బంది అక్కడే తిష్టవేసి దోమలు, బ్యాక్టీరియా నివారణకు బ్లీచింగ్, ఫినాయిల్ , కిరోసిన్ వంటి ద్రవాలతో నిర్మూలనా చర్యలు చేపడుతున్నారు. నీటి నిల్వలు, మురికి కుంటలను పూర్తిగా లేకుండా చేస్తూ బ్లీచింగ్, ఫినాయిల్‌తో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. అంతుచిక్కని ఈ మహమ్మారి ప్రబలటానికి వైద్యబృందం అన్వేషణ మొదలుపెట్టింది. రక్త, నీటి నమూనాలు సేకరణకు 50 వైద్యబృందాలు ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు తురకపలెం రానున్నాయి. ఈ వైద్యబృందాలు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి రక్త నమూనాల సేకరణతోపాటు, మంచినీటి పథకాల నీటిని కూడా సేకరించే పనిలో నిమగ్నం కానున్నాయి. ఏది ఏమైనా పూర్తిస్థాయిలో ఈ మహమ్మారిని నిర్మూలించేవరకు అధికార యంత్రాంగం ముమ్మరంగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి నేతృత్వంలో అధికారులందరూ ఆ గ్రామంలో చర్యలు చేపట్టారు. ఈ గ్రామంలో ఒకరికి జ్వరం రావటం కాళ్లు, ఒళ్లునొప్పులు రావటం అకస్మాత్తుగా అనారోగ్యానికి గురవుతూ అయిదు నెలల కాలంలో 45 మంది మృత్యువాత పడినట్టు సమాచారం. ఈ మహమ్మారి బారినపడి మరో 300 మంది కోలుకుంటున్నారు. ఈ యొక్క మహమ్మారి ఎక్కువ దళితకాలనీలోనే ఎక్కువ మందిని పొట్టనపెట్టుకుంది. నీరు కలుషితం అయ్యిందని, నీరు తాగటం వల్లే దద్దర్లు, అనారోగ్యం ఏర్పడుతుందని గత ఏడాది అక్టోబర్‌లోనే గ్రామ ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకున్నా... ఫలితం శూన్యమైంది. కాలువ నుంచి వచ్చే మంచినీటిని సమీపంలోని క్వారీ గుంతల్లోకి తరలించి ఇక్కడ నుంచి ట్యాంకుల ఎక్కించి సరఫరా చేయటం జరిగింది. ఈ క్వారీ గుంత నాచుపట్టి పూర్తిగా కలుషితమై ఉన్నప్పటికీ అధికారులు ఆ నీటినే సరఫరా చేయటం వల్ల ఎక్కువ మందిని కోల్పోవాల్సి వచ్చిందంటూ గ్రామప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామం చుట్టూ వాటర్ ప్లాంట్‌లు ఉన్నా ధనికులకే ఆ నీరు సాధ్యమైందని, తాము డబ్బులు లేక కొనలేక ఈ నీటిపైనే ఆధారపడి తమ వారిని కోల్పోవాల్సి వచ్చిందంటూ బాధితులు 'ప్రభాతవార్త' ఎదుట కన్నీటి పర్యంతమయ్యారు. ఒకవైపు కలుషిత నీరు మరోవైపు పడకేసిన పారిశుధ్యంతో ప్రబలిన మహమ్మారి తమకు తీరని అన్యాయం చేసిందని బాధిత కుటుంబాలు వాపోతున్నారు. ప్రభుత్వాధికారులు సకాలంలో స్పందించి ఉంటే తమకు ఈ దుస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తమవారిని కోల్పోయిన తర్వాత ప్రభుత్వం స్పందించి పెద్దఎత్తున 3 రోజులుగా ముమ్మర చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. తాము ఫిర్యాదు చేసిన నాడే అధికారులు స్పందించి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదని విలపించారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా సత్వర చర్యటు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పర్యవేక్షణలో తురకపాలెంలో ముమ్మర చర్యలు కొనసాగుతున్నాయి.

# తురకపాలెం మరణాల సమాచారలోపంపై సమగ్ర విచారణ

## డిఎస్‌హెచ్ డాక్టర్ సిరి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు

## బాధ్యులపై చర్యలు తప్పవు: మంత్రి సత్యకుమార్ యాదవ్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబరు 5:** శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమం , వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ , ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ , జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ , ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులతో కలసి గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో పర్యటించారు. తొలుత గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను పరిశీలించి అక్కడ బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను , పరీక్షల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమం , వైద్య విద్యా శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మెడియాతో మాట్లాడుతూ తురకపాలెం మరణాల వివరాల సమాచార లోపం జరగడంపై సమగ్ర విచారణ చేపట్టడం జరుగుతుందన్నారు. డియస్‌హెచ్ డాక్టర్ సిరి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో అధికంగా నమోదైన మరణాల గురించిన వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకురావడంలో జరిగిన వైఫల్యాలు గుర్తించేందుకు, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై ప్రభుత్వానికి సిఫారసు చేసేందుకు ఐఎఎస్ అధికారి డాక్టర్ అట్టాడ సిరి నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా విధుల నిర్వహణలో విఫలం చెందిన వైద్యారోగ్య సిబ్బందిపై శాఖాపరంగా చర్యలుంటాయని స్పష్టం చేశారు. విధుల నిర్వహణలో అలక్ష్యాన్ని ప్రదర్శించిన అన్ని స్థాయిల్లో ఉన్నవారిపై తప్పకుండా చర్యలుంటాయన్నారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ గా ఉన్న(డియస్‌హెచ్) డాక్టర్ సిరి కమిటీ వారంలోగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందని మంత్రి చెప్పారు. సాధారణ స్థాయిలో కంటే మరణాలు అధికంగా ఉన్నప్పుడు అన్ని స్థాయిల్లోని అధికారులకు వెంటనే సమాచారం అందేలా అధునాతన సాంకేతికతను వినియోగించుకోవడంపై కూడా ఈ కమిటీ ప్రభుత్వానికి సూచనలిస్తుందని చెప్పారు.

మరణాలకు దారితీసిన కారణాలపై లోతుగా విశ్లేషణ గుంటూరు రూరల్ మండలం తురకపాలెం గ్రామంలో శుక్రవారం నాడు మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటించారు. ఉచిత వైద్య శిబిరంలో స్థానికులకు అందుతున్న వైద్య సేవలను నేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఈఏడాది జులై నుంచి సెప్టెంబర్ తొలి వారం వరకు 23 మరణాలు జరిగాయి. అయినప్పటికీ క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ఉన్నతాధికారుల్ని అప్రమత్తం చేయకపోవడం దురదృష్టకరమన్నారు. మరణించిన వారిలో ఏడుగురు 70 ఏళ్లు దాటినవారున్నారు. మిగతా వారి వయసు సగటున 55 ఏళ్లవరకు ఉంది. మరణాలకు గల కారణాలపై లోతుగా విశ్లేషిస్తున్నామని, 14 రకాల వైద్య బృందాలు ఏర్పాటు చేశారని, వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. అందరి రక్త నమూనాలతో పాటు నీరు, మట్టి నమూనాలు కూడా తీసుకున్నారని చెప్పారు. జ్వరంబారిని పడినవారందరికీ రక్త పరీక్షలు చేస్తున్నారన్నారు. మైలోడియోసిస్‌పై సమాచారం లేదు మైలోడియోసిస్ బ్యాక్టీరియా ఉన్నట్లు వార్తలొచ్చాయని, అయితే ఇప్పటివరకు అందిన రక్తనమూనాల పరీక్షల ఫలితాల్లో అటువంటిది కనిపించలేదన్నారు. ఎలాంటి బ్యాక్టీరియా అనేది ఇంతవరకు అంతుచిక్కలేదన్నారు. కెమికల్, బయొలాజికల్ పరీక్షలు కూడా చేయిస్తున్నామన్నారు. బాధితులకు గుంటూరు జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో చికిత్స అందిస్తున్నామన్నారు. మరణాలకు రకరకాల కారణాలు చెబుతున్నారని అపరిశుభ్రత, కలుషిత నీరు వంటి కారణాలు చెబుతున్నారని మంత్రి పేర్కొన్నారు.

# ప్రధాని మోడీతో మంత్రి లోకేష్ భేటీ

>> విజ్ఞప్తి చేశారు. విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నాం, ఉన్నతవిద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు మీ సహకారం, మార్గదర్శనం కావాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15నెలలుగా మీ సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం, మీ నేతృత్వంలో వికసిత్ భారత్ 2047లో భాగస్వాములం అవుతామని అన్నారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్య తరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీజీకి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న ప్రధానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను మంత్రి లోకేష్ వివరించారు. ప్రధాని మోడీ స్పం దిస్తూ రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈ సందర్భంగా ప్రధానికి లోకేష్ బహుకరించారు.

# ఉపాధ్యాయుల్ని సత్కరించిన 'కోలా'


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** :శ్రీకాళహస్తిలోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ శుక్రవారం గురుపూజోత్సవం సందర్బంగా ఉపాధ్యాయుల్ని సత్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో జీవనం ప్రారంభించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత దేశ రాష్ట్రపతి అయ్యారని ఉపాధ్యాయ వృత్తి ప్రాధాన్యతను దేశ నలుమూలల చాటారని వివరించారు. అంతటి మహోన్నతమైన వ్యక్తి అన్నారు. సమాజంలో ఉపాధ్యాయులు ఎందరో మహోన్నత వ్యక్తులను తీర్చి దిద్దుతున్నారని వివరించారు. నేడు మనం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామంటే అది ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవం అన్నారు. మన భవిష్యత్తును తీర్చి దిద్దే మొదటి వారు గురువులే అన్నారు. తల్లి దండ్రులు కలలు కంటే ఆ కలలను సాకారం దిశగా ప్రయత్నించే మహామహులు ఉపాధ్యాయులు అన్నారు. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దే వారు ఉపాధ్యాయులన్నారు. ఒక నాడు విద్యకోసం మన పూర్వీకులు ఆశ్రమాలకు వెళ్లె వారని నేడు ప్రభుత్వాలు ఎన్నో సదుపాయాలు కల్పిస్తుందన్నారు. విదేశీ విద్యకు నేడు ఎన్నో సదుపాయాలు కల్పి స్తున్నట్లు తెలిపారు. కాబట్టి మన జీవితంలో మొదటి స్థానం గురువులకు ఇవ్వాలని తెలిపారు. గురువు కృషి వెలకట్టలేనిదన్నారు. మన సంప్రదాయాలు, సంస్కృతిని, సంప్రదాయాలను తీర్చిదిద్దే గురువును విస్మరించరాదన్నార్లు. ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరెడ్డి, మునీంద్ర, జయచంద్రాంరెడ్డి, రమేష్, సుబ్బ,శర్మలను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి నాయకులు కొండేటి గోపాల్,గరికపాటి రమేష్‌బాబు, ఇమిడిశెట్టి మోహన్, కోనేటి అయ్యప్ప, నరేంద్ర, చందురాయల్, సిద్దు రాయల్, సజ్జా హరిష్, భరత్‌నాయుడు,చోటు తులసి,కుమార్, గిరిధర్‌సాయి. మారి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం
### - మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాత వార్తప్రతినిధి:** దేశంలో పన్ను వ్యవస్థను సులభతరం చేయడం కోసం జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదనిమంత్రి కందుల దుర్గేష్ అన్నారు. జీఎస్టీ స్లాబుల సరళీకరణ - పర్యాటక, సినిమా రంగాలకు ఊతమన్నారు. జీఎస్టీ సంస్కరణలతో తక్కువ ధరల్లో వినోదం అన్నారు. పర్యాటక, సినిమా రంగాల బలోపేతానికి దోహదమవుతుందన్నారు. బడ్జెట్ ట్రావెలర్, డొమెస్టిక్ టూరిజంలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. 18 శ్లాబ్ పరిధిలోకి సినిమా ప్రొడక్షన్ సేవలు..తద్వారా నిర్మాతలకు ఆర్థికంగా మేలు అన్నారు. ట్యాక్స్ లు తగ్గితే సినిమా, పర్యాటక రంగాల్లో ఉపాధి పెరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. హోటల్ రూమ్ టారిఫ్‌లు రూ.7,500 లోపు ఉన్న వాటిపై పన్ను 12 నుండి 5 కు తగ్గింపు ఉంటుందన్నారు. ఇన్స్టారెంట్ బిల్లులపై పన్ను కూడా 12-18 నుండి 5 కి తగ్గించబడుతుందన్నారు..సినిమా టికెట్లు రూ.100 లోపు ఉంటే 12 జీఎస్టీ, రూ.100 పైగా ఉంటే 18 జీఎస్టీ కొనసాగుతుంది: మంత్రి దుర్గేష్.. జీఎస్టీ సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్.

## దొంగిలించిన హుండీ సొమ్ము తిరిగి అమ్మవారికి
### అనారోగ్యంపాలైన కుటుంబసభ్యులు


హుండీని లెక్కపెడుతున్న గ్రామస్తులు

**బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఎంతో ప్రతిభగల అమ్మవారు శ్రీ ముసలమ్మతల్లి దేవాలయం గ్రామ సమీపంలో ఉన్నది. బుక్కరాయసముద్రంతోపాటు అనంతపురం ఇతర జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటూఉంటారు. ముఖ్యంగ చెప్పాలంటేనే బుక్కరాయసముద్రం గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉన్నారంటే అది ఒక ముసలమ్మ తల్లి అనుగ్రహామే నని చెప్పవచ్చు,గ్రామ సమీపంలో ఉన్న చెరువు కట్ట అను నిత్యం తెగిపోతాఉంటే ప్రజలు ఇబ్బందు పడుతున్నారని గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి కుటుంబీలైన శ్రీ ముసలమ్మ తల్లి చెరువుకట్టకు బలిహారం కావడంతో చెరువుకట్ట తెగిపోకుండ నిలబడినాదని చరిత్ర చెప్పుతుంది. భక్తుల కోరిన కోర్కెలు తీర్చు శ్రీ ముసలమ్మ తల్లి దేవాలయంలో 22.7.2025 న కొందరు గుర్తు తెలియని దుండగులు సీసీకెమరాలను ద్వంసంచేసి గుడిలోకి చొరబడి గుడిలో ఉన్న హుండీని గొంగలించారు. ఈ విషయం పై ఆలయ ధర్మకర్త సుశీలమ్మ పోలీస్టేషన్ ల్లో ఫిర్యాదుచేయగా పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తుచేసున్నారు. శుక్రవారం హుడిని దొంగలించిన దుండగులు తిరిగి అమ్మవారి ఆలయ ప్రాంగనంలో పడేసి పోయారు. వాటిని గమనించిన ఆలయకమిటీ ధర్మకర్త సుశీలమ్మ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసుల సమక్షంలో హుండీని తెరవగా అందులో ఒక లేఖను రాసి పెట్టారు ఆ లేఖలో అమ్మవారి హుండీని నలుగురం చోరిచేశామని చోరిచేసినప్పటినుండి తమ ఇండ్లలో పిల్లల అనారోగ్యం తో బాదపడుతున్నారు. తెలియక అమ్మవారి సొమ్ము దొంగలించామని అందులో కొంతవాడుకున్నామని రాసి సంచిలో పెట్టి వెల్లిపోయారు. అనంతరం పోలీసుల సమక్షంలో హుండీని లెక్కించగా అందులో 1,86,486 రూపాయలు ఉన్నట్లు తెలిపారు.

# కాణిపాకంలో కన్నుల పండువగా త్రిశూలస్నానం


స్వామివారి ఆయుధం త్రిశూలానికి కలశాలలోని పవిత్రజలం, పాలతో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

**కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలో భాగంగా నవరాత్రి ఉత్సవాల చివరిరోజు శుక్రవారం త్రిశూలస్నానం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో గత నెల 28 నుండి ప్రారంభమైన స్వామివారి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం జరిగిన ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవతో ముగిసింది. నవరాత్రి ఉత్సవాల అంకురార్పణ సందర్భంగా ప్రధాన ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో నవదాన్యాలను మొలకపోసి, అష్టోత్తర కలశాలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో యాగశాల పూజలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా స్వామివారి ఆయుధమైన త్రిశూలాన్ని స్వామివారు వాహనసేవల్లో ఊరేగే కాణిపాకం పురవీధుల్లో ప్రతిరోజూ ఉదయం ఊరేగిస్తుంటారు. స్వామివారి నవరాత్రి ఉత్సవాలు ముగిసినందున త్రిశూల స్నానం గావించారు. తిరుమల చక్రస్నానం తరహాలో కాణిపాకంలో త్రిశూల స్నానం ఘట్టం జరిగింది. ఈసందర్భంగా ముందుగా యాగశాలలో యాగమూర్తికి పూజలు నిర్వహించి పూర్ణాహుతి అనంతరం త్రిశూలాన్ని కాణిపాకం పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయం పవిత్ర పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం పుష్కరిణిలోని నీటిలో త్రిశూలస్నానం గావించారు. ఈసందర్బంగా యాగశాలలోని అష్టోత్తర కలశాలలోని పవిత్రజలంతో త్రిశూలానికి అభిషేకం గావించారు. అలాగే అంకురార్పణ రోజున మొలకపోసిన నవదాన్యాలను పుష్కరిణిలో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ధనపాల్, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు,స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ లీలా సుధీర్‌లతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి
### మంటపం వద్ద పేలుడు ఇరువురికి గాయాలు

**కోవూరు,(నెల్లూరు) సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** శుక్రవారం తెల్లవారుజామున కోవూరులోని సత్రం వీధి ప్రాంతంలో గణేష్ నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా టపాసులు కాల్చే సమయంలో అపశృతి జరిగి తృటితో భారీ ప్రమాదం తప్పింది. కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సమాచారం మేరకు కోవూరులోని సత్రంవీధి ప్రాంతంలో యథావిధిగా వినాయకచవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం రాత్రి అక్కడి నుంచి ఊరేగింపుగా విగ్రహం బయలుదేరింది. ఈ నేపథ్యంలో సత్రంవీధి ప్రాంతంకు వచ్చే సరికి సాయిబాబా మెడికల్స్ షాపు పక్కనే ఉన్న స్థలంలో ఈ గణేష్ ఉత్సవ నిర్వాహకులు మెట్ల ప్రాంతంలో పేలుడు సామగ్రిని నిల్వ ఉంచారు. ఈ నేపథ్యంలో రహదారిలో టపాసులు కాలుస్తుండగా అందులో ఉన్న నిప్పు రవ్వలు నిల్వ ఉన్న టపాసులపై పడి భారీ స్థాయిలో పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఆ ప్రాంతంలో ఉన్న ఎలక్ట్రికల్ స్కూటీ కూడా పేలిపోయింది. ఈ సంఘటనలో సాయిబాబా మెడికల్ షాపు యజమాని బ్రహ్మయ్య సతీమణి లక్ష్మి(45) తీవ్రగాయాలయ్యాయి. అదే ప్రాంతంలో ఉన్న రామ్‌దేవ్‌బాబాకు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సిబ్బందితో వెళ్లి నిశిత పరిశీలన చేపట్టారు. ఈ పేలుడు సందర్భంగా షాప్ షట్టర్ దెబ్బతినడ, షాపులో ఉన్న మెడికల్ వస్తువులు కూడా కింద పడిపోవడం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# మహమ్మద్ ప్రవక్తలా నిరాడంబర జీవితాన్ని అలవాటు చేసుకోవాలి
### ఆదర్శాలకు స్వస్తి: దారితప్పుతున్న జీవన గమనం:హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** మహమ్మద్ ప్రవక్త ఆచరించిన నిరాడంబర జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ పిలుపు నిచ్చారు. శుక్రవారం జామియా మస్జిద్‌లో రేహాన్, నూర్ఏమస్జిద్‌లో మౌలానా మహమ్మద్‌ఆలీ సాహెబ్‌లు దివ్యఖుర్ ఆన్ పఠనానికి సంబందించి చైతన్య పరచారు. జామియా మస్జిద్‌లో రేహాన్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా సంబరాలు జరిపించుకోవటం కాదు. అది మన సంప్రదాయం, సంస్కృతి కాదన్నారు. ఆయన తను జన్మించిన సోమవారం, గురువారం ఉపవాస దీక్షలు పాటించేవారు అన్నారు. ఆయన నిరాడంబర జీవితాన్ని అనుభవిస్తూ భావి తరాలకు మార్గదర్శకులయ్యారన్నారు. నేడు మనం జన్మదినం అంటే సంబరాలుమిన్నుముట్టుతున్నాయన్నారు. మనం నిత్యం అల్లాహ్ మార్గాలను విడనాడి మనం స్వర్గం ప్రాప్తించాలని కోరుకోవటం కరెక్టు కాదన్నారు. మనం దివ్యఖుర్‌ఆన్‌తో సంబంధం లేకుండా జీవనం గడుపుతున్నామని దాని వల్ల నిత్యం దుఃఖంలో మునిగి తెలుతున్నామన్నారు. మనం ఎంత సంపాదించిన ఒదుగు కనబడటం లేదన్నారు. ఆయన శుక్రవారం నూర్ఏ మస్జిద్‌లో దివ్యఖుర్ ఆన్ పఠనానికి సంబందించి దిశ దెశ నిర్దేశం చేసారు. మనం ఇస్లాం మతంలో పుట్టి ముస్లింలుగా నటిస్తున్నాము తప్ప నాడు మన ప్రవక్త ఆచరించిన విధానాలు,ఆచారాలు, సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ స్వర్గస్తులు కావాలని కోరుకోవటం సరికాదన్నారు. ప్రవక్త జీవితం మనకు మార్గదర్శకం కావాల్సి ఉండగా ఆచారాలకుతుంగలో తొక్కి కట్టుబొట్టు అన్ని మార్చుకున్నామన్నారు. మనం కలియుగం అంతంతో ఉన్నామన్నారు. అల్లాహ్ ఆదేశాలను మన ప్రవక్త ద్వారా అందించారని అయితే మనం కనీసం ఐదుపూటల్లా నమాజును కూడా ఆచరించలేని దీన స్థితిలో ఉన్నామన్నారు. ఈ నిర్లక్ష్యం నుంచి బయట పడాలన్నారు. ప్రవక్త ఆచరించిన మార్గాన్ని ఆచరిస్తూ యుగాంతంలో స్వర్గస్తులు కావాలని సూచించారు. జన్మదినాలంటే సంబరాలు జరుపుకోటం కాదు. ఆయన ఆచరించిన విధానాలను,జీవిత మార్గాలను ఆచరిస్తూ సన్మార్గంలో పయనించాలన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ రమణరావు సస్పెన్షన్

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** అనంతపురం అర్బన్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జాయింట్ వన్ సబ్ రిజిస్టర్ రమణరావు ను సస్పెన్షన్ చేస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి విజయలక్ష్మి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. సబ్ రిజిస్టర్ రమణరావు ఇటీవల డబల్ రిజిస్టర్లు చేయడంతో ఫిర్యాదులు వచ్చాయి.

దీనిపైన విచారణ చేసి సస్పెన్షన్ చేయడం జరిగిందన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు



**విజయ వాడ, సెప్టెంబరు5, పభా తవా ర్తప్రతి నిధి:** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు చేశారు. "శిష్యుల ఉన్నతిలోనే తమ విజయాన్ని చూసుకొని ఉపాధ్యాయులు సంతోషిస్తారు. తల్లితండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పే గురువును దైవంతో సమానంగా పూజించే సంస్కృతి మనది. నేడు గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయి అధ్యాపకులు, ఆచార్యులకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. పాఠశాల దశ నుంచే విద్యార్థులకు అకడమిక్ సంబంధిత అంశాలతోపాటు నైతిక విలువలు కూడా నేర్పించాలని ఉపాధ్యాయులను కోరుతున్నాను. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామకం చేపట్టింది. డీఎస్సీ నియామకంతో విధుల్లోకి రాబోతున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలియచేస్తున్నాను" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ మండలంలో గల మదగడ గిరిజన గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన రద్దు అయింది. ప్రభుత్వం పరంగా కార్యక్రమాలు, సమావేశాలతో బిజీగా ఉండటంతో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. మదగడ గిరిజన గ్రామాన్ని శుక్రవారం సందర్శిస్తానని ఇటీవల పవన్ కల్యాణ్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## ఉపాధ్యాయులకు వైఎస్సార్సీ అధినేత జగన్ శుభాకాంక్షలు

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయులందరికీ వైసిపి అధినేత జగన్ శుభాంకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వైఎస్ జగన్ శుక్రవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో.. "మాజీ రాష్ట్రపతి, భారతరత్న, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ మనస్ఫూర్తిగా నివాళులు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

## అంధ విద్యార్థులకూ సైన్స్ కోర్సులు : ప్రభుత్వం ఉత్తర్వుజారీ

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** అంధ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో సైన్స్ కోర్సులు చదివేందుకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు సంబంధించిన జిఓ 278ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం విడుదల చేశారు. ఈ విద్యాసంవత్సరం నుంచి అంధ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మేథమేటిక్స్ వంటి కోర్సుల్లో చదువుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రాక్టికల్స్ స్థానంలో విద్యార్థులకు బహుళ ఎంపిక ప్రశ్నాపత్రం అందిస్తామని పేర్కొన్నారు. దృష్టిలోపం విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డు కాకూడదని, మిగిలిన విద్యార్థులతో వీరికి సమానంగా అవకాశాలు కల్పించడానికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపారని మంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సైన్స్ కోర్సుల్లో అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరడంతో మంత్రి ఈమేరకు చొరవ తీసుకున్నారని పేర్కొంది.

## వైభవంగా గణనాథుని ధ్వజారోహణం

**కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గత నెల 27 నుండి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా 28న ధ్వజారోహణంతో ప్రారంభమైన నవరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం జరిగిన ధ్వజావరోహణంతో ముగిసింది. ముందుగా ఉదయం ఆలయంలో త్రిశూల స్నానం, వసంతోత్సవం కార్యక్రమంను కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమంను నిర్వహించారు. ఈమేరకు నవరాత్రి ఉత్సవాలు దిగ్విజయంగా నిర్వహించేందుకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ గత నెల 28న ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించగా, తొమ్మిది రోజులు అనంతరం శుక్రవారం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయదారులచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించిన అనంతరం ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభంపై ఎగుర వేసిన మూషికపటాన్ని శాస్త్రోక్తంగా పూజల అనంతరం అవతనం గావించారు. ఈసందర్భంగా మూషిక పటానికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి వడాయత్తు ఉత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి వడలతో మాలవేసి, పెసరు పప్పు పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు.

# తిరుమల సమాచారం

## 24నుండి శ్రీవారి సేవకు ట్రైనర్ల శిక్షణ
### - 8 అంశాలలో నైపుణ్యం



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాత వార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న అశేషసంఖ్య భక్తులకు అన్ని విభాగాల్లో ఇతోధిక సేవలందిస్తున్న శ్రీవారిసేవకులకు మరింత నైపుణ్యం కలిగించేందుకు ట్రైనర్లకు శిక్షణాతరగతులు నిర్వహిస్తున్నారు. మొదటివిడత శిక్షణను ఈనెల 24వతేదీ నుండి అమలుచేసే దిశగా టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. గ్రూప్‌పర్యవేక్షకులు, సేవకుల ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్‌పై ప్లానింగ్ విభాగానికి చెందిన నలుగురు నిపుణులుపవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. శ్రీవారిసేవకులకు సంబంధించి గ్రూప్ పర్యవేక్షకులు, ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్‌పై శుక్రవారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, రాష్ట్ర ప్లానింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావుతో కలసి వర్చువల్‌గా ఐఐఎం అహమ్మదాబాద్ నుండి ఆచార్యులు విశ్వనాథ్, రామమోహన్, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిలతో ఇఒ శ్యామలరావు సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు సూచనలతో శ్రీవారిసేవకుల ప్రమాణాలను పెంపొందించాలనే ఉన్నతమైన సంకల్పంతో తగ కొద్దికాలంగా పలు సంస్కరణలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా గ్రూప్ సూపర్‌వైజర్లు, సేవకుల ట్రైనర్‌ల రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక యాప్‌ను ప్రారంభించామన్నారు. శ్రీవారిసేవకుల ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు మరింత పటిష్ట ప్రణాళికలు,బోధన పాఠ్యాంశాలను రూపొందించాలని సూచించారు. శిక్షణ పొందిన ట్రైనర్లు, సూపర్‌వైజర్లు సేవకులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. మొదటివిడతగా ఈనెల 24వతేదీ శిక్షణ ప్రారంభించి మూడురోజులు కొనసాగుతుందన్నారు. ఉదయంవిధానపరమైన అంశాలపై, మధ్యాహ్నం వివిధ సేవా కేంద్రాల్లో క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్ళి పరిశీలించేలా రూపొందించాలన్నారు. పటిష్టసేవ అందించేందుకు నైపుణ్యాలు, స్ఫూర్తిదాయకమైన నాయకత్వం, సులభపద్దతిలో అందరికీ అర్థమయ్యేలా ఆదర్శసేవకుడి లక్షణాలు ,పలుభాషలలో ప్రాథమిక నైపుణ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇఒ సూచించారు. ఈ సమావేశంలో టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిఎఫ్ఒ,ఐటి ఇన్‌ఛార్జి జిఎం ఫణికుమార్‌నాయుడు, శ్వేతడైరెక్టర్ రాజగోపాల్, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

## శ్రీవారిసేవలో పాట్నా హైకోర్ట్ జడ్జి అనుపమ చక్రవర్తి



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటంబంతో కలసి పాట్నా హైకోర్ట్ జడ్జి జస్టీస్ అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదేవుని దర్శనం బాగా జరిగిందని తెలిపారు.

## బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి అజ్ఞాతభక్తుడు రూ.కోటిన్నర విరాళం

**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్‌కు ఓ అజ్ఞాతభక్తుడు భారీ విరాళం అందించాడు. బెంగుళూరుకు చెందిన ఓ అజ్ఞాతదాత 1.50కోట్ల రూపాయలు విరాళాలను శుక్రవారం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలసి అందజేశారు. శ్రీవేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో ఈ విరాళమిచ్చినట్లు ఆ భక్తుడు తెలిపాడు.

## భగవంతుని ఆశీర్వాదం అందరిపై ఉండాలి
### - ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్మన్ జస్టిస్ రామసుబ్రమణ్యం



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుని ఆశీర్వాదంతోనే ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లుతారని, భగవన్నామస్మరణతోనే మంచి జరుగుతుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఎన్‌హెచ్‌ఆర్‌సి ఛైర్మన్ జస్టీస్ రామసుబ్రమణ్యం తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో లోకం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో ఆలయంలోనికి చేరుకుని స్వామివారి దర్శనానంతరం ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. టిటిడి రిసెప్షన్ ఓఎస్‌డి సత్రానాయక్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తెలంగాణ సస్యశ్యామలంగా అభివృద్ధి చెందాలి
### - నూతన సిఎస్ రామకృష్ణారావు



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలంగాణ సస్యశ్యామలంగా అభివృద్ధిచెందాలని ఆరాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆకాంక్షించారు. స్వామివారి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నారు. శుక్రవారం ఉదయం నైవేద్యవిరామసమయంలో కుటుంబంతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఇప్పటినుండే అప్రమత్తంగా ఉండాలి



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుని సాలకట్ల బ్రహ్మోత్సవాలు రెండువారాల్లో జరగనున్నా ఇప్పటినుండే అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు ప్రముఖులు, వివిఐపిలతోబాటు సామాన్యభక్తులు విచ్చేస్తారని, వారందరికీ గ్యాలరీల్లోకి ప్రవేశనిష్క్రమణ మార్గాలు సాఫీగా ఉండేలా చూసుకోవాలన్నారు. గ్యాలరీల వద్ద నిరంతరం భద్రత ఉండాలని, తరచూ తిరుమల, ఆలయ మాఢవీధులు తనిఖీలు చేసుకోవాలన్నారు. శుక్రవారంసాయంత్రం తిరుమలకు వచ్చిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, సిఐలు విజయకుమార్, రాముడుతో కలసి ఆలయ మాఢవీధులను పరిశీలించారు. ఆలయం ముందు బేడి ఆంజనేయస్వామి ఆలయం, ఆస్థానమండపం, అఖిలాండం వద్ద భక్తులు వేచిఉండటం, సిఎం పట్టువస్త్రాలు సమర్పణకుపర్యటించే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన భద్రతపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రణాళికలుసిద్దంచేయాలని అధికారులకుసూచించారు.

వార్త

మన భవిష్యత్తు మనం పుట్టిన ఘడియలు బట్టిగాని, మరింకా దేనిమీదనో గాని ఆధారపడి లేదు. అది కేవలం మన స్వశక్తిపై ఆధారపడి ఉంది.

-రాజాజి

# ఆశావహ సంస్కరణలు!


నిత్యావసర వస్తువుల కొనుగోలుదారుల్లో, వాణిజ్య వ్యాపార రంగాల వారికి తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జిఎస్టీ2.0 సంస్కరణలు కొత్త ఆశలు మొలకెత్తింప చేశాయి.ఆశయాల మాటెలా ఉన్నా ప్రతిపాదనలు బేషుగ్గా ఉన్నాయి. నాలుగు శ్లాబుల పన్ను రేటు నుంచి కేవలం రెండే శ్లాబులను, అదీ మునుపటి కన్నా తక్కువగా నిర్ణయించడమంటే ఇది భారతీయుల విజయం కిందనే లెక్క. అదీగాక దీపావళి నుంచి అమల్లోకి వస్తాయనుకున్న పన్ను రేట్లు ఈ నెల 22 నుంచే తగ్గుతాయంటే జనంలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. ఈ తగ్గింపుల కారణంగా సామాన్య మధ్య తరగతి ప్రజానీకానికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రయోజనాలు అందిందనే. ఇప్పటివరకు వేధించిన 12 శాతం, 28శాతం పన్నులు ఇక ఉండబోవని కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడంతో సామాన్యులకు ఎన్నో సడలింపులు కలుగుతాయి. తద్వారా వారు కొనుగోలు చేసే ప్రతి వస్తువు పైనా ధరల సర్దుబాట్లు జరిగి వినిమయ వస్తువులధరల్లో తగ్గింపు కనపడుతుంది. 56వ జిఎస్‌టి మండలి నిర్ణయాలకు అశేష భారతీయ జనావళి స్వాగతిస్తూ జేజేలు పలికారు. కాని వస్తుసేవల పన్ను విషయంలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణల కోసం ఎనిమిదేళ్లు అవసరమా అంటూ విపక్షాలు దుయ్యబట్టడమొక్కటే మిగిలింది. 2017 తర్వాత ఇన్నాళ్లకు జిఎస్టీ వలన సాధారణ వర్తకులు కార్పొరేట్ వాణిజ్యవేత్తలు ముక్తకంఠంతో సంతోషం వ్యక్తంచేశారు. కారణమేదైనా జిఎస్టీ శ్లాబుల సవరింపు బేషుగ్గా ఉంది. మందగమనంలో ఆర్థిక వృద్ధి, పొదుపు సంస్కరణలు, కుటుంబ రుణాల విస్తృతి,సామాన్యుడి నెత్తిన పడుతున్న ఆర్థిక భారాలు, జిఎస్టీ పన్ను, సంస్కరణలకు దారితీసి ఉంటాయని అంచనా. విపక్షాలు తమ వంతు విమర్శగా బీహారు ఎన్నికలు, అమెరికా టారిఫ్‌ల ఒత్తిడి కారణంగానే జిఎస్టీ పన్నుల విషయంలో ముందస్తు ప్రకటన చేసి ఉంటారంటున్నారు. తమ పార్టీ ఎన్నో ఏళ్లుగా జిఎస్టీ సంస్కరణ కోసం పట్టుబడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇంతవరకు జిఎస్టీలో 64శాతం పేద, మధ్యతరతగతి నుంచే వస్తుండగా కుబేరుల వంతు మూడు శాతమేనని, కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. సంక్లిష్టంగా ఉన్న జిఎస్టీ నిబంధనలను సరళతరం చేయడంతోపాటు ఎంఎస్‌ఎంఇ రంగానికి ప్రయోజనం కలిగించే నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరోగ్య బీమాకు పన్నులు ఉపసంహరించడాన్ని విశ్లేషకులు ఎంతో ఉత్తమమైన సంస్కరణగా భావిస్తున్నారు. నిన్నమొన్నటి స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని నరేంద్రమోడీ ఎర్రకోట నుంచి తన ప్రసంగంలో ప్రస్తావించిన జిఎస్టీ 2.0 సంస్కరణల కోసం ఎదురు చూసిన సామాన్యునికి ఈ రోజున మనసు కాస్తంత తేలికపడింది. వాటి ఫలాలు అంది ధరల భారం నుంచి గట్టెక్కిన నాడు నిజంగా స్వాతంత్ర్య దినోత్సవ ఫలితాలను అందుకున్నట్లే సంబరపడతాడు. జేబులు కత్తిరించే జిఎస్టీ విధానమని హుంకరించిన ప్రతిపక్షాలు సైతం జేబులు నింపే సంస్కరణలు చూడగలుతున్న ఏకైక సంస్కరణ విధానం భారతదేశంలో తొలిసారిగా ఆవిష్కరింపబడిందంటే నమ్మాలి మరి! వస్తు సేవల పన్ను అనగానే ఎంతోఆందోళన చెందిన ప్రజలకు, దేశాభివృద్ధికి 'డబుల్ డోస్' మద్దతుగా ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారంటేనే ఈ సంస్కరణల ప్రయోజనాలు అర్థమౌతాయి. పన్నుల వ్యవస్థను సంస్కరించటానికి చాన్నాళ్లు పట్టిందన్న విమర్శ తప్పితే అన్నివర్గాలు తృప్తి చెందాయి. సాధారణ ప్రజలకు డబ్బు ఆదా కావడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవడం జిఎస్టీ సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రధానంగా మానవ జీవితానికి అవసరమైన ఆరోగ్యబీమా 18 శాతం జిఎస్టీ రేటు నుంచి మినహాయింపునివ్వటమే నేటి జిఎస్టీలో చారిత్రక నిర్ణయమని బీమాదారులు నమ్ముతున్నారు. వైద్యసంబంధిత ద్రవ్యోల్బణం పెరుగుతున్న తరుణంలో సామాన్య కుటుంబాలకు కూడా వైద్యబీమా కల్పించగల శక్తి ఏర్పడ్తుంది. అందుకే ఈనాటి పన్ను సంస్కరణలు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన అందరికీ నచ్చే సంస్కరణలుగా పారిశ్రామిక వర్గాలు సైతం భావిస్తున్నాయి. రైతులనుంచి ఎంఎస్‌ఎంఈల వరకు ఫార్మా రంగమే కాకుండా దాని అనుబంధ రంగాలకు, తద్వారా వినియోగదారులకు గణనీయ లబ్ది చేకూరగలదు. వ్యవసాయ సంబంధిత సాగు పరికరాలు,వస్తువులపై 12 శాతం నుంచి జిఎస్టీ 5 శాతానికి తగ్గింది. సిమెంటుపై 28 శాతం నుంచి 18 శాతానికి మార్చడం గృహ నిర్మాణానికి సాను కూల సంకేతం, టీవీలు, ఎసిలు, ఎలక్ట్రానిక్ వస్తువులు 28 శాతం నుంచి 18 శాతానికి మారనుండగా, హానికర వస్తువులపై పన్ను స్థాయి 40 శాతానికి పెరుగుతుంది. అంటే వ్యవసాయానికి నిర్మాణరంగానికి పన్ను సడలింపులు వస్తుండగా, పొగాకు ఉత్పత్తులపై భారం ఎక్కువ పడుతోంది. వీటిపై పన్నులు పెంచడం ద్వారా వినియోగ దారులను నిరుత్సాహపరచడం మంచి ఆలోచన. అయితే ధరాభారంతో దుర్వ్యసనాలను దూరం చేయాలనుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. జిఎస్టీ రేట్లను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాలతో ఆయా రాష్ట్రాల వస్తుసేవల పన్ను వసూళ్లలో వచ్చే నష్టాన్ని భర్తీ చేసేందుకు కేంద్రం అంగీకరించింది. అయితే ఐదేళ్లపాటు రాష్ట్రాలను ఆదుకుంటే తప్ప అవి నిలదొక్కుకోలేవు.ఈ విధంగా వెసులుబాటు కల్పించగలిగితే జిఎస్టీ సంస్కరణలు అఖిల పక్షాలకు ఆశాభావమే!

పగతీర్చుకుంటే ఆ రోజు మాత్రమే ఆనందం కలుగుతుంది. ఒక రోజు ఆనందం కోసం చిరకాలం కలిగే ఆనందాన్ని బలిపెట్టకూడదు.



తిరువళ్లువర్

మనిషికి మనసును మించిన మహాశత్రువు వేరొకరు లేరు. అందుకే మనస్సును జయిస్తే ప్రపంచాన్ని జయించవచ్చు.



గురునానక్

# ప్రజాస్వామ్య లీల.. ప్రహసన హేల!

**చంద్రశేఖర్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల కమిషనర్‌గా శేషన్ నియామకం జరిగిన తర్వాత కమిషన్‌కు ఎక్కడలేని గుర్తింపు ప్రాముఖ్యత వచ్చాయి. ఒక్కమాటల్లో చెప్పాలంటే ఎన్నికల కమిషన్ అంటూ ఒకటి ఉందని, దానికి నియమావళి ఉందనే విషయం సాధారణ పౌరులకు అప్పుడే తెలిసింది.రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నీతీ,నిజాయితీతో వ్యవహరిస్తే ఉన్నచట్టాలతో ఎంత వరకు చేయవచ్చునో ఆయన చేతల్లోచేసి చూపించారు.కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలుపట్టించారు. కరెంటు స్తంభాలకు జెండాలు కట్టాలన్నా, గోడల మీద రాయాలన్నా వెనుకా ముందు ఆలోచించాల్సిన పరిస్థితులు కల్పించారు. ఏ తప్పు చేస్తే ఏ మూల నుంచి కనిపెట్టి చర్యలకు ఒడిగడతారోననే భయం అభ్యర్థుల్లోనే కాదు వారిని బలపరుస్తున్న అనుచరుల్లోకూడా తెప్పించారు. కానీ ఆయన తర్వాత ఎన్నికల కమిషన్ అంతటి సమర్థత చూపలేకపోతున్నది.**

దామెర్ల సాయిబాబ

ఎలాంటి అవకతవకలకు, అవినీతికి, అన్యాయాలకు పాల్పడకుండా సంఘంలో నీతి,నిజాయితిలతో ఆదర్శనీయంగా, అనుకరణీయంగా జీవనం సాగించి మంచివారుగా బతకాలని కొందరు త్రికరణశుద్ధిగా భావిస్తున్నా, పరిస్థితుల, వూహించని నంఘటనలు పరిస్థితిలు ప్రభావంతో మారి చెడ్డవారిగా ముద్ర వేయించుకొంటుంటారు. మరికొందరు ఎప్పుడెప్పుడు పరులను మోసం చేద్దామా? అమాయకులను దగా చేసి, రాత్రికి రాత్రే లక్ష్మీపుత్రులు కావాలనే ఆరాటంలో చేయరాని, చేయకూడని పనులు చేయాలనీ తహతహలాడుతున్నా అవకాశాలు రాక మంచివారుగా మిగిలిపోతున్నారు.. గతంలో ఎన్నికల సంగ్రామం ప్రారంభమైనపుడు మాత్రమే గెలుపే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడేందుకు సిద్ధపడేవారు. తాము చేసే అక్రమాలు వెలుగుచూస్తే సమాజం ముందు తలవంచుకొనే పరిస్థితులు దాపురిస్తాయనే భయభక్తులుండేవి. ఇప్పుడా పరిస్థితులులేవు. ఎన్నికలు ముగిసిన మరుసటి రోజు నుండే పత్యర్థులను రాజకీయంగా సమాధి చేయాలనే వ్యూహాలు పన్నుతున్నారు. ప్రత్యర్థుల,వారి సానుభూతిపరులు ఓట్లు తొలగించడం, తమకు అనుకూలమైన వారి ఓట్లతో జాబితా నింపడం పరిపాటిగా మారిపోతున్నది. బీహార్ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగనున్నాయి. ఇప్పటి నుంచే హోరాహోరీగా పోరాటం మొదలైంది. లక్షల సంఖ్యలో బోగస్ ఓట్లు చేర్చారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారంలో ఏ పార్టీ ఉన్నా అవకతవకలకు ఒక్క అడుగు ముందే ఉంటున్నట్లు గతంలో జరిగిన ఎన్నికలు చెప్పకనే చెబుతున్నాయి.అధికారంలో ఉన్న పెద్దల సేవలో తరించి పోవాలనే తపన ఉన్న అధికారలు పెరిగిపోతుండంతో ఈ ఎన్నికల నిర్వహణలో ఈ దురదృష్ట పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇక వరాల వర్షం గూర్చి చెప్పాల్సిన పనిలేదు. ప్రజలు అడిగిన పనులే కాదు అడగని వరాలు కూడా గుప్పిస్తుంటారు. ఎన్నికల సమయంలో తప్ప తాము అడిగినపనులు నేతలు చేయరనే భావన గట్టిగా పట్టుబట్టి తమ కోరికలను తీర్చిన వారికే తమ ఓట్లని చెబుతున్నారు. గతంలో కూడా ఇదే ధోరణి ఉన్నా, గుడిగోపురాలు, కమ్యూనిటీ హాలు గురించి అడిగేవారు. ఇప్పుడీ పరిస్థితులు కూడా మారిపోయాయి. ఓటు వేస్తే తమకు ఏపాటి లాభమనే ఆలోచనవైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఎన్నికల వ్యయం పెరిగిపోతున్నది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సినదాని కన్నా ఇరవై,ముప్ఫైరెట్లు అధికంగాఖర్చు పెట్టాల్సి వస్తున్నది.అంతటి ఆర్థిక, అంగబలం ఉన్నవారే ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. పార్టీలు కూడా టిక్కెట్ కేటాయించే ముందు ఈ అర్హతలనే పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఫలితంగా ప్రజా సేవచేయాలనే తపన ఉన్నవారు అంతో ఇంతో నిజాయితీగా వ్యవహరించేవారు ఈ వ్యయాన్ని భరించలేక ఎన్నికలకు దూరమవుతున్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతున్న వారికి తమపెట్టుబడిని తిరిగి రాబట్టుకోవాలని ఉండటం సహజం. అందుకే రాజకీయాల్లో అవినీతి ఒక భాగమైపోయింది. అవినీతి పెరగడానికి పరోక్షంగా నేర చరితులు, అవినీతిపరులు అందలం ఎక్కడంతో ప్రజల పాత్ర కీలకమని వాదించేవారు ఉన్నారు. ఇకపోతే గతంలో నాయకులు ఎంతో నీతినియమబద్ధంగా తమ ప్రవర్తన వ్యవహారశైలి, నడక, నడవడిక, క్రమశిక్షణే కాదు వేష భాషల పట్ల కూడా ఎంతో జాగ్రత్తలు తీసుకునేవారు. తమను ప్రతినిత్యం వెయ్యికళ్లు గమనిస్తుంటాయనే జంకు, భయం వారిలో ఉండేది. అందుకే రాజకీయాల్లో ప్రవేశించి మరింత ఎత్తుకు ఎదగాలనుకునేవారు ప్రతి అడుగు అంతో

## ఒక్క మాట

ఇంతో ఆచితూచి వేసేవారు. అవినీతి, ఆశ్రితపక్షపాతం వీటన్నింటినిమించిన ప్రవర్తన పట్ల ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవారు. గ్రామసర్పం చులుగా రాజకీయ ప్రవేశం చేసిన వారు అంచెలంచెలుగా ఆనాటి సమితి అధ్యక్షులుగా,శాసనసభ్యులుగా, పార్లమెంటు సభ్యులుగా,రాష్ట్ర మంత్రులుగా, ముఖ్యమంత్రులుగా, కేంద్ర మంత్రులుగా పెరిగిన వారెందరో ఉన్నారు. నేరచరితులు పెరిగిపోతున్నారు. దీన్ని అడ్డుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. గత ఇరవైయేళ్లుగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు విజయం సాధించిన వారిలో లెక్కలు పరిశీలిస్తే ఎన్నికల ఎన్నికలకు నేరచరితుల సంఖ్య పెరిగి పోతున్న విషయంస్పష్టమవుతున్నది.రానురాను ఈ సంస్కృతి పెరిగిపోతుందనడానికి ఆ అంకెలే అద్దం పడుతున్నాయి. ఈ పార్టీ, ఆపార్టీ అనికాదు. ఏదోకొద్ది మంది కొన్ని పార్టీలు తప్ప అన్నిపార్టీలు అదేబాటలో పయనిస్తున్నాయి. ఏమిచేసి అయినా అధికారాన్ని కైవసం చేసు కోవాలనే ఆరాటంలో నైతిక విలువలకు లోదకాలిస్తున్నాయి.ఈ ఆరాటపోరాటంలో చేయకూడని, చేయరాని పనులు కూడా చేస్తున్నారు. ఎన్ని చట్టాలు చేసినా,మరెంత పకడ్బం దీగా ఏర్పాటు చేసినా పోలింగ్‌లో కొన్నిప్రాంతాల్లో రిగ్గింగ్‌ను, దౌర్జన్యాన్ని నిరోధించలేకపోతున్నారు. రాజకీయ పార్టీలు విరాళాల పేరుతో నల్లధనస్వాముల నుంచి నిధులు పోగేసు కుంటున్నాయి. ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బును వెదజల్లు తున్నారు. చట్టంలో లొసుగులను అడ్డం పెట్టుకొని కొన్ని పార్టీలు ధనసేకరణకు పెద్దఎత్తున పాల్పడుతున్నాయి. ఇది ఇప్పటికిప్పుడు కొత్తగా పుట్టింది కాకపోయినా రాను రాను పెరిగిపోతున్నది.కొన్ని రాజకీయ పార్టీలు విరాళాల రూపేణ నల్లధనాన్ని మార్చుకు నేందుకు ఉద్భవించాయనే ఆరోపణల ను తోసిపుచ్చలేం. గ్రామస్థాయి నుండి సాధారణ శాసనసభ, లోక్‌సభ, ఒక్కటే మిటి ఏ ఎన్నికలు జరిగినా కోట్లాదిధనం నీరులా ప్రవహిం పచేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయితే వీటిని నియంత్రించేందుకు ఏనాటి నుంచో చట్టాలు న్నాయి. మరెన్నో నిబంధనలున్నాయి. వాటిని అమలు చేయాల్సిన అధికారుల్లో చిత్తశుద్ధి లేదేమోననిపిస్తున్నది. భారతదేశంలో లోక్‌సభ నియోజకవర్గాలకు కానీ,శాసనసభ లకు పోటీపడుతున్న అభ్యర్థులు గరిష్టంగా ఎంతఖర్చుచేయ వచ్చో పటిష్టమైన చట్టం, నిబంధలు ఏర్పా టుచేశారు. ఇవి ఎంతవరకు అమలు అవుతున్నాయో అందరికి తెలుసు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు చేస్తున్న ఖర్చు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొన్నిరాష్ట్రాల్లో డబ్బులు, చీరలు, ముక్కు పుడకలు, కమ్మలు ఒక్క టేమిటి ఏమి ఇస్తే తమకు ఓట్లు వేస్తారోననే తర్జనభర్జనలు చేసి ఎంతో ముందుగానే నిలవచేసుకుంటున్నారు. ప్రతిఎన్నికల్లో పోలీసులకు పట్టుబడుతూనే ఉన్నాయి. ఆ ఎన్నికలకు ఎన్నికల కమిషనే ఊపిరి.అందుకే భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరించగలిగే స్వతంత్ర ప్రతిపత్తి హోదాతో దేశంలోని చట్టసభలకు ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 1952నుంచి లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభ ఎన్నికలు ఈ ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి.రాష్ట్ర పతి,ఉపరాష్ట్రపతి ఎన్నికలుకూడా కమిషన్ పరిధిలోకే వస్తాయి. మొదట్లో ఏకసభ్య కమిషన్ ఏర్పడిన తర్వాత త్రిసభ్య కమిషన్‌గా రూపాంతరం చెందింది. ఎన్నికల్లో ఎంత ఖర్చు పెట్టాలి?సభలు, సమావేశాలు ఏ సమయం వరకు నిర్వహించుకోవచ్చు?ఎన్ని వాహనాలు వాడాలి? తదితర విషయాల్లో స్పష్టమైన నిబంధనలతో ఎన్నికల నియమావళిని రూపొందించారు. ఈ నియమని బంధనలన్నింటినీ చాలాకాలం ఫైళ్లల్లోనే నిద్రపుచ్చారు. చంద్రశేఖర్ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నికల కమిషనర్‌గా శేషన్ నియామకం జరిగిన తర్వాత కమిషన్‌కు ఎక్కడలేని గుర్తింపు ప్రాముఖ్యత వచ్చాయి.ఒక్క మాటల్లో చెప్పాలంటే ఎన్నికల కమిషన్ అంటూ ఒకటి ఉందని, దానికి నియమావళి ఉందనే విషయం సాధారణ పౌరులకు అప్పుడే తెలిసింది. రాజకీయ ఒత్తిడిలకు లొంగకుండా నీతీ,నిజాయితీతో వ్యవహరిస్తే ఉన్నచట్టాలతోఎంత వరకు చేయవచ్చునో ఆయన చేతల్లోచేసి చూపించారు.కొమ్ములు తిరిగిన నాయకులకు కూడా చెమటలుపట్టించారు.కరెంటు స్తంభాలకు జెండాలు కట్టాలన్నా, గోడల మీద రాయాలన్నా వెనుకా ముందు ఆలోచించాల్సిన పరిస్థితులు కల్పించారు. ఏ తప్పు చేస్తే ఏ మూల నుంచి కనిపెట్టి చర్యలకు ఒడిగడతారోననే భయం అభ్యర్థుల్లోనే కాదు వారిని బలపరుస్తున్న అనుచరుల్లోనూ తెప్పించారు. కానీ ఆయన తర్వాత ఎన్నికల కమిషన్ అంతటి సమర్థత చూపలేకపోతున్నది. ఇదేపరిస్థితి కొనసాగితే ప్రజాసేవకే అర్థం మారిపోవడంఖాయం.ఎన్నికల కమిషన్ రాజ కీయాలకు, రాగద్వేషాలకు అతీతంగా నిష్పాక్షికత, విశ్వసనీయతే ఊపిరిగా పనిచేయాలి.సవరణలు కొత్త చట్టాలు మాటఅటుంచి ఉన్నచట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేసేందుకు కమిషన్ కృషిచేయాలి. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజాస్వామ్యం ప్రహసనంగా మారక తప్పదు. •

# వర్ష వైపరీత్యాలకు ముందస్తు జాగ్రత్తలు అవసరమే


దాడిశెట్టి శ్యామ్ కుమార్

వర్షాకాలంలో తరచుగా సంభవిస్తున్న వాతావరణ మార్పులు అల్పపీడన ద్రోని ప్రభావం ప్రకృతి వైపరీత్యాల కారణంగా కురుస్తున్న మోతాదుకు మించిన వర్షాలు ఈదురుగాలులతో కూడి వాన బీభత్సం సృష్టిస్తుంటే పట్టణాలు గ్రామీణ ప్రాంతాలలో ప్రజల జీవన విధానం అస్తవ్యస్తమవుతుంది. పట్టణాలు గ్రామాలు జలదిగ్బంధానికి అడపాదడప గురవుతూ జలదారలుగా ప్రవహిస్తున్న వర్షపు నీటితో జనజీవనం స్తంభించిపోతుంది. పట్టణాల్లో ఎక్కడ పడితే అక్కడ ప్రణాళిక బద్ధంగా లేని కట్టడాలు ఎక్కువ అవుతుండడం, జల ప్రవాహం సాఫీగా పోయే ప్రాంతాల్లో అడ్డుకట్టాలుగా నిర్మించిన కట్టడాలు, ప్రకృతి వైపరీత్యాలలో సంభవించే వరద తాకిడికి పరిసర ప్రాంతాలలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండటం సర్వసాధారణం అయిపోతుంది. పట్టణ ప్రాంతాల్లో కొంత మేరకు చెరువుల సమీపంలో బఫర్ జోన్లు ఫుల్ ట్యాంక్‌జోన్ల పరిధిలో నాలాలుపై క్రమబద్ధీకరించబడని అక్రమ కట్టడాలతో పట్టణ పరిసర ప్రాంతాల్లో అకాల వర్షాలతో వర్ష బీభత్సంతోపట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతుండటమే కాకుండా అధికారులకు కూడా ఇలాంటి కట్టడాలతో వరద నీరును మళ్లించే ప్రయత్నంలో తీవ్రమైన ఇబ్బందులు పడవలసి వస్తున్నది. నీటి ప్రవాహం వెళ్లే దారులు మూసుకోవడంతో ప్రతికూల ప్రభావంతో వర్షాకాలంలో పట్టణం జలదిగ్బంధంగా మారి పోతూ దినచర్యలో అంతరాయం కలుగుతుంది. పట్టణాల్లో నిర్దిష్టమైన ప్రణాళికలతో సంబంధిత అధికారులుముున్ముందు రాబోయే ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడానికి వరద నీరు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వాటికి అనుగుణమైనటువంటి మార్గాలను అనుసరించవలసిన విధానాలను చట్టపరమైన రీతిలో అవలంబించవలసిన ఆవశ్యకత మరింత ఉందేమో. నిపుణులు అధికారులు ముందు చూపుతో సమాజంలో ఉన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రజల సహకారంతో పట్టణాలను సురక్షిత జోన్లుగా ఉండే విధంగా పట్టణాలను, గ్రామాలను సైతం ప్రగతి పథంలోకి తీసుకుపోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరోవైపు అధిక వర్షపాతంతో గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు మత్తడి పోస్తూ చెరువు కట్టలు తెగిపోతుండడంతో పంటలు నీట మునిగిపోతూ రైతులు తలడిల్లి పోతున్నారు. అకస్మాత్తుగా వస్తున్న వాతావరణ మార్పులతో అన్నదాత రైతన్న పంటలను కోల్పోయి పెట్టిన పెట్టుబడి చేతికందకుండా దిగుబడి పూర్తిగా కోల్పోయి నష్టాల ఒడిలో కూరుకుపోయి నేలకొరిగిన పంటలను చూస్తూ కన్నీటి పర్వంతం అవుతున్న రైతన్నల ఆవేదన వర్ణాతీతమే.వ్యవసాయాన్ని కష్టాన్ని నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకునే రైతాంగం తరచుగా వర్షాకాలంలో మోతాదుకు మించి పడుతున్న వర్షాలతో వ్యవసాయరంగంలోని భిన్న పరిస్థితులతో అనేక సమస్యలతో సతమతం అవుతుండడం మరో ఎత్తు అవుతుంది. దేశానికి వెన్నెముక అన్నంపెట్టే రైతన్న పొలాన్ని దుక్కిదున్ని పంట పండించిస్తే అల్పపీడన ద్రోణి ప్రభావంతో అధిక వర్షాలతో చేతికి వస్తుందని అనుకున్న పంట కనుల ముందే చూస్తుండగానే మొత్తం భూమిపాలై నష్టపోవడంతో పంటలు కోల్పోయిన రైతన్న కళ్లల్లో కన్నీళ్లు తిరుగుతుండటం సహజమే. భూమిని నమ్ముకుని బతుకుతున్న రైతన్నలు చాలా ఎకరాలలో సాగుచేసిన మొక్కజొన్న పత్తి,వరి,పసుపులాంటి పంటలు ఎదుగుతున్న తరుణంలో అధిక వర్షాల ప్రభావంతో పంట మొత్తం నేలకు ఒరిగిపోతే అన్నదాత దిగులుగా నష్టపోయిన పంటను చూస్తూ ఎవరొవస్తారని ఏదైన సహాయం చేస్తారేమోనని ఆశతో అల్లాడిపోతున్న రైతులకు ప్రభుత్వాలు మరింతగా భరోసా కల్పించేలా నష్టపోయిన పంటకు పరిహారంచెల్లించేలా సహాయ సహకారాలు అందించాలి. •

# నయా వలసవాదం అంటే ట్రంప్ విధానాలే కదా!

డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

అంతర్జాతీయ వాణిజ్యవిధానాలను అమెరికా తన గుప్పెట్లోకి తీసుకొని ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంపై 50 శాతం పైగా దిగుమతి సుంకాలను విధించింది.పెట్టుబడిదారీ దేశాలకు లాభోద్దేశం తప్పవేరే ఆలోచన ఉండదు. ప్రపంచంలో భారత్, అమెరికా పెద్దప్రజాస్వామ్య దేశాలు. వీరి మధ్య నడుస్తున్న వాణిజ్యయుద్ధాలు ప్రజలను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. భారత్లో ఆనాటి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీనే మించిపోయింది ఈనాటి అమెరికా సామ్రాజ్యవాదం. మన దేశాభివృద్ధికి మన పాలకులు అనుసరించే ఆర్థిక అభివృద్ధి,వివిధ రంగాల సంరక్షణ విధానాలను ప్రశ్నించేందుకు, ఎదిరించేందుకు అమెరికా ప్రెసిడెంట్ ఎవరు? వ్యవసాయం,పాడిపరిశ్రమ, మత్స్య పరిశ్రమ మొదలైన ప్రాథమిక రంగాల నుంచి పారిశ్రామిక రక్షణరంగాల వరకు మనం చేపట్టే విధానాలను ఎప్పుడు వ్యతిరేకించడమేనా అమెరికా పని. ఏమైతేనేం తాజా సుంకాల భారం మన దేశంనుంచి పోయే 66ఎగుమతులపై తీవ్ర ప్రభావమే చూపగలదని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందువల్ల ఈ ఏడాది వచ్చే ఏడాది మన వృద్ధిపై 0.8కోత పడవచ్చును అంటున్నారు. రత్నాభరణములు, దుస్తులు,వాహనాల విడిభాగాలు,స్టీలు,రొయ్యలు,తోలు ఉత్పత్తులు మొదలైన ఎగుమతులపై ప్రతికూల ప్రభావం ఉంటుందని ఈ రంగాలలో అనిశ్చితి ఏర్పడుతుందని అంచనా. ఈ రంగాలలో పనిచేసే లక్షలాది కార్మికులు ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుంది. అమెరికా తమ డైరీ ఉత్పత్తులను జన్యు మార్పిడి ఆహార ఉత్పత్తులను మనకు ఎగుమతి చేయాలని ఒత్తిడినీ అంగీకరించపోవడం ట్రంపు కడుపు మంటకు కారణం. కానీ రష్యా నుంచి దిగుమతి చేసుకునే ముడిచమురు కారణంగా చెబుతున్నారు. భారత్లో 46శాతం మంది సాగు రంగంపై ఆధారపడుతున్నారు. అమెరికాలో ఇది ఒక్క శాతం మాత్రమే. మన దేశ జనాభాలో సగం మంది ఆధారపడే సాగు రంగాన్ని నిర్వీర్యం చేయాలట. అమెరికాలో ఆ ఒక్క శాతం జనాభా చేసే డైరీ ఉత్పత్తులను జన్యు మార్పిడి ఆహార ఉత్పత్తులను మనము దిగుమతి చేసుకోవాలట. భారతదేశ వివిధ కారణాల వల్ల గత పాతిక సంవత్సరాలుగా అమెరికన్ శిబిరానికి సన్నిహితంగాఉంటూ వచ్చింది. ఇటీవల కాలంలో బలహీనపడుతున్న అమెరికాకు మన దేశం పట్ల ప్రపంచం పట్ల దృష్టి మారి గతం కన్నా భిన్నమైన విధానాలను రూపొందించుకుంటున్నది.ఈ కొత్త పరిస్థితి భారతదేశానికి ఒక పరీక్షగా మారింది అన్నది గుర్తించవలసిన విషయం. అమెరికా విధానాలలోని మార్పులవల్ల వాణిజ్య ఒప్పందపు చర్చల రూపంలో ఇతరత్రా కూడా




ఎదురవుతున్న ఆర్థికరంగ సమస్యలు కనిపిస్తున్నావే. ప్రపంచంలో భారత్ మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా ఎదుగుతున్న వేళ అమెరికా తన నయా వలస పాలన బహిర్గతమవుతున్నది. అమెరికాలో 50 లక్షల మంది ఇండియన్ అమెరికన్లు ఆ దేశ ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతున్నారని తరచూ అభినందిస్తూ ఉంటారు. వీరు పెద్ద టెక్ సంస్థలైన గూగుల్ మైక్రోసాఫ్ట్, ఫైనాన్షియల్ సంస్థలను నడుపుతున్నారు. విద్యా విధాన నిర్ణయానక సంస్థల్లో కీలక పదవుల్లో ఉన్నారు. యుఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ రెండవసారి అధికారంలోకి రావడానికి భారతీయులు ఎంతోకృషిచేసినారు.యుఎస్ సెకండ్ లేడీ అయినా ఉష బాల చిలుకూరి సుప్రసిద్ధ అమెరికన్ లాయర్ కూడా భారతీయురాలే. ఇండియా పట్ల అమెరికా వ్యవహరిస్తున్న తీరు చూసి వారికి విచారం వేయడం నిజమేకదా. అమెరికా తాను ఆపాదించుకున్న ప్రపంచ పెద్దన్న పెద్దరికంతో తాను విశ్వసనీయ భాగస్వామిగాగుర్తించాలంటే అమెరికా కనుసన్నల్లో ఉండడమేనా? వ్యతిరేకిస్తే నియంతగా వ్యవహరిస్తారా? భారతదేశపు మార్కెట్ చాలా పెద్దదని అమెరికాకు తెలుసు.అమెరికాతో మనం శాస్త్రసాంకేతిక రంగాలలో పోటీ పడుతున్నామని కూడా తెలుసు.మన మానవ వనరులు అమెరికా దేశాభివృద్ధికి ఎలా తోడ్పడుతున్నాయో తెలుసు. మన ప్రతిభావంతులైన శాస్త్రవేత్తలు, విద్యావంతులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్ డాక్టర్స్ ఇతర సేవారంగాలు అమెరికా శాస్త్రసాంకేతిక రంగాలలోతోడ్పడుతున్నారు. మార్కెట్ రీత్యా గాని మానవ వనరుల అభివృద్ధి పరంగా గాని భారతదేశం అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. అయితే పటిష్టవంతమైన ఆర్థిక విధానాలు,ప్రభుత్వ నియంత్రణ లేనందున స్వయం పోషకత్వంలో చైనా లాగా మనం నిలదొక్కు లేకపోతున్నాం. సామ్యవాద తరహా సమాజ నుంచి పెట్టుబడి దారి సమాజం వైపు అడుగులు వేసాం.దీనివలన ప్రపంచ పెట్టుబడిదారీ దేశాల కనుసన్నల్లో ముఖ్యంగా అమెరికావిధానాలకు లోబడిపోయే పరిస్థితి ఏర్పడింది.79 సంవత్సరాలుగా అనేక సందర్భాలలో అమెరికన్ సామ్రాజ్యవాద ఇండియాను తన ఆదేశాలను పాటించాలని బెదిరిస్తుంది. బ్రిటిష్ రాజ్యం నుంచి బిలియనీర్ల రాజ్యం వైపుగా భారత్ ఇప్పటికే పునాదులు వేసుకున్నది. ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గం ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో మమేకమైపోయింది.బడా బుర్జువావర్గ ప్రయోజనాలను నెరవేరుస్తున్న ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలను దేశాభివృద్ధిని ఆర్థిక వ్యవస్థ స్వయం పోషకత్వాన్ని పెంపొందించుకోగలదా?అగ్ర రాజ్యమని చెప్పుకునే అమెరికా తమ పెట్టుబడిదారులను ప్రోత్సహించి ప్రపంచ పెట్టుబడిదారులను నియంత్రించే పరిస్థితి ఉన్నది నేడు. ప్రభుత్వపాలన పెట్టుబడిదారీ కనుసన్నల్లో కాకుండా ప్రజలను శాస్త్ర సాంకేతిక రంగాలలోమమేకం చేసి వస్తు ఉత్పత్తి చేస్తే ఎవరికి ఏమీ మనము తీసిపోము. జరగాలి. స్వాలంబనకు భారత్ ఇప్పుడు తీవ్రమైనసవాలను ఎదుర్కొంటుంది.ఎందుకంటే మన పెట్టుబడిదారీ వర్గంఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడితో మమేకమైపోయింది. ప్రభుత్వాలు చేపట్టే మేక్ ఇన్ ఇండియా లాంటి పథకాలు విజయవంతం కావడంలేదు.ఆ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి సామ్రాజ్యవాద పెత్తనం నుండి దేశం బయటపడాలి. •

# ప్రజావాక్కు

## క్యాష్‌లెస్ స్కీమ్

మన దేశంలో రోడ్డు ప్రమాదాలు, కాలిన గాయాలు, విష ప్రయోగాలు,నేరదాడులురోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇలాంటి అత్యవసర సందర్భాల్లో బాధితుడికి వెంటనే వైద్యసహాయం అందకపోతే ప్రాణాలుకోల్పోవాల్సి వస్తుంది.అయితే ప్రైవేట్ ఆసుపత్రులలో చాలా చోట్ల ముందస్తు డబ్బుఅడగడం, లేకపోతే బెడ్‌లేదు అంటూ తిరస్కరించడం సాధారణమైపోయింది. బాధితులు అంబులెన్స్‌లలోనే ప్రాణాలు వదిలే ఘటనలు మన కళ్లముందే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కర్ణాటక ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఆదేశం ప్రశంసనీయం.2007 ప్రైవేట్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్, 2016 గుడ్ సమారిటన్ యాక్ట్ మోటార్ వెహికల్స్ యాక్ట్‌ప్రకారం, ప్రతి ఆసుపత్రి ముందస్తు చెల్లింపు లేకుండా దుర్ఘటన బాధితులను వెంటనే చికిత్స చేయాల్సిందేనని మళ్లీ గుర్తు చేసింది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## భక్తిశ్రద్ధలతో పూజిద్దాం..

ఐకమత్యానొదిలి పోటీతత్వం షురూ జేస్తున్నారు. ప్రకృతిని పరిరక్షి ంచే మట్టి ప్రతిమలనొదిలి రంగు రంగుల ప్రతిమలను కొనేందుకు ఎగబడుతున్నారు. వికృత చేష్టలతో చిందులేస్తూ వినాయకుడినే అపవిత్రం చేస్తున్నారు. భక్తిశ్రద్ధలతో పాడే కీర్తనలు మరిసి సౌండ్‌బాక్సులల్లా పెట్టుకొని పూజిస్తున్నారు.భజన నృత్యాలతో సాగేఊరేగింపు భక్తికి విరుద్ధమైన పాటలు పెట్టీ ఎగురుతున్నారు. భగవంతుని భక్తిశ్రద్ధలతో కొలవాలే గాని భారీ విగ్రహం పెట్టామనే పొగడ్తల కోసం కాదు. భారీ ప్రతిమలతో కాదు భక్తి శ్రద్ధలతో పూజిద్దాం.

- కాల్వ నిఖిత, సిద్దిపేట

## పరిశోధకుల టీంలను ఏర్పాటు చేయాలి

తెలంగాణరాష్ట్రంలోని పాఠశాలస్థాయిలో,జూనియర్ కళాశాలస్థాయిలో,డిగ్రీకళాశాలస్థాయిలో, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ స్థాయిలో,గురుకులాలతో పాటుగావిద్యాసంస్థలలో నూతన సంస్కరణలు ప్రవేశపెట్టాలి. వివిధ యూనివర్సిటీల నుండి డాక్టరేట్ పట్టా పొందిన లెక్చరర్స్‌ను ఎంపిక చేసి ఇతర రాష్ట్రాలు,ఇతరదేశాలలో విద్యావ్యవస్థలో ఉన్న సంస్కరణ మన రాష్ట్రంలో ప్రవేశపెట్టడానికి గాను టీచింగ్ పరిశోధకుల టీంలను ఏర్పాటు చేయాలి. వీరి సలహాలు, సూచనలను ప్రభుత్వం విద్యాశాఖ అనుసరించాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా



## బ్యాంకుల్లో సొమ్ము జాగ్రత్త

ఈ మధ్య క్రిమినల్స్ ఇతరుల బ్యాంక్ ఖాతాల్లోకి జొరబడి కొంత సొమ్మును జమ చేయడం ఇది సైబర్ క్రైమ్‌కు సంబంధించినదని బ్యాంకు వారికి సమాచారం ఇవ్వడంతో బ్యాంకు వారు వెంటనే స్పందించి ఖాతాలను స్తంభింపచేయటం జరుగుతున్నది.ఎ.టి.ఎమ్.లో డబ్బుతీసుకుందామని వెడితే మీ ఖాతా తిరస్కరించబడినది. అనే మెసేజ్ రాగా, సైబర్ క్రైమ్ నంబరు 1930 ను సంప్రదిస్తే సమస్యను పరిష్కరించడానికి బదులు వారు దగ్గరనున్న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమని సలహాయిచ్చారు. ఈడబ్బును ఎవరు జమచేసారో వాళ్లను స్వయంగా సంప్రదించమన్నారు.ఆ డబ్బు ఇతరరాష్ట్రాల నుండి వచ్చిందని తెలిపారు.బ్యాంకుకు వెళ్ళిఅడుగగా వారు పరిష్కారం చేయడం జరిగింది. ఇది జరిగిన వారం తరువాత మరల ఎవరో కొంత సొమ్మును పంపి ఇది సైబర్‌క్రైమ్‌కు సంబంధించినదనిమెసేజ్. ఇలా ఎందుకు జరుగుతోంది?ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లేదా?ఇలాంటి ఉదంతం సికింద్రాబాద్‌లో నున్న యూనియన్ బ్యాంక్, అల్వాల్ బ్రాంచిలో ఓఖాతాదారునికి ఇలాగే జరిగింది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## మహిళా న్యాయమూర్తులను నియమించాలి

కోర్టులలో మహిళ న్యాయమూర్తులను నియమించడం తగ్గిపోయింది.ముఖ్యంగా మైనారిటీల నియామకం ఏ మాత్రం లేదు. దేశం లోమహిళ సమానత్వం గురించి చర్చ జరుగుతున్నప్పుడు ఉన్నత స్థానాలలోవాటా దక్కాలికదా మరిఎందుకు అలా జరగడం లేదు అనేది పెద్ద ప్రశ్న. ఒక్క నాగరత్న తప్ప ఇప్పుడు సుప్రీం కోర్టులో ఒక్క మహిళ న్యాయమూర్తి లేరు అంటే అతిశయోక్తి లేదు.ఒక్క ఎన్‌వీ రమణ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో ఎక్కువమహిళ న్యాయమూర్తులనీ నియమించగా అది మొత్తం న్యాయమూర్తులలో 10 శాతం దాటలేదు అనే నిష్ఠుర సత్యం జీర్ణం చేసుకోవాల్సి రావడమే విడ్డూరం.

-భారత అవినాష్, జనగామ

## ఉపాధి హామీ కల్పించాలి

తెలంగాణలో పెరిగిన నీటి వసతులు భూమి అభివృద్ధి కార్యక్రమాలను ఉపాధి హామీ కింద చేసేందుకు హామీ ఇస్తున్నాయి. ఒకప్పుడు మురికి తుమ్మలు మొలిచిన నెలలు నేడు సాగు యోగ్యంగా మారడానికి ఉపాధి హామీ హామీ పడుతుంది. చిన్నచిన్న గూడెంలలో కూడా ఎక్కువలో ఎక్కువగా 10 నుండి 15ఎకరాలలో మాత్రమే పాడుబడ్డ భూములున్నాయి.

-కె.రామారావు, నల్గొండ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఎన్డీయే కూటమిలో తేలని 'సర్దుబాట్లు'

## ఎక్కువ సీట్లు పట్టుబడుతున్న మిత్రపక్షాలు



పాట్నా, సెప్టెంబరు 5: ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బీహార్ ఎన్డీఏ కూటమిలో సీట్ల లొల్లి ప్రారంభమైంది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లు (80) గెల్చుకున్నప్పటికీ, జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆ కూటమిలో ఎన్డీఏ కూటమిలో ఇంతవరకు చిన్న భాగస్వామిగా ఉన్న చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), జితన్ రామ్ మాంఝీ హిందుస్తానీ అవామ్ మోర్చా (సెక్యులర్) పార్టీలు ఇకపై కేవలం సహకారం అందించే పాత్రకే పరిమితం కారాదని భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పార్టీలు ఎక్కువ సీట్లను కోరుతున్నాయి. దీంతో ఎన్డీఏలో ముసలం మొదలైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఐదు సీట్లను గెల్చుకున్న చిరాగ్ పాశ్వాన్ అసెంబ్లీ ఎన్నికల్లో 40 సీట్లు కావాలని డిమాండ్ చేసే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఒక వేళ అన్ని సీట్లు తమకు ఇవ్వకపోతే మొత్తం 243 అసెంబ్లీ సీట్లలో తమ పార్టీ సొంతంగా పోటీ చేస్తుందని చిరాగ్ పాశ్వాన్ హెచ్చరిస్తున్నారు. పలు అంశాల్లో పార్టీ సొంత వైఖరిని వెల్లడించారు. నరేంద్ర మోదీ ప్రధానిగా కొనసాగినంత కాలం తమ మద్దతు తప్పనిసరి అని ఆయన స్పష్టం చేస్తున్నారు. కాగా, స్థానికంగా తమకు ఎక్కువ మద్దతు ఉన్న గయా, ఔరంగాబాద్‌ల్లోని అన్ని సీట్లను తమకే కేటాయించాలని మరో సంకీర్ణ పార్టీ హెచ్ఏఎం చీఫ్ జితన్ రామ్ మాంఝీ డిమాండ్ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన 20 సీట్లు అడుగుతున్నారు. తమ పార్టీ మద్దతు లేకుండా ఎన్డీఏ విజయం సాధించలేదని అయన ప్రకటించారు. ప్రస్తుతం తమ కూటమిలోని పార్టీలు విడిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్డీఏకు నేతృత్వం వహిస్తున్న బీజేపీపై ఉంది. ఆ పార్టీల డిమాండ్లను సమన్వయంతో పరిష్కరించకపోతే అవి విడిగా పోటీచేసే ప్రమాదం ఉంది. దీంతో కూటమికి అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలి విజయావకాశాలు గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని చేపట్టాలని మరోవైపు మహాఘట్ బంధన్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ కూటమిలో కాంగ్రెస్, ఆర్జేడీతో పాటు సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ కూటమి ఎక్కువగా యువత, తమ సంప్రదాయ ముస్లిం-యాదవ్ ఓటు బ్యాంక్‌పై ఆధారపడింది. ఈ ఎన్నికల్లో తమ కూటమి పార్టీలను సమన్వయం చేయడంలో ఎన్డీఏ విఫలమైతే అది మహాఘట్ బంధన్ కూటమికి పూర్తి లాభం చేకూరుస్తుంది. ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహు ల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌లు రాష్ట్రంలో 'ఓటర్ రైట్స్ మార్చ్' ద్వారా పాదయాత్ర జరిపి తమ కూటమికి అనుకూల వాతావరణం సృష్టించే ప్రయత్నం చేశారు. వచ్చే ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో కీలక రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. అమ్మ మక్కల్ మున్నేట్ర కజగం(ఎఎంఎంకె) నేత దినకరన్ ఎన్డీయే కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. మాజీ సీఎం పన్నీర్ సెల్వం కూటమిని వీడిన కొద్ది వారాలకే దినకరన్ తన నిర్ణయాన్ని ప్రకటించారు. కడలూరులో దినకరన్ విలేకరులతో మాట్లాడుతూ ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. ద్రోహాన్ని తన పార్టీ భరించలేదని తెలిపారు. కూటమిలో పెరుగుతున్న విభేదాలను పరిష్కరించడంలో బీజేపీ కేంద్ర నాయకత్వం విఫలమైందని చెప్పారు.



# ఏడు కాదు మూడు యుద్ధాలను ఆపా!

## యుద్ధ విరమణ వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్షుడు యూటర్న్

వాషింగ్టన్, సెప్టెంబరు 5: తనను తాను గొప్ప శాంతి దూతగా అభివర్ణించుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, తన పాత వ్యాఖ్య లను తానే సవరించుకున్నారు. తాను ఏడు దేశాల మధ్య యుద్ధాలను ఆపానని గతంలో పదేపదే చెప్పుకున్న ఆయన, తాజాగా ఆ సంఖ్యను మూడుకు తగ్గించారు. వైట్‌హౌస్‌లో టెక్నాలజీ సంస్థల అధినేతలకు ఇచ్చిన విందు సందర్భంగా ట్రంప్ ఈ కొత్త ప్రకటన చేశారు. వైట్‌హౌస్‌లో టెక్ కంపెనీల సీఈవోలతో సమావేశమైన అనంతరం ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ క్రమంలో ఓ జర్నలిస్టు రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఎలా ముగిస్తారని ప్రశ్నించారు. దీనికి బదులిస్తూ, మీకు తెలుసా? నేను ఇప్పటివరకు మూడు యుద్ధాలను ఆపానని ట్రంప్ పేర్కొన్నారు. మూడు దశాబ్దాలుగా ఘర్షణ పడుతున్న దేశాల మధ్య తాను శాంతిని నెలకొల్పానని, అది అసాధ్యమని చాలామంది చెప్పినా తాను చేసి చూపించానని అన్నారు. అయితే, ఆ మూడు యుద్ధాలు ఏవనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టం చేయలేదు. ప్రస్తుత రష్యా ఉక్రెయిన్ యుద్ధం క్లిష్టంగా మారినప్పటికీ, దాన్ని కూడా తాను కచ్చితంగా ఆపుతానని ధీమా వ్యక్తం చేశారు. థాయ్‌లాండ్ కంబోడియా, ఇజ్రాయెల్-ఇరాన్, ఇజ్రాయెల్ హమాస్, రువాండా-డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెర్బియా-కొసావో, ఈజిప్ట్-ఇథియోపియా, ఇండియా-పాకిస్థాన్ మధ్య ట్రంప్ యుద్ధాలు ఆపినట్లు వైట్ హౌస్ గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ లాంటి దేశాలు ఆయనను నోబెల్ శాంతి బహుమతికి కూడా నామినేట్ చేశాయి. ఇక, భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను కూడా తానే తగ్గించానని గతంలో ట్రంప్ పలుమార్లు వ్యాఖ్యానించారు. అయితే, భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఈ వ్యాఖ్యలను ఖండిస్తూ వచ్చింది. ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో మూడో దేశం ప్రమేయం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా స్పష్టం చేశారు. ఇప్పుడు ట్రంప్ తన పాత లెక్కను మార్చి, ఏడు నుంచి మూడుకు తగ్గించడం చర్చనీయాంశంగా మారింది.



# భర్తకంటే భార్యకు ఆదాయం ఎక్కువ ఉంటే భరణం అవసరంలేదు

## చెన్నై హైకోర్టు సంచలన తీర్పు

చెన్నై, సెప్టెంబరు 5: భార్యాభర్తల మధ్య భరణం చెల్లింపు కేసులకు సంబంధించి మద్రాస్ హైకోర్టు కీలక తీర్పును వెలువరించింది. భార్యకు భర్త కన్నా ఎక్కువ ఆదాయం, ఆస్తులు ఉన్నప్పుడు ఆమెకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. చెన్నైకి చెందిన వైద్య దంపతుల కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. దిగువ కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. చెన్నైలో వైద్యులుగా పనిచేస్తున్న భార్యాభర్తలు విభేదాల కారణంగా విడిపోయారు. విడాకుల కోసం చెన్నై ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన ఫ్యామిలీ కోర్టు భార్యకు నెలకు రూ.30,000 చొప్పున భరణంగా చెల్లించాలని భర్తను ఆదేశించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ సదరు వైద్యుడు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బాలాజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణలో భాగంగా తన భార్యకు ఇప్పటికే గణనీయమైన ఆస్తులు ఉన్నాయని, ఆమె సొంతంగా ఒక స్కానింగ్ సెంటర్ నడుపుతూ అధిక ఆదాయం సంపాదిస్తోందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సంబంధించిన ఆధారాలను, పత్రాలను కూడా సమర్పించారు. వాదనలు విన్న న్యాయస్థానం, భార్య ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడు భర్త నుంచి భరణం ఆశించడం సరికాదని అభిప్రాయపడింది. అదే సమయంలో, వారి కుమారుడు నీట్ పరీక్షకు సిద్ధమవుతున్నాడని, అతని చదువుకు అయ్యే ఖర్చు రూ.2.77 లక్షలను తాను భరించేందుకు సిద్ధంగా ఉన్నానని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, కుమారుడి చదువు ఖర్చుల విషయంలో జోక్యం చేసుకోబోమని పేర్కొంది. భార్యకు భరణం చెల్లించాలంటూ ఫ్యామిలీ కోర్టు జారీ చేసిన ఉత్తర్వులను పూర్తిగా రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది.

# మౌంట్ రష్మోర్‌పై ట్రంప్ శిలా ముఖచిత్రం

## అమెరికా అధ్యక్షుడి మదిలో మెదిలిన మరో కోరిక



వాషింగ్టన్, సెప్టెంబరు 5: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన చిరకాల కోరికను మరోసారి బలంగా బయటపెట్టారు. అమెరికా చరిత్రలో నిలిచిపోయిన నలుగురు గొప్ప అధ్యక్షుల ముఖచిత్రాలతో ఉన్న మోంట్ రష్మోర్‌పై తన ముఖాన్ని కూడా చూడాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు. ఈ మేరకు, ఆ అధ్యక్షుల ముఖాల పక్కనే తన ముఖం ఉన్నట్లుగా రూపొందించిన ఒక ఏఐ వీడియోను ఆయన తాజాగాట్రూత్ ఖాతాలో పంచుకున్నారు. ఇది ప్రస్తుతం అమెరికాలో కొత్త చర్చకు దారితీసింది. దక్షిణ డకోటాలోని బ్లాక్ హిల్స్‌లో ఉన్న మోంట్ రష్మోర్ ఒక జాతీయ స్మారక చిహ్నం. ఇక్కడి భారీ గ్రానైట్ పర్వతంపై అమెరికా జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన మాజీ అధ్యక్షులు జార్జ్ వాషింగ్టన్, థామస్ జెఫర్సన్, థియోడర్ రూజ్‌వెల్ట్, అబ్రహం లింకన్‌ల 60 అడుగుల ముఖ శిల్పాలు చెక్కారు. ఏటా లక్షలాది మంది పర్యాటకులు దీనిని సందర్శిస్తుంటారు. ఈ దిగ్గజాల సరసన తన శిల్పం కూడా ఉండాలనేది ట్రంప్ కోరిక. ఈ ఏడాది ఫిబ్రవరిలో కాంగ్రెస్ సభ్యురాలు అన్నా పౌలినా లూనా ట్రంప్ ముఖాన్ని అక్కడ చేర్చాలంటూ ప్రతిపాదన కూడా తీసుకువచ్చారు. అయితే, ట్రంప్ ఆశలకు అధికారులు, నిపుణులు బ్రేకులు వేస్తున్నారు. ఆ పర్వతంపై ఐదో ముఖాన్ని చెక్కడం ఆచరణ సాధ్యం కాదని స్పష్టం చేస్తున్నారు. మోంట్ రష్మోర్ నిర్వహణ చూసే నేషనల్ పార్క్ సర్వీస్ కూడా ఇదే విషయాన్ని తేల్చి చెప్పింది. ఆ పర్వతంపై కొత్తగా శిల్పాన్ని చెక్కేందుకు సురక్షితమైన, స్థిరమైన ప్రదేశం లేదని అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న శిల్పాల కారణంగా పర్వతంపై మరిన్ని చెక్కడాలు ప్రమాదకరమని వారు విశ్లేషిస్తున్నారు. గతంలో జాన్ ఎఫ్. కెన్నడీ, రోనాల్డ్ రీగన్, బరాక్ ఒబామా వంటి అధ్యక్షుల ముఖాలు కూడా మోంట్ రష్మోర్‌పై చేర్చేందుకు ప్రస్తావనకు వచ్చినా, అవేవీ కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు ట్రంప్ విషయంలో కూడా సాంకేతిక కారణాల వల్ల ఆయన కోరిక నెరవేరడం కష్టమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఆ ఫోటో చూస్తే ప్రతి అమెరికన్‌కు వణుకే...

## పుతిన్, జిన్‌పింగ్, మోడీ ఒకే ఫోటోపై ఎనలిస్టు వ్యాఖ్యలు



న్యూయార్క్, సెప్టెంబరు 5: చైనాలో ఇటీవల జరిగిన షాంఘై కో ఆపరేషన్ సదస్సుకు సంబంధించిన ఓ ఫొటో ప్రతీ అమెరికన్ వెన్నులో వణుకుపుట్టించేలా ఉందని అమెరికా రాజకీయ విశ్లేషకుడు వాన్ జోన్స్ పేర్కొన్నారు. ప్రపంచంపై ఆసియా ఆధిపత్యం చెలాయించ నుందని చెప్పేందుకు ఇది సంకేతంలా కనిపిస్తోందన్నారు. షాంఘై సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా ప్రెసిడెంట్ జిన్ పింగ్ నవ్వుతూ మాట్లాడుకోవడం మీడియా కెమెరాలు బంధించాయి. ఈ ముగ్గురు నేతలూ నవ్వుతూ చేతిలో చేయి వేసుకుని మాట్లాడుకోవడం అమెరికన్లను వణికించేలా ఉందని వాన్ జోన్స్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బాధిత దేశాధినేతలు ఒకే వేదికపై నవ్వులు పంచుకుని, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్న ఫోటోలు పాశ్చాత్య మీడియా దృష్టిని ఆకర్షించాయి. దీనిపై వాన్ జోన్స్ మాట్లాడుతూ "ఈ రోజును చరిత్రాత్మ కంగా, అతిపెద్ద మలుపుగా గుర్తుంచుకుంటాం" ఎందుకంటే, అమెరికా సుంకాల బాధిత దేశాల్లో మూడు కీలక దేశాల అధినేతలు నవ్వుతూ మాట్లాడుకోవడం వారి మధ్య మైత్రి బలపడుతోందనేందుకు సంకేతం. ఇది అమెరికాకు మంచిది కాదు. ఈ సమావేశం 'నూతన ప్రపంచవ్యవస్థ' కు సంకేతం. ఒకప్పుడు ఇలా అమెరికా, చైనా, రష్యా మాత్రమే ఉండేవి. ఇప్పుడు మనం అందులో లేము అందరూ మనకు వ్యతిరేకంగా ఉన్నారు" అని ఆయన అన్నారు. పాశ్చాత్య మీడియాలో ఈ ఫోటో సంచలనంగా మారింది. అమెరికా వ్యతిరేక వర్గంగా ముద్రపడిన నాలుగు దేశాలు ఇరాన్, ఉత్తర కొరియా, చైనా, రష్యాల మొదటి సమావేశంగా విశ్లేషకులు అభిప్రాయపడినట్టు వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. 'ఈ ఫోటో జిన్‌పింగ్, పుతిన్ మధ్య ఉన్న స్నేహం అమెరికాను సవాలు చేసేలా ఉంది. సుంకాలతో ట్రంప్ భారత్‌ను దూరం చేసుకోగా భారత దేశం చైనాకు దగ్గరవుతోందని అమెరికా పత్రికలు విశ్లేషించాయి.

# ఇసుకతవ్వకాలపై డిప్యూటీ సిఎం, ఐపిఎస్ మధ్య వాగ్వాదం


## వైరల్ అయిన వీడియోతో పవార్‌పై నెటిజన్ల విమర్శలు



ముంబయి, సెప్టెంబరు 5: ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవడానికి వెళ్లిన ఓ ఐపీఎస్ అధికారిణికి ఏకంగా ఉపముఖ్యమంత్రి ఫోన్ చేయడం మహారాష్ట్రలో సంచలనంగా మారింది. అక్రమార్కులపై చర్యలు వద్దని ఫోన్‌లో ఉప ముఖ్యమంత్రి ఆదేశించడంతో ఇదే విషయాన్ని వీడియో కాల్‌లో చెప్పాలని సదరు ఐపీఎస్ అధికారిణి కోరారు. దీంతో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సోలాపూర్ జిల్లాలోని కర్మలా తాలూకాలోని కుద్దు గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని సబ్‌డివిజనల్ పోలీసు అధికారిణి, ఐపీఎస్ అంజనా కృష్ణకు ఫిర్యాదులు అందాయి. దీంతో సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లిన అంజనా కృష్ణ ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొందరు గ్రామస్థులు, స్థానిక ఎన్సీపీ కార్యకర్తలు అధికారులతో ఘర్షణకు దిగారు. వారిలో ఒకరు తమ పార్టీ అధినేత, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కు ఫోన్ చేసి ఐపీఎస్ అంజనాకృష్ణకు ఇచ్చారు. ఫోన్‌లో ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడం ఆపాలని పవార్ ఆమెను ఆదేశించారు. అయితే, తాను ఫోన్‌లో మాట్లాడుతున్నది ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోనేనని రుజువు చేసుకోవాలని, తనకు వీడియోకాల్ చేయాలని అంజనీకృష్ణ కోరారు. దీంతో ఆగ్రహంచెందిన అజిత్ పవార్ 'నన్నే వీడియో కాల్ చేయమంటావా నీకు ఎంత ధైర్యం?. మీపై చర్యలు తీసుకుంటా. నన్ను చూడాలనుకుంటున్నారుగా నాకు వీడియో కాల్ చేయండి' అంటూ నెంబర్ చెప్పి ఫోన్ పెట్టేశారు. దీంతో పవార్‌కు ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణ వీడియో కాల్ చేశారు. ఈ సందర్భంగా తక్షణమే చర్యలు ఆపేయాలంటూ పవార్ ఆదేశించారు. కాగా, ఈ వీడియో వైరల్‌గా మారడంతో అజిత్ పవార్‌పై నెటిజన్లు మండిపడుతున్నారు. ఐపీఎస్ అధికారిణి విధులకు అడ్డుపడ్డారని, అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా అడ్డుకున్నారని విమర్శిస్తున్నారు. ఈ విమర్శలపై ఎన్సీపీ నేత సునీల్ తట్కరే స్పందిస్తూ పవార్ వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరణ ఇచ్చారు. కార్యకర్తలను శాంతింపజేసేందుకు ఐపీఎస్ అధికారిణిని అజిత్ మందలించి ఉండవచ్చని అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అజిత్ పవార్ మద్దతివ్వరని స్పష్టం చేశారు. ఈ వీడియోపై మాట్లాడేందుకు ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణ నిరాకరించారు.

# సంక్షిప్తంగా..

## యుఎస్ మాజీ అధ్యక్షుడు జోబైడెన్‌కు తలపై గాయం!



వాషింగ్టన్, సెప్టెంబరు5: అమెరికా మాజీ అధ్య క్షుడు జో బైడెన్ ఆరోగ్య పరిస్థితిపై మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల ఆయన తలపై ఒక గాయంతో, మునుపటి కంటే నీరసంగా, బడలికతో కనిపిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో కలకలం రేపుతున్నాయి. ఈ వీడియోలు చూసిన నెటిజన్లు, రాజకీయ విశ్లే షకులు ఆయన ఆరోగ్యస్థితి గురించి రకరకాల ఊహాగానాలు చేస్తున్నారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, బైడెన్‌కు ఇటీవలే చర్మ క్యాన్సర్‌కు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. ఈ ఆపరేషన్ కారణంగానే ఆయన తలపై గాయం ఏర్పడిందని తెలుస్తోంది. తాజాగా బయటకు వచ్చిన వీడియోలలో బైడెన్ చాలా అలసి పోయినట్లు, బలహీనంగా కనిపించడం తో ఆయన ఆరోగ్యం చుట్టూ జరుగు తున్న చర్చ మరింత ఊపందుకుంది. 82 యేళ్ల జో బైడెన్ ఆరోగ్యంపై చర్చ జరగడం ఇది మొదటిసారేమీ కాదు. గతంలో కూడా ఆయనకు చర్మ క్యాన్సర్‌కు సంబంధించి చిన్నపాటి చికిత్సలు జరిగినట్లు వైద్య నివేదికలు వెల్లడించాయి. అయితే, తాజా శస్త్రచికిత్స తీవ్రత, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

## ట్రంప్ వైట్‌హౌస్ విందుకు హాజరుకాని మస్క్..



వాషింగ్టన్, సెప్టెంబరు 5: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం టెక్ దిగ్గజాలతో సమావేశమైన విషయం విదితమే. ఈ సమావేశానికి ట్రంప్ మాజీ సహచరుడు, స్పేస్ ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ హాజరు కాలేదు. అయితే తాను హాజరు కాకపోవడంపై మస్క్ తాజాగా స్పందించారు. ఆ సమావేశానికి ప్రెసిడెంట్ ట్రంప్ యంత్రాంగం నుంచి తనకు ఆహ్వానం అందిందని, అనివార్య కారణాల వల్ల తాను వెళ్ల లేకపోయానని వివరణ ఇచ్చారు. తనకు బదు లుగా తన కంపెనీ నుంచి ఓ ప్రతినిధిని పంపిం చానని మస్క్ తెలిపారు. ట్రంప్ సమావేశంపై ఆంగ్లమీడియా సంస్థ ఓ కథనం ప్రసారం చేస్తూ ఈ మీటింగ్‌కు ట్రంప్ యంత్రాంగం ఎలాన్ మస్క్‌కు ఆహ్వానం పంపలేదని పేర్కొంది. ఆహ్వానితుల జాబితాలో మస్క్ పేరు లేదని తెలిపింది. మస్క్ తాజా వివరణ నేపథ్యంలో టెస్లా, స్పేస్ ఎక్స్ కంపెనీల తరఫున ఎవరైనా హాజరై ఉండొచ్చని పేర్కొంది. అయితే, మస్క్ ప్రతినిధి హాజరుపై అటు ట్రంప్ యంత్రాంగం కానీ, ఇటు మీడియా సంస్థలు కానీ ఎలాంటి నిర్ధారణ ప్రకటన చేయకపోవడం గమనార్హం.

# ముంబయి మహానగరానికి మానవబాంబుల ముప్పు

## 14మంది ఉగ్రవాదులున్నారంటూ ఇమెయిల్ హెచ్చరికలు



ముంబై, సెప్టెంబరు 5: ముంబైకి బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ట్రాఫిక్ పోలీస్ వాట్సాప్ నెంబర్‌కు ఈ బెదిరింపులు వచ్చాయి. 34 వాహనాల్లో 400 కిలోల ఆర్డీఎక్స్‌తో మానవబాంబులు నగరంలోకి ప్రవేశించాయని, నగరం మొత్తాన్ని పేలుళ్లతో కుదిపేయనున్నామని పేర్కొంటూ బెదిరింపు సందేశాలు వచ్చినట్టు పోలీసులు తెలిపారు. లష్కర్ ఏ జిహాదీ అనే ఖాతా నుంచి ఈ బెదిరింపు వచ్చిందని, 14 మంది పాక్ ఉగ్రవాదులు ఇప్పటికే భారత్‌లోకి చొరబడినట్టు కూడా అందులో పేర్కొన్నారని వివరించారు. కాగా, బెదిరింపు సమాచారంతో ముంబై పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీసు బలగాలను అప్రమత్తం చేశారు. అన్ని కోణాల నుంచి విచారణ జరుపుతున్నారు. నగరంలోని కీలక ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించారు. అనుమానాస్పద వాహనాలను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. మరో ఘటనలో, మహారాష్ట్రలోని థానే జిల్లాలో బాంబు బెదిరింపు చేసిన 43 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసారు. నిందితుడిని రూపేల్ మధుకర్‌గా గుర్తించినట్టు గవర్న్‌మెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. కల్వ రైల్వే స్టేషన్‌లో బాంబు పెట్టినట్టు ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు ఇతని నుంచి పోలీస్ హెల్ప్‌లైన్‌కు సమాచారం వచ్చింది. అయితే ఈ బెదిరింపు ఉత్తదే అని తేలింది. గత నెలలో గిర్‌గావ్‌లోని ఇస్కాన్ ఆలయానికి కూడా ఇలాంటి బాంబు బెదిరింపే వచ్చింది. ఆలయం ఆవరణలో బాంబులు పెట్టినట్టు టెంపుల్ ఆఫీస్ ఈమెయిల్ ఐడీకి మెసేజ్ వచ్చింది. ఆలయ నిర్వాహకులు పోలీసులను అప్రమత్తం చేయడంతో బాంబు డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్ అర్ధరాత్రి సోదాలు జరిపింది. అయితే పేలుడు పదార్థాలు ఏవీ ఆవరణలో కనబడకపోవడంతో ఉత్తుత్తి బెదిరింపుగా తేలింది. గత మేలో కూడా మహారాష్ట్ర సెక్రటేరియట్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. 48 గంటల్లో పేలుతుందంటూ హెచ్చరికలు రావడంతో గాలింపు చర్యలు చేపట్టగా ఎలాంటి అనుమానాస్పద వస్తువు కనిపించలేదు. ఇటీవల కాలంలో నకిలీ బెదిరింపు కాల్స్ ఎక్కువవుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. స్కూళ్లు, విమానాశ్రయాలు, బహిరంగ ప్రదేశాల్లో బాంబులు పెట్టినట్టు మెయిల్స్ వస్తున్నాయి. అయితే ఈ బెదిరింపులు ఉత్తవే అని తేలుతున్నాయి. గత మేలో ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం, తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్‌కు సైతం బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.



# సైనిక దళాలకు హైపర్ సోనిక్ క్షిపణులు, అణుశక్తి యుద్ధ నౌకలు


న్యూఢిల్లీ, సెప్టెంబరు 5: పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలను అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికను మోడీ సర్కార్ ఆవిష్కరించింది. దాదాపు 15 ఏళ్ల వ్యవధిలో ఈ లక్ష్యాలను పూర్తి చేసేలా రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసింది. ఇందుకోసం భారీ మొత్తంలో వెచ్చించేందుకు సిద్ధమైంది. కనీసం 500కు తగ్గకుండా హైపర్‌సోనిక్ క్షిపణులను దళాలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విజన్ డాక్యుమెంట్ ప్రకారం పాత టి-72 యుద్ధట్యాంక్‌లను 1800 అత్యాధునిక ఫ్యూచర్ ట్యాంక్‌లతో భర్తీ చేయనున్నారు. మరో 400 తేలికపాటి ట్యాంక్‌లను దళాలకు అందించనున్నారు. ట్యాంక్‌పై నుంచి ప్రయోగించే 50,000 యాంటీ గైడెడ్ మిస్సైల్స్, 6,00,000 శతఘ్ని గుండ్లు, మానవ రహిత విమానాలను సమకూర్చుకోనుంది. వీటితో పాటు 700 రోబోటిక్ కౌంటర్ ఐఇడి సిస్టమ్‌లను రంగంలోకి దించాలని నిర్ణయించింది. ఇక నౌకాదళంకోసం సరికొత్త ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, 10అత్యాధునిక ఫ్రిగెట్‌లు, 7 అడ్వాన్స్‌డ్ కార్వెట్టీలు, 4 ల్యాండ్ డాక్ ప్లాట్‌ఫారమ్స్, హెలికాప్టర్‌లకు ప్లాన్ చేస్తోంది. వీటితోపాటు అణుశక్తితో నడిచే యుద్ధనౌకలు, ఎలక్ట్రోమాగ్నెట్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# షిర్డీ సాయినాథునికి కోటిన్నర విలువైన కానుక

ముంబయి, సెప్టెంబరు 5: మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి దుబాయ్‌కి చెందిన భక్తుడు రూ.1.58 కోట్ల విలువైన కానుకలను సమర్పించాడు. 1 కిలో 623 గ్రాముల బంగారంతో రూపొందించిన 'ఓం సాయి రామ్' అనే అక్షరాలను శిర్డీ ఆలయానికి విరాళంగా ఇచ్చాడు. అయితే తన వివరాలు బహిర్గతం చేయవద్దని సాయి బాబా సంస్థాను కోరినట్లు తెలుస్తోంది. దుబాయ్‌కి చెందిన భక్తుడి కుటుంబం ప్రతినెల షిరిడీ సాయినాథుడి దర్శనంచేసుకుని రూ. లక్ష విరాళంగా ఇస్తారని దేవాలయ అధి కారులు పేర్కొన్నారు. గురువారం మరో సారి షిరిడీని సందర్శించిన భక్తుడు కోటి న్నరవిలువైన బంగారు అక్షరాలను బహూకరించి నట్లు తెలిపారు. ఆలయంలోని రెండు ప్రధానద్వారాలకు వీటిని అమర్చినట్లు తెలిపారు.





# థాయ్‌లాండ్ కొత్త ప్రధానిగా అనుతిన్ చార్న్‌విరకూల్



బ్యాంకాక్, సెప్టెంబరు 5: థాయ్‌లాండ్ తదుపరి ప్రధానిగా అనుతిన్ చార్న్ విరాకుల్‌ను అక్కడి పార్లమెంట్ ఎన్నుకుంది. మాజీ ప్రధాని పేటోం గ్టార్న్ షినవత్రను అక్కడి రాజ్యాంగ న్యాయ స్థానం పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో కొత్త ప్రధాని ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. భూమ్‌జైతై పార్టీకి చెందిన అనుతిన్.. షినవత్ర నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో పనిచేశారు. గత రెండేళ్లలోనే థాయ్ లాండ్‌కు మూడో ప్రధాని రావడం గమనార్హం. కంబోడియా సెనేట్ అధ్యక్షుడు హన్‌సేన్‌తో థాయ్‌లాండ్ ప్రధాని షినవత్ర ఫోనులో మాట్లాడడం సం చలనం రేపింది. ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదాలు తీవ్రంగా ఉన్న సమయంలో పొరుగుదేశం నేతతో కీలక విషయాలు పంచుకున్న తీరు వివాదాస్పదమైంది.

# ఉక్రెయిన్‌కు సహకరించే వారే లక్ష్యం: పుతిన్



మాస్కో, సెప్టెంబరు 5: ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో తమ దళాలను మోహరించే ఏ దేశాలనైనా తమ సైన్యం లక్ష్యంగా చేసుకుంటుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్న సమయంలో తమకు వ్యతిరేకంగా నిలిచే దేశాలను చట్టబద్ధమైన లక్ష్యాలుగా చేసుకునే అధికారం తమకు ఉంటుందన్నారు. ఇటువంటి బలగాల మోహరింపు దీర్ఘకాలిక శాంతికి అనుకూలంగా ఉండదని అభిప్రాయం వ్యక్తం చేశారు. పశ్చిమ దేశాలతో ఉక్రెయిన్‌కు ఉన్న సన్నిహిత సైనిక సంబంధాలు ఇరుదేశాల మధ్య సంఘర్షణకు మూలకారణమని వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధయయ శాంతి చర్చలు ఫలించి యుద్ధం ఆగిపోతే, ఉక్రెయిన్‌కు మద్దతుగా ఆ దేశంలో ఇతర దళాలను మోహరించాల్సిన అవసరం ఏముంటుందని పుతిన్ ప్రశ్నించారు. దీర్ఘకాలిక శాంతికి దారితీసే నిర్ణయాలు తీసుకుంటే.. అసలు ఉక్రెయిన్‌లో ఇతర దళాలు మోహరించాల్సిన అవసరమే ఉండదన్నారు. తాము చేసుకున్న ఒప్పందానికి రష్యా కట్టుబడి ఉంటుందని తెలిపారు. 26 ఐరోపా దేశాల నేతలు గురువారం పారిస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో సమావేశమైన నేపథ్యంలో పుతిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఉపాధ్యాయుల్ని సత్కరించిన 'కోలా'


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** :శ్రీకాళహస్తిలోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ శుక్రవారం గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుల్ని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో జీవనం ప్రారంభించిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత దేశ రాష్ట్రపతి అయ్యారని ఉపాధ్యాయ వృత్తి ప్రధాన్యతను దేశ నలుమూలల చాటారని వివరించారు. అంతటి మహోన్నతమైన వ్యక్తి అన్నారు. సమాజంలో ఉపాధ్యాయులు ఎందరో మహోన్నత వ్యక్తులను తీర్చి దిద్దుతున్నారని వివరించారు. నేడు మనం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకుంటున్నామంటే అది ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవం అన్నారు. మన భవిష్యత్తును తీర్చి దిద్దే మొదటి వారు గంరంవులే అన్నారు. తల్లి దండ్రులు కలలు కంటే ఆ కలలను సాకా రం దిశగా ప్రయత్నించే మహామహులు ఉపాధ్యాయులు అన్నారు. విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దే వారు ఉపాధ్యా యులన్నారు. ఒక నాడు విద్యకోసం మన పూర్వికులు ఆశ్రమాలకు వెళ్లె వారని నేడు ప్రభుత్వాలు ఎన్నో సదుపాయాలు కల్పిస్తుం దన్నారు. విదేశీ విద్యకు నేడు ఎన్నో సదుపాయాలు కల్పి స్తున్నట్లు తెలిపారు. కాబట్టి మన జీవితంలో మొదటి స్థానం గురువులకు ఇవ్వాలని తెలిపారు.గురువు కృషి వెలకట్టలేని దన్నారు. మన సంప్రదాయాలు, సంస్కృతిని, సంప్రదాయాలను తీర్చిదిద్దే గురువును విస్మరించరాదన్నార్లు. ఉపాధ్యాయులు సుబ్రమణ్యంరెడ్డి, మునీంద్ర, జయచంద్రారెడ్డి, రమేష్, సుబ్బ,శర్మలను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో బిజెపి నాయకులు కొండేటి గోపాల్,గరికపాటి రమేష్‌బాబు, ఇమిడిశెట్టి మోహన్, కోనేటి అయ్యప్ప, నరేంద్ర, చందురాయల్, సిద్దు రాయల్, సజ్జా హారిష్, భరత్‌నాయుడు,చోటు తులసి,కుమార్, గిరిధర్‌సాయి. మారి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం
### - మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,సెప్టెంబరు 5,ప్రభాత వార్తప్రతినిధి:** దేశంలో పన్ను వ్యవస్థను సులభతరం చేయడం కోసం జీఎస్టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైనదనిమంత్రి కందుల దుర్గేష్ అన్నారు.జీఎస్టీ స్లాబుల సరళీకరణ - పర్యాటక, సినిమా రంగాలకు ఊతమన్నారు.జీఎస్టీ సంస్కరణలతో తక్కువ ధరల్లో వినోదం అన్నారు. పర్యాటక, సినిమా రంగాల బలోపేతానికి దోహదమవుతుందన్నారు.బడ్జెట్ ట్రావెలర్, డొమెస్టిక్ టూరిజంలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు.18 శ్లాబ్ పరిధిలోకి సినిమా ప్రొడక్షన్ సేవలు..తద్వారా నిర్మాతలకు ఆర్థికంగా మేలు అన్నారు. ట్యాక్స్ లు తగ్గితే సినిమా, పర్యాటక రంగాల్లో ఉపాధి పెరుగుతుంది. స్థానిక ఆర్థిక వ్యవస్థ బలపడు తుందన్నారు. హోటల్ రూమ్ టారిఫ్‌లు రూ.7,500 లోపు ఉన్న వాటిపై పన్ను 12 నుండి 5 కు తగ్గింపు ఉంటుందన్నారు. రెస్టారెంట్ బిల్లులపై పన్ను కూడా 12-18 నుండి 5 కి తగ్గించబడుతుందన్నారు..సినిమా టికెట్లు రూ.100 లోపు ఉంటే 12 జీఎస్టీ, రూ.100 పైగా ఉంటే 18 జీఎస్టీ కొనసాగుతుంది: మంత్రి దుర్గేష్.. జీఎస్టీ సంస్కరణలు తెచ్చిన ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్.

## దొంగిలించిన హుండీ సొమ్ము తిరిగి అమ్మవారికి
### అనారోగ్యంపాలైన కుటుంబసభ్యులు

**బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఎంతో ప్రతిభగల అమ్మవారు శ్రీ ముసలమ్మతల్లి దేవాలయం గ్రామ సమీపంలో ఉన్నది. బుక్కరాయసముద్రంతోపాటు అనంతపురం ఇతర జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటూఉంటారు. ముఖ్యంగ చెప్పాలంటేనే బుక్కరాయసముద్రం గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉన్నారంటే అది ఒక ముసలమ్మ తల్లి అనుగ్రహామే నని చెప్పవచ్చు,గ్రామ సమీపంలో ఉన్న చెరువు కట్ట అను నిత్యం తెగిపోతాఉంటే ప్రజలు ఇబ్బందు పడుతున్నారని గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి కుటుంబీలైన శ్రీ ముసలమ్మ తల్లి చెరువుకట్టకు బలిహారం కావడంతో చెరువుకట్ట తెగిపోకుండ నిలబడినాదని చరిత్ర చెప్పుతుంది.భక్తుల కోరిన కోర్కెలు తీర్చు శ్రీ ముసలమ్మ తల్లి దేవాలయంలో 22.7.2025 న కొందరు గుర్తు తెలియని దుండగులు సీసీకెమరాలను ద్వంసంచేసి గుడిలోకి చొరబడి గుడిలో ఉన్న హుండీని గొంగలించారు.ఈ విషయం పై ఆలయ ధర్మకర్త సుశీలమ్మ పోలీస్టేషన్ ల్లో ఫిర్యాదుచేయగా పోలీసులు కేసునమోదుచేసి దర్యాప్తుచేసున్నారు.శుక్రవారం హుడిని దొంగలించిన దుండగులు తిరిగి అమ్మవారి ఆలయ ప్రాంగనంలో పడేసి పోయారు.వాటిని గమనించిన ఆలయకమిటీ ధర్మకర్త సుశీలమ్మ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసుల సమక్షంలో హుండీని తెరవగా అందులో ఒక లేఖను రాసి పెట్టారు ఆ లేఖలో అమ్మవారి హుండీని నలుగురం చోరిచేశామని చోరిచేసినప్పటినుండి తమ ఇండ్లలో పిల్లల అనారోగ్యం తో బాదపడుతున్నారు.తెలియక అమ్మవారి సొమ్ము దొంగలించామని అందులో కొంతవాడుకున్నామని రాసి సంచిలో పెట్టి వెల్లిపోయారు.అనంతరం పోలీసుల సమక్షంలో హుండీని లెక్కించగా అందులో 1,86,486 రూపాయలు ఉన్నట్లు తెలిపారు.


హుండీని లెక్కపెడుతున్న గ్రామస్తులు

## కాణిపాకంలో కన్నుల పండువగా త్రిశూలస్నానం


స్వామివారి ఆయుధం త్రిశూలానికి కలశాలలోని పవిత్రజలం, పాలతో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

**కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలో భాగంగా నవరాత్రి ఉత్సవాల చివరిరోజు శుక్రవారం త్రిశూలస్నానం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో గత నెల 28 నుండి ప్రారంభమైన స్వామివారి నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం జరిగిన ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవతో ముగిసింది. నవరా త్రి ఉత్సవాల అంకురార్పణ సందర్భంగా ప్రధాన ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో నవదాన్యాలను మొలకపోసి, అష్టోత్తర కలశాలను ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వేళల్లో యాగశాల పూజలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా స్వామివారి ఆయుధమైన త్రిశూలాన్ని స్వామివారు వాహనసేవల్లో ఊరేగే కాణిపాకం పురవీధుల్లో ప్రతిరోజూ ఉదయం ఊరేగిస్తుంటారు. స్వామివారి నవరాత్రి ఉత్సవాలు ముగిసినందున త్రిశూల స్నానం గావించారు. తిరుమల చక్రస్నానం తరహాలో కాణిపాకంలో త్రిశూల స్నానం ఘట్టం జరిగింది. ఈసందర్భంగా ముందుగా యాగశాలలో యాగమూరి ్తకి పూజలు నిర్వహించి పూర్ణాహుతి అనంతరం త్రిశూలాన్ని కాణిపాకం పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆలయం పవిత్ర పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం పుష్కరిణిలోని నీటిలో త్రిశూలస్నానం గావించారు. ఈసందర్భంగా యాగశాలలోని అష్టోత్తర కలశాలలోని పవిత్రజలంతో త్రిశూలానికి అభిషేకం గావించారు. అలాగే అంకురార్పణ రోజున మొలకపోసిన నవదాన్యాలను పుష్కరిణిలో నిమజ్జనం చేశారు. ఈకార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, డిప్యూటీ ఈఓ సాగర్‌బాబు, ఏఈఓలు ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రవీంద్రబాబు, ధనపాల్, హరిమాధవరెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు, చిట్టిబాబు,స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపిటీసీ లీలా సుధీర్‌లతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి
### మంటపం వద్ద పేలుడు ఇరువురికి గాయాలు

**కోవూరు,(నెల్లూరు) సెప్టెంబర్ 5 ప్రభాతవార్త :** శుక్రవారం తెల్లవారుజామున కోవూరులోని సత్రం వీధి ప్రాంతంలో గణేష్ నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా టపాసులు కాల్చే సమయంలో అపశృతి జరిగి తృటితో భారీ ప్రమాదం తప్పింది. కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సమాచారం మేరకు కోవూరులోని సత్రంవీధి ప్రాంతంలో యథావిధిగా వినాయకచవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం రాత్రి అక్కడి నుంచి ఊరేగింపుగా విగ్రహం బయలుదేరింది. ఈ నేపథ్యంలో సత్రంవీధి ప్రాంతంకు వచ్చే సరికి సాయిబాబా మెడికల్స్ షాపు పక్కనే ఉన్న స్థలంలో ఈ గణేష్ ఉత్సవ నిర్వాహకులు మెట్ల ప్రాంతంలో పేలుడు సామగ్రిని నిల్వ ఉంచారు. ఈ నేపథ్యంలో రహదారిలో టపాసులు కాలుస్తుండగా అందులో ఉన్న నిప్పు రవ్వలు నిల్వ ఉన్న టపాసులపై పడి భారీ స్థాయిలో పేలుడు సంభవించింది. ఈ సంఘటనలో ఆ ప్రాంతంలో ఉన్న ఎలక్ట్రికల్ స్కూటీ కూడా పేలిపోయింది. ఈ సంఘటనలో సాయిబాబా మెడికల్ షాపు యజమాని బ్రహ్మయ్య సతీమణి లక్ష్మి(45) తీవ్రగాయాలయ్యాయి. అదే ప్రాంతంలో ఉన్న రామ్‌దేవ్‌బాబాకు గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సంఘటనా స్థలాన్ని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ సిబ్బందితో వెళ్లి నిశిత పరిశీలన చేపట్టారు. ఈ పేలుడు సందర్భంగా షాప్ షట్టర్ దెబ్బతినడ, షాపులో ఉన్న మెడికల్ వస్తువులు కూడా కింద పడిపోవడం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మహామ్మద్ ప్రవక్తలా నిరాడంబర జీవితాన్ని అలవాటు చేసుకోవాలి
### ఆదర్శాలకు స్వస్తి: దారితప్పుతున్న జీవన గమనం:హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** మహామ్మద్ ప్రవక్త ఆచరించిన నిరాడంబర జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ పిలుపు నిచ్చారు.శుక్రవారం జామియా మస్‌జిద్‌లో రేహాన్, నూర్‌ఏమస్‌జిద్‌లో౼ మౌలానా మహమ్మద్‌ఆలీ సాహెబ్‌లు దివ్యఖుర్ ఆన్ పఠనానికి సంబందించి చైతన్య పరచారు.జామియా మస్‌జిద్‌లో రేహాన్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా సంబరాలు జరిపించుకోవటం కాదు. అది మన సంప్రదాయం, సంస్కృతి కాదన్నారు.ఆయన తను జన్మించిన సోమవారం, గురువారం ఉపవాస దీక్షలు పాటించేవారు అన్నారు. ఆయన నిరాడంబర జీవితాన్ని అనుభవిస్తూ భావి తరాలకు మార్గదర్శకులయ్యారన్నారు.నేడు మనం జన్మదినం అంటే సంబరాలుమిన్నుముట్టు తున్నాయన్నారు. మనం నిత్యం అల్లాహ్ మార్గాలను విడనాడి మనం స్వర్గం ప్రాప్తించాలని కోరుకోవటం కరెక్టు కాదన్నారు. మనం దివ్యఖుర్‌ఆన్‌తో సంబంధం లేకుండా జీవనం గడుపుతున్నామని దాని వల్ల నిత్యం దుఃఖంలో మునిగి తెలుతున్నామన్నారు. మనం ఎంత సంపాదించిన ఒదుగు కనబడటం లేదన్నారు. ఆయన శుక్రవారం నూర్‌ఏ మస్‌జిద్‌లో దివ్యఖుర్ ఆన్ పఠనానికి సంబందించి దిశ దెశ నిర్దేశం చేసారు. మనం ఇస్లాం మతంలో పుట్టి ముస్లింలుగా నటిస్తున్నాము తప్ప నాడు మన ప్రవక్త ఆచరించిన విధానాలు,ఆచారాలు, సంప్రదాయాలను తుంగలో తొక్కుతూ స్వర్గస్తులు కావాలని కోరుకోవటం సరికాదన్నారు. ప్రవక్త జీవితం మనకు మార్గదర్శకం కావాల్సి ఉండగా ఆచారాలకుతుంగలో తొక్కి కట్టుబొట్టు అన్ని మార్చుకున్నామన్నారు.మనం కలియుగం అంతంతో ఉన్నామన్నారు. అల్లాహ్ ఆదేశాలను మన ప్రవక్త ద్వారా అందించారని అయితే మనం కనీసం ఐదుపూటల్లా నమాజును కూడా ఆచరించలేని దీన స్థితిలో ఉన్నామన్నారు.ఈ నిర్లక్ష్యం నుంచి బయట పడాలన్నారు.ప్రవక్త ఆచరించిన మార్గాన్ని ఆచరిస్తూ యుగాంతంలో స్వర్గస్తులు కావాలని సూచించారు. జన్మదినాలంటే సంబరాలు జరుపుకోటం కాదు.ఆయన ఆచరించిన విధానాలను,జీవిత మార్గాలను ఆచరిస్తూ సన్మార్గంలో పయనించాలన్నారు.

### సబ్ రిజిస్ట్రార్ రమణరావు సస్పెన్షన్

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త** అనంతపురం అర్బన్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న జాయింట్ వన్ సబ్ రిజిస్టర్ రమణరావు ను సస్పెన్షన్ చేస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి విజయలక్ష్మి బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. సబ్ రిజిస్టర్ రమణరావు ఇటీవల డబల్ రిజిస్టర్లు చేయడంతో ఫిర్యాదులు వచ్చాయి.

దీనిపైన విచారణ చేసి సస్పెన్షన్ చేయడం జరిగిందన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు.

## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు



**విజయ వాడ, సెప్టెంబరు5, పభా తవా ర్తప్రతి నిధి:** ఉపాధ్యాయ దినో త్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు చేశారు. ౼శిష్యుల ఉన్నతిలోనే తమ విజయాన్ని చూసుకొని ఉపాధ్యాయులు సంతోషిస్తారు. తల్లితండ్రులతో పాటు విద్యాబుద్ధులు నేర్పే గురువును దైవంతో సమానంగా పూజించే సంస్కృతి మనది. నేడు గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయి అధ్యాపకులు, ఆచార్యులకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. పాఠశాల దశ నుంచే విద్యార్థులకు అకడమిక్ సంబంధిత అంశాలతోపాటు నైతిక విలువలు కూడా నేర్పించాలని ఉపాధ్యాయులను కోరుతున్నాను. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామకం చేపట్టింది. డీఎస్సీ నియామకంతో విధుల్లోకి రాబోతున్న ఉపాధ్యాయులకు అభినందనలు తెలియచేస్తున్నాన్న అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు వ్యాలీ మండలంలో గల మదగడ గిరిజన గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన రద్దు అయింది. ప్రభుత్వం పరంగా కార్యక్రమాలు, సమావేశాలతో బిజీగా ఉండటంతో తన పర్యటనను వాయిదా వేసుకున్నారు. మదగడ గిరిజన గ్రామాన్ని శుక్రవారం సందర్శిస్తానని ఇటీవల పవన్ కల్యాణ్ ప్రకటించిన విషయం తెలిసిందే.

## ఉపాధ్యాయులకు వైఎస్సార్సీ అధినేత జగన్ శుభాకాంక్షలు

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయులందరికీ వైసిపి అధినేత జగన్ శుభాంకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వైఎస్ జగన్ శుక్రవారం ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో..౼ మాజీ రాష్ట్రపతి, భారతరత్న, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకుంటూ మనస్ఫూర్తిగా నివాళులు. నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు౼ అని పేర్కొన్నారు.

### అంధ విద్యార్థులకూ సైన్స్ కోర్సులు : ప్రభుత్వం ఉత్తర్వుజారీ

**విజయవాడ,సెప్టెంబరు5,ప్రభాతవార్తప్రతినిధి:** అంధ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో సైన్స్ కోర్సులు చదివేందుకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందుకు సంబంధించిన జిఒ 278ను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం విడుదల చేశారు. ఈ విద్యాసంవత్సరం నుంచి అంధ విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మేథమేటిక్స్ వంటి కోర్సుల్లో చదువుకోవచ్చునని పేర్కొన్నారు. ప్రాక్టికల్స్ స్థానంలో విద్యార్థులకు బహుళ ఎంపిక ప్రశ్నాపత్రం అందిస్తామని పేర్కొన్నారు. దృష్టిలోపం విద్యార్థుల భవిష్యత్తుకు అడ్డు కాకూడదని, మిగిలిన విద్యార్థులతో వీరికి సమానంగా అవకాశాలు కల్పించడానికి మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ చూపారని మంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సైన్స్ కోర్సుల్లో అవకాశం కల్పించాలని విద్యార్థులు కోరడంతో మంత్రి ఈమేరకు చొరవ తీసుకున్నారని పేర్కొంది.

## వైభవంగా గణనాధుని ధ్వజారోహణం

**కాణిపాకం, సెప్టెంబర్ 5 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు శుక్రవారం ధ్వజావరోహణం, వడాయత్తు ఉత్సవం, ఏకాంతసేవ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు.గత నెల 27 నుండి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్న విషయం విదితమే. ఇందులో భాగంగా 28న ధ ్వజారోహణంతో ప్రారంభమైన నవరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం జరిగిన ధ్వజావరోహణంతో ముగిసింది. ముందుగా ఉదయం ఆలయంలో త్రిశూల స్నానం, వసంతోత్సవం కార్యక్రమంను కన్నుల పండువగా నిర్వహించారు. అలాగే రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమంను నిర్వహించారు. ఈమేరకు నవరాత్రి ఉత్సవాలు దిగ్విజయంగా నిర్వహించేందుకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ గత నెల 28న ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించగా, తొమ్మిది రోజులు అనంతరం శుక్రవారం ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఉభయదారులచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించిన అనంతరం ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభంపై ఎగుర వేసిన మూషికపటాన్ని శాస్త్రోక్తంగా పూజల అనంతరం అవతనం గావించారు. ఈసందర్భంగా మూషిక పటానికి పూజలు నిర్వహించారు. అనంతర ం స్వామివారికి వడాయత్తు ఉత్సవంను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించి వడలతో మాలవేసి, పెసరు పప్పు పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు.

# తిరుమల సమాచారం

## 24నుండి శ్రీవారి సేవకు ట్రైనర్ల శిక్షణ
### - 8 అంశాలలో నైపుణ్యం



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాత వార్తప్రతి నిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వస్తున్న అశేషసంఖ్య భక్తులకు అన్ని విభాగాల్లో ఇతోధిక సేవలందిస్తున్న శ్రీవారిసేవకులకు మరింత నైపుణ్యం కలిగించేందుకు ట్రైనర్లకు శిక్షణాతరగతులు నిర్వహిస్తు న్నారు. మొదటివిడత శిక్షణను ఈనెల 24వతేదీ నుండి అమలుచేసే దిశగా టిటిడి ఇఒ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. గ్రూప్‌పర్యవేక్షకులు, సేవకుల ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్‌పై ప్లానింగ్ విభాగానికి చెందిన నలుగురు నిపుణులుపవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. శ్రీవారిసేవకులకు సంబంధించి గ్రూప్ పర్యవేక్షకులు, ట్రైనర్ల శిక్షణ మాడ్యూల్‌పై శుక్రవారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, రాష్ట్ర ప్లానింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావుతో కలసి వర్చువల్‌గా ఐఐఎం అహమ్మదాబాద్ నుండి ఆచార్యులు విశ్వనాథ్, రామమోహన్, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిలతో ఇఒ శ్యామలరావు సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు సూచనలతో శ్రీవారిసేవకుల ప్రమాణాలను పెంపొందించాలనే ఉన్నతమైన సంకల్పంతో తగ కొద్దికాలంగా పలు సంస్కరణలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా గ్రూప్ సూపర్‌వైజర్లు, సేవకుల ట్రైనర్‌ల రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక యాప్‌ను ప్రారంభించామన్నారు. శ్రీవారిసేవకుల ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణనిచ్చేందుకు మరింత పటిష్ట ప్రణాళికలు,బోధన పాఠ్యాంశాలను రూపొందించాలని సూచించారు. శిక్షణ పొందిన ట్రైనర్లు, సూపర్‌వైజర్లు సేవకులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. మొదటివిడతగా ఈనెల 24వతేదీ శిక్షణ ప్రారంభించి మూడురోజులు కొనసాగుతుందన్నారు. ఉదయంవిధానపరమైన అంశాలపై, మధ్యాహ్నం వివిధ సేవా కేంద్రాల్లో క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్ళి పరిశీలించేలా రూపొందించాలన్నారు. పటిష్టసేవ అందించేందుకు నైపుణ్యాలు, స్ఫూర్తిదాయకమైన నాయకత్వం, సులభపద్ధతిలో అందరికీ అర్థమయ్యేలా ఆదర్శసేవకుడి లక్షణాలు ,పలుభాషలలో ప్రాథమిక నైపుణ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇఒ సూచించారు. ఈ సమావేశంలో టిటిడి సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, డిఎఫ్ఒ,ఐటి ఇన్‌ఛార్జి జిఎం ఫణికుమార్‌నాయుడు, శ్వేతడైరెక్టర్ రాజగోపాల్, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

## శ్రీవారిసేవలో పాట్నా హైకోర్ట్ జడ్జి అనుపమ చక్రవర్తి



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటంబంతో కలసి పాట్నా హైకోర్ట్ జడ్జి జస్టిస్ అనుపమ చక్రవర్తి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవదేవుని దర్శనం బాగా జరిగిందని తెలిపారు.

## బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి అజ్ఞాతభక్తుడు రూ.కోటిన్నర విరాళం

**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్‌కు ఓ అజ్ఞాతభక్తుడు భారీ విరాళం అందించాడు. బెంగుళూరుకు చెందిన ఓ అజ్ఞాతదాత 1.50కోట్ల రూపాయలు విరాళాలను శుక్రవారం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలసి అందజేశారు. శ్రీవేంకటేశ్వరస్వామిపై భక్తివిశ్వాసాలతో ఈ విరాళమిచ్చినట్లు ఆ భక్తుడు తెలిపాడు.

## భగవంతుని ఆశీర్వాదం అందరిపై ఉండాలి
### - ఎన్‌హెచ్‌ఆర్సీ ఛైర్మన్ జస్టిస్ రామసుబ్రమణ్యం



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుని ఆశీర్వాదంతోనే ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్థిల్లుతారని, భగవన్నామస్మరణతోనే మంచి జరుగుతుందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఎన్‌హెచ్‌ఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ రామసుబ్రమణ్యం తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో లోకం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో ఆలయంలోనికి చేరుకుని స్వామివారి దర్శనానంతరం ఆశీస్సులందుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. టిటిడి రిసెప్షన్ ఓఎస్‌డి సత్రానాయక్ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తెలంగాణ సస్యశ్యామలంగా అభివృద్ధి చెందాలి
### - నూతన సిఎస్ రామకృష్ణారావు



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలంగాణ సస్యశ్యామలంగా అభివృద్ధిచెందాలని ఆరాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆకాంక్షించారు. స్వామివారి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని కోరుకున్నారు. శుక్రవారం ఉదయం నైవేద్యవిరామసమయంలో కుటుంబంతో కలసి ఆయన ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఇప్పటినుండే అప్రమత్తంగా ఉండాలి



**తిరుమల,సెప్టెంబర్ 5ప్రభాతవార్తప్రతినిధి:** దేవదేవుని సాలకట్ల బ్రహ్మోత్సవాలు రెండువారాల్లో జరగనున్నా ఇప్పటినుండే అప్రమత్తంగా ఉండాలని తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు ప్రముఖులు, వివిఐపిలతోబాటు సామాన్యభక్తులు విచ్చేస్తారని, వారందరికీ గ్యాలరీల్లోకి ప్రవేశనిష్క్రమణ మార్గాలు సాఫీగా ఉండేలా చూసుకోవాలన్నారు. గ్యాలరీల వద్ద నిరంతరం భద్రత ఉండాలని, తరచూ తిరుమల, ఆలయ మాఢవీధులు తనిఖీలు చేసుకోవాలన్నారు. శుక్రవారంసాయంత్రం తిరుమలకు వచ్చిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, సిఐలు విజయకుమార్, రాముడుతో కలసి ఆలయ మాఢవీధులను పరిశీలించారు. ఆలయం ముందు బేడి ఆంజనేయస్వామి ఆలయం, ఆస్థానమండపం, అఖిలాండం వద్ద భక్తులు వేచిఉండటం, సిఎం పట్టువస్త్రాలు సమర్పణకుపర్యటించే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన భద్రతపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రణాళికలుసిద్ధంచేయాలని అధికారులకుసూచించారు.

# కన్ఫర్మ్‌డ్ ఐఎఎస్‌లుగా సీనియర్ అధికారులు

## కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** వివిధ శాఖల్లో పనిచేస్తున్న పలువురు పలువురు సీనియర్ అధికారులను కన్ఫర్మ్‌డ్ ఐఎఎస్‌లుగా పదోన్నతి కల్పించేందుకు తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించింది. రాష్ట్రంలోని ఒకే సారి 21 మంది సీనియర్ అధికారులు స్టేట్ సర్వీసు కేడర్, నాన్ స్టేట్ సర్వీసు కేడర్‌లకు కన్ఫర్డ్ ఐఏఎస్‌లుగా పదోన్నతి కల్పించేందుకు కసరత్తు పూర్తి చేసిన ప్రభుత్వం ఈ జాబితాను కేంద్రం అనుమతికి పంపించింది. రాష్ట్రంలో 2022 సంవత్సరానికి సంబంధించి 14 పోస్టులు, 2023 సంవత్సరానికి మూడు పోస్టులు, 2024 సంవత్సరానికి నాలుగు కన్ఫర్డ్ ఐఏఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్ల చొప్పున కేంద్రంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ)కి రాష్ట్ర ప్రభుత్వం పంపింది. గతంలో కన్ఫర్డ్ ఐఏఎస్‌ల ఎంపికకు యూపీఎస్సీ అధికారులు డీవోపీటీ పంపించిన జాబితాతో ఇంటర్వ్యూలు చేసి ఎంపిక చేసే వారు. కానీ ఈ సంవత్సరం నుంచి ఇంటర్వ్యూల విధానాన్ని ఎత్తివేశారు. దీంతో డీవోపీటీకి పంపించిన మూడు పేర్లలో ఒక్కో పోస్టుకు ఒకరిని ఎంపిక చేస్తారు. సర్వీసు రిజిస్టర్, వారి ఉద్యోగ జీవితంలో సాధించిన విజయాలను, ఆరోపణలు, ఫిర్యాదులు తదితర వాటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కన్ఫర్డ్ ఐఏఎస్‌లకు ఎంపిక చేయనుంది.

# యూరియా అదనపు సేల్‌కౌంటర్లు

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా యూరియా సరఫరా, వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రైతు వేదికల వద్ద అదనపు యూరియా సేల్ కౌంటర్లను ఏర్పాటు చేయాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో మండలానికి ఒకటి లేదా రెండు సహకార సంఘాలు మాత్రమే ఉన్న ప్రాంతాల్లో రైతు వేదికలను వాడుకొని గ్రామాల వారీగా, పాస్ పుస్తకాల ఆధారంగా ఒక రోజు ముందుగానే టోకెన్లు జారీచేసి ఎరువులు అందించాలన్నారు. ఈ పంపిణీ ప్రక్రియలో ఎక్కడా అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలీస్, విజిలెన్స్‌తో కూడిన పర్యవేక్షణతో ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వానాకాలం సాగు విస్తారంగా సాగుతున్న ప్రస్తుత సమయంలో రైతులు యూరియా ఎరువుల కొరతను ఎదుర్కొంటున్నారని, వచ్చే 20 రోజుల్లో 2 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి రాష్ట్రానికి అవసరమైన యూరియా కేటాయించేందుకు అంగీకరించిందని పేర్కొన్నారు. దేశీయ తయారీ యూనిట్ల నుండి కూడా అదనంగా 30 వేల టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించడానికి కేంద్రం అంగీకరించినట్లు తెలిపారు. వచ్చే 3,4 రోజుల్లో రామగుండం యూనిట్ తిరిగి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు చేపడతామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. ఈ రోజు రాష్ట్రానికి 11,181 టన్నుల యూరియా చేరిందని, రేపు మరో 9,039 టన్నులు రానుందని చెప్పారు. ఈ నెలలో నాలుగు రోజుల్లోనే రాష్ట్రానికి 28 వేల టన్నుల యూరియా సరఫరా అయిందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 8,20,112 టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని తెలిపారు.




# ఎపి, తెలంగాణలో మారుతి సుజుకి కొత్త ఎస్‌వియు విక్టోరియస్ ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** మారుతి సుజుకి ఇండియా లిమిటెడ్ (ఎంఎస్ఐఎల్) తన కొత్త ఎస్‌యువి విక్టోరియస్‌ను విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల కోసం హైదరాబాద్‌లోని ఒకహోటల్‌లో గ్రాండ్ రీజినల్ అన్ వీలింగ్ చేసింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కార్పొరేట్ సంస్థల నేతలు, ఫైనాన్షియర్లు, లీజింగ్ భాగస్వాములు, అలాగే డీలర్ ప్రతినిధులు హాజరయ్యారు. అందరి సమక్షంలో ఈ కార్యక్రమం గాట్ ఇట్ ఆల్ ఎస్‌యువిగా నిలిచే కొత్త విక్టోరియస్ ఆవిష్కరణ జరిగింది. కార్పొరేట్స్, ఫైనాన్షియర్లు, డీలర్ భాగస్వాములకు ప్రత్యేక ప్రదర్శన చేశారు. విక్టోరియస్ కోసం ఏపి, తెలంగాణ మార్కెట్లలో ఉన్న భారీ ఆసక్తి ఉత్సాహం ప్రతిబింబించిన సందర్భంగా నిలువనుంది.

భారతదేశంలో ఎస్‌యువి అనుభవాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లడానికి విక్టోరియస్ ప్రత్యేకంగా రూపుదిద్దుకుంది. 8స్పీకర్ ప్రీమియం ఇన్ఫినిటీ బై హామాన్ సరౌండ్ సౌండ్ సిస్టమ్ తో డాల్బీ ఆల్టోమోనస్ 5.1 థియేటర్ ఆన్ వీల్స్ అనుభవం, 10.1 స్మార్ట్ ప్లే ప్రొ ఎక్స్ టచ్ స్క్రీన్, ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టం, జెశ్చర్ కంట్రోల్ పవర్డ్ టెయిల్‌గేట్, 64కలర్ అంబియెంట్ లైటింగ్ - అదనపు సౌకర్యంగా ఉంది. అధునాతన సేఫ్టీ ఫీచర్లు - లెవెల్ 2 ఏడిఏఎస్, 6 ఎయిర్‌బ్యాగ్‌లు, హెచ్‌డీ 360 వ్యూ కెమెరా బహుళ పవర్‌ట్రైన్ ఆప్షన్లు - స్ట్రాంగ్ హైబ్రిడ్ ఈవి నిజు మోడ్‌తో, పెట్రోల, ఎస్ సిఎన్‌జి టెక్నాలజీతో అందుబాటులో ఉండనుంది.

# ధన, ధాన్య కృషి యోజనపై ఆశలు

## రాష్ట్రంలోని 5 జిల్లాల్లో అమలుకు యత్నం

## ఇప్పటికే కేంద్రానికి సర్కార్ ప్రతిపాదన

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** కేంద్రం తాజాగా ప్రకటించిన ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయడంపై రాష్ట్ర సర్కార్ ఆశలు పెట్టుకుంది. రాష్ట్రంలోని ఐదు జిల్లాలను ఈ పథకంలో చేర్చేలా వ్యవసాయ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే రాష్ట్ర సర్కార్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలోని నారాయణపేట, ములుగు, ఆసిఫాబాద్, సంగారెడ్డి, కొత్తగూడెం జిల్లాలను చేర్పించేందుకు తీవ్ర యత్నాలు జరుగుతున్నాయి. కాగా దేశ వ్యాప్తంగా వ్యవసాయపరంగా వెనుకబడిన 100 జిల్లాల్లో రైతులకు చేయూతనిచ్చి దిగుబడులు పెంచడానికి కేంద్రం ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన పథకాన్ని కేంద్రం తాజాగా ప్రకటించింది. కేంద్రంలోని 11 మంత్రిత్వ శాఖల్లో అమల్లో ఉన్న 36 పథకాలను సమ్మిళితం చేసి ఈ పథకాన్ని అమలు చేయనుంది. రూ.24వేల కోట్ల బడ్జెట్‌తో ఈ పథకాన్ని కేంద్రం ప్రారంభించింది. దీనికింద 1.7కోట్ల మంది రైతులకు ప్రయోజనం కల్పించేందుకు లక్ష్యంగా నిర్ణయించింది. పంటల మార్పిడి, సాగునీటి సౌకర్యాల కల్పన, నిల్వ సామర్థ్యం పెంపు, విలువ జోడింపు ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం దీని ప్రధాన లక్ష్యం. ఈ నేపథ్యంలో పూర్తిగా వర్షాలపై ఆధారపడిన తెలంగాణలోని ఐదు జిల్లాలను చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ జిల్లాల్లో పంటల ఉత్పాదకత చాలా తక్కువగా ఉంటోంది. వీటిని ధనధాన్య యోజనలో చేర్చితే ఆ జిల్లాల రైతులకు వ్యవసాయం గిట్టుబాటుగా మారుతుందని సర్కార్ చెబుతోంది.

# రైతుల కోసం వాట్సాప్ ఛానల్

## అందుబాటులోకి తెచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** వ్యవసాయ సమాచారం నిమిత్తం రైతుల కోసం రాష్ట్ర వ్యవసాయ శాఖ కొత్తగా వాట్సప్ ఛానెల్‌ను అందుబాటు లోకి తీసుకొచ్చింది. దీని ద్వారా ఎప్పటికప్పుడు తెలంగాణ రైతాంగానికి కీలకమైన సమాచారం, సలహాలు, సూచనలను వ్యవసాయ శాఖ అందిస్తోంది. ప్రధానంగా వాతావరణ హెచ్చరికలు, పంటల వివరాలు, పురుగు మందులు, ఎరువుల వివరాలు సులువుగా రైతాంగానికి సమాచారం తెలియజేస్తున్నారు. ఈ వాట్సప్ఛానెల్ ఎలా వినియోగించుకోవాలి అనే విషయాన్ని తెలియజేడానికి అర్టిఫిషియలి ఇంటెలిజెన్స్ (ఎఐ)తో కూడిన వీడియోను కూడా సృష్టించింది. రైతులకు సాగు చేస్తున్న ఆయా పంటలకు తెగుళ్ల పడితే ఎలాంటి మందులు చల్లాలి, ఏం చేయాలి అనే విషయాలను ఆశాఖ సమాచారం ఇస్తుంది. రాష్ట్రంలో ప్రధాన పంటగా ఉన్న వరిలో పాముపొడ తెగులు, ఆకు ముడత నివారణ కోసం శాస్త్రవేత్తల సూచనల మేరకు చేపట్టాల్సిన చర్యలు వివరంగా ఇందులో పేర్కొంది. ఇక కంది, మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు కోసం వాడాల్సిన పురుగు మందులు, పత్తిలో జింక్ లోపం సవరణ, పచ్చదోమ నివారణ వంటి వాటికి ఎలాంటి చర్యలు చేపట్టాలి, ఉద్యాన వన పంటల విషయంలో సవాళ్లు, సమస్యలు ఎదురైతే రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను అందిస్తుంది. మధ్య మధ్యలో రైతులకు వ్యవసాయానికి సంబందించి క్విప్ పోటీలను సైతం ఈ వాట్సప్ చానల్ లో నిర్వహిస్తున్నారు. రైతుల బీమా కు సంబందించిన సమాచారం, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు, పంటల సంరక్షణ సీజనల్ సూచనలు, ఆయా పంటలకు కీటక నియంత్రణ మార్గదర్శకాలు. మార్కెట్ ధరలు, శిక్షణా కార్యక్రమాల అప్ డేట్లు ఇలా అన్ని వివరాలు అరచేతిలో వున్న సెల్ ఫోన్ ద్వారా తెలుసుకోవచ్చని వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి తెలిపారు.

# విద్యాసంస్థలను తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రాధాన్యత

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



గురువారం టీచర్స్‌డే సందర్భంగా ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న రాంచందర్‌రావు తదితరులు

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** విద్యా సంస్థలను అభివృద్ధి దిశగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రాధాన్యత కల్పించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతి (ఉపాధ్యాయ దినోత్సవం) వేడుకల సందర్భంగా, ట్యాంక్‌బండ్ వద్ద ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాం చందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడు, దేశ రెండో రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరిం చుకుని ఉపాధ్యాయ దినోత్స వాన్ని జరుపు కుంటున్నాం అన్నారు. భారతదేశ నిర్మాణంలో, అలాగే విద్యావ్యవస్థలో అనేక మార్పులకు కారణమైన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినం సందర్భంగా ఉపాధ్యాయులను గౌర వించుకోవాలన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఉపాధ్యా యులకు, విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కనీసం వారి సమస్యలను, ఘోషను ప్రభుత్వం పట్టించుకోవాలని, ఇప్పటికీ ప్రభుత్వ ఉపాధ్యాయులు, టీచర్లకు సకాలంలో జీతాలు రావడం లేదని, రిటైర్డ్ టీచర్లు, ఉద్యోగులకు పెన్షన్ల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిరక్ష్యం వహిస్తుందన్నారు. సమాజంలో భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతిఒక్కరి ధర్మం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా విశ్వవిద్యాలయాల ప్రగతికి, విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయాలకు వెయ్యి కోట్లు ఇస్తామని కేవలం ప్రకటనలు గుప్పించడం కాదు, ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సమస్యలకు చెక్

## ఫొటోల కష్టాలకు తెర.. ఒక్క క్లిక్‌తో యాప్‌లో అప్‌లోడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్త సౌకర్యం కల్పించింది. ఇకపై అధికారులు ఫొటోలు తీయకుండానే, లబ్ధిదారులే యాప్ ద్వారా ఇళ్ల చిత్రాలు అప్లోడ్ చేసే అవకాశాన్ని కల్పించారు. ఆ ఫొటోల ఆధారంగా బిల్లులు విడుదల చేస్తారు. ఈ విధానం వల్ల ఆలస్యం తగ్గి, లబ్ధిదారులకు సకాలంలో ఆర్థిక సహాయం అందుతుంది. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు దశలవారీగా నిధులు అందనున్న విషయం తెలిసిందే. ఈ కొత్త పద్ధతి పారదర్శకతను పెంచడమే కాకుండా, గ్రామీణ కుటుంబాల భాగస్వామ్యాన్ని కూడా పెంచుతుంది. తెలంగాణలో గృహ నిర్మాణ పథకాలలో ప్రధానమైనది ఇందిరమ్మ ఇళ్ల పథకం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు గృహ భద్రత కల్పిం చాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. గతంలో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించిన తర్వాత బిల్లులు రావడంలో ఆలస్యం ఎదుర్కొనడం సాధారణమైంది. దీనికి కారణం అధికారులు స్వయంగా స్థలానికి వెళ్లి ఇళ్ల ఫొటోలు తీసి నివేదిక పంపడంలో ఆలస్యం కావడంతో ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ వీపీ గౌతం ప్రకటన ప్రకారం.. ఇకపై లబ్ధిదారులే తమ ఇందిరమ్మ ఇళ్ల ఫొటోలు నేరుగా ప్రత్యేక యాప్‌లో అప్లోడ్ చేసే సౌకర్యం పొందనున్నారు. ఆ ఫొటోలు ఆధారంగా వెంటనే బిల్లులు విడుదల చేయబడతాయి. దీంతో ఎవరూ అధికారులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. సమయానికి సాయం అందు తుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరిగాయి. ఈ పథకం దశలవారీగా అమలు అవుతోంది. మొదటి దశలో ముగ్గులు పోసి.. బేస్ మట్టం వరకు లేపిన తర్వాత డబ్బులు జమ చేస్తారు. ఆ తర్వాత గోడలు కట్టిన తర్వాత ఫొటోలు పంపితే మొదటి వాయిదా వస్తుంది. మూడో దశలో పైకప్పు పూర్తయిన తర్వాత మరో విడత విడుదల అవుతుంది. చివరగా ఇంటి పనులు ముగిసిన తర్వాత తుది బిల్లు వస్తుంది. ఈ విధానంతో లబ్ధిదారులకు పారదర్శకతతో పాటు వేగవంతమైన ఆర్థిక సహాయం లభిస్తుంది. ఈ నిర్ణయం సొంత ఇంటి కలను నిజం చేసుకోవాలనుకునే వేలాది కుటుంబాలకు ఉపశమనం కలిగిస్తుంది. అయితే అధికారులు ఫొటోలు తీసేందుకు వెళ్లకపోవడం.. దీంతో బిల్లులు ఆలస్యం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఇక వీటిని చెక్ పడనుంది. గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్ ఉపయోగం పెరుగు తున్నందున, చాలామంది లబ్ధిదారులు ఈ కొత్త సదుపాయాన్ని సులభంగా వినియోగించగలరని అధికారులు అంచనా వేస్తున్నారు. పేద కుటుంబాల గౌరవాన్ని, భవిష్యత్తును కాపాడే ప్రయ త్నంలో భాగంగా దీనిని తీసుకొచ్చారు. తమ ఇంటిని తాము ఫొటో తీసి అప్లోడ్ చేయడం ద్వారా లబ్ధిదారులు ప్రభుత్వ పథకంలో భాగస్వామ్యులవుతారు. తద్వారా ఇందిరమ్మ ఇళ్లు పథకం మరింత పారదర్శకతతో ముందుకు సాగనుంది.

# కెసిఆర్ లేకుంటే బిఆర్ఎస్ ఉండదు: ఎంపి అసదుద్దీన్ ఒవైసి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు లేకుంటే ఆ పార్టీ మనుగడలో ఉండదని మజ్లీస్ పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్య చేశారు. శుక్రవారం అసద్ తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ కెసిఆర్ అంటే తనకు గౌరవం ఉందన్నారు. కెసిఆర్ అంటేనే బిఆర్ఎస్, బిఆర్ఎస్ అంటేనే కెసిఆర్ అని ఆయన తెలిపారు. కెసిఆర్ లేకపోతే బిఆర్ఎస్ ఉండదని ఆయన చెప్పారు. అంతకుముందు అసద్ మహారాష్ట్ర కార్యవర్గంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముంబయి, పుణే, నాగ్‌పూర్, ఔరంగాబాద్,నాసిక్, ఔరంగాబాద్, పర్భనీ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీని మరింత బలో పేతం చేసుకునే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ దళితులు, మైనారిటీల సమస్యలపై పోరాటం ఉధృతం చేయాలని కార్యవర్గానికి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, నిజాయితీపరులను ఎంపిక చేయాలని, ఎన్నికైన తర్వాత పార్టీ ఫిరాయించని వారిని గుర్తించాలని ఆయన సూచించారు.

# మంత్రి సీతక్కతో నీట్ క్వాలిఫైడ్ విద్యార్థులు, తల్లిదండ్రుల భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ప్రజాభవన్‌లో శుక్రవారం మంత్రి సీతక్కను నీట్ క్వాలిఫైడ్ విద్యార్థులు వారి తల్లిదండ్రులు కలిశారు. నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించినా సుప్రీంకోర్టు తీర్పు కారణంగా కౌన్సిలింగ్‌కు హాజరు కాలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బిడ్డలమైనప్పటికీ కేవలం ఇంటర్మీడియట్ పొరుగు రాష్ట్రాల్లో చదవడం వల్ల తమ నష్ట పోతు న్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో పొరుగు రాష్ట్రంలో చదవడంతో 45 మంది నీటి విద్యార్థులు నష్టపోతున్నట్లు వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. క్వాలిఫైడ్ అయిన నీట్ విద్యార్థుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సీతక్క వారికి హామీ ఇచ్చారు. మంత్రి తమ సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు కృతజ్ఞతలు తెలిపారు.

## పోచారం శ్రీనివాస్‌రెడ్డి బాన్సువాడలో

# ఓడిపోవడం ఖాయం

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** తెలంగాణలో రాబోయే ఆరు నెలల్లో ఉప ఎన్నికలు వస్తాయని బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఓడిపోవడం ఖాయమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల రామారావు జోస్యం చెప్పారు.ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో బాన్స్‌వాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు శుక్రవారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని, పోచారం ఎమ్మెల్యే పదవి పోయే వరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్ చేతిలో పెట్టామని కానీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలోనూ, గతంలో ఉన్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలోనూ ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని కార్యక్రమాలను అమలు చేయలేమని నేరుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 21 నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. హామీల వైఫల్యం, నమ్మకద్రోహం ఒక కారణం అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటల తీరు, వ్యవహార శైలి మరో ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిక్షణం కెసిఆర్ పేరు తలుచుకుంటూ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని నడపడం చేతగాక, గత ప్రభుత్వం అప్పులు చేసిందని కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని మండిపడ్డారు. గత ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసిందని పార్లమెంట్ సాక్షి గా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని తెలిపారు. అయితే, ఈ 21 నెలల కాలంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2.20 లక్షల కోట్ల పైగా అప్పులు చేసిందని, ఆ అప్పుతో ఏ ఒక్క సంక్షేమ పథకం లేదా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదని విమర్శించారు. గత ప్రభుత్వం సంవత్సరానికి రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తే, ఈ ప్రభుత్వం నెలకు రూ. 20 వేల కోట్ల అప్పు చేస్తోందని ఆరోపించారు.

యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారితీస్తోందని కెటిఆర్ అన్నారు. పంటల కొనుగోళ్లకు, ఆ తర్వాత వాటికి ఇవ్వాల్సిన బోనస్‌ను ఎగగొట్టాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే యూరియా సరఫరా చేయడం లేదని ప్రజలు భావిస్తున్నారని ఆయన తెలిపారు. వ్యవసాయ రంగం, రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంత దుర్మార్గమైన ఆలోచన ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎర్రవెల్లిలోని కెసిఆర్ నివాసంలో జరిగిన చేరికల కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నేతలు, వందలాది కార్యకర్తలు భారత రాష్ట్ర సమితిలో చేరారు. వీరిలో ఎంపిటిసి ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బాన్సువాడ నార్ల రత్న కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొట్టె గజేందర్, మాజీ సర్పంచులు పద్మ మొగులయ్య, బంజా గంగారాం, కురలేపు నగేష్, మాజీ కోఆప్షన్ హాకీమ్ తదితరులు ఉన్నారు.

# ఖేలో ఇండియా గేమ్స్ తెలంగాణలో నిర్వహించండి

## కేంద్రమంత్రికి రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** ఖేలో ఇండియా గేమ్స్‌ను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండ వీయను కోరినట్లు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకాటి శ్రీహరి శుక్రవారం ఢిల్లీలో తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహించాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి చెప్పారు. తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఉన్న స్పోర్ట్స్ స్కూల్స్‌కి ఆర్థికంగా సహాయం చేయాలని, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలతోపాటు ఆర్థిక సహకారం కూడా అందించాలని కేంద్రమంత్రిని కోరినట్లు తెలిపారు. త్వరలోనే మూడు రోజుల పాటు తెలంగాణలో పర్యటిస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్లు మంత్రి వాకాటి శ్రీహరి తెలిపారు.

# న్యాక్ ట్రైనర్ స్నేహాలతకు రాష్ట్రపతి నుంచి అవార్డు

## అభినందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్‌ను అత్యుత్తమ స్కిల్ డెవలప్‌మెంట్ వేదికగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చేస్తున్న కృషికి ఫలితం దక్కుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థుల్లో స్కిల్ డెవల్మపెంట్ పెంపొందించాలనే లక్ష్యంతో ఇప్పటికే ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌పెంట్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నది. అందులో భాగంగా హైదరాబాద్ వేదికగా, జిల్లాల్లో న్యాక్ ద్వారా శిక్షణ ఇవ్వడమే కాకుండా100 శాతం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఎన్ ఎసి వైస్ ఛైర్మన్,మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మంత్రి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు.ఈ నేపథ్యంలోనే టీచర్స్ డే పురస్కరించుకొని న్యాక్ ట్రైనర్ స్నేహాలతకు రాష్ట్ర పతి చేతుల మీదుగా జాతీయ అవార్డు రావడం పట్ల మంత్రి తన హర్షం వ్యక్తం చేశారు.


మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ విభాగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారి చేతుల మీదుగా శుక్రవారం ఢిల్లీలో జాతీయ ఉత్తమ టీచర్స్ అవార్డు అందుకున్న న్యాక్ ట్రైనర్ స్నేహాలతకు ఫోన్ చేసి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కల్పించే వృత్తివిద్యా కోర్సులను అందిస్తూ, ఉత్తమ బోధన అందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని కొనియాడారు.

దేశవ్యాప్తంగా 13 మంది ఈ వార్డుకు ఎంపికైతే తెలంగాణ నుండి న్యాక్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హన్మకొండకు చెందిన నక్క స్నేహాలతకు అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అన్నారు.నైపుణ్యాలకు ఉత్తమ వేదికగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్న మంత్రి, ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు దక్కడంతో న్యాక్ ఫ్యాకల్టీ,సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. స్నేహాలతను ప్రోత్సహించిన న్యాక్ డైరెక్టర్ శాంతి శ్రీ ని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు.రాష్ట్ర పతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్నేహాలతకు న్యాక్ డైరెక్టర్ జనరల్(డీజీ),ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్

# ప్రభుత్వ అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి కేంద్రంపై నెపం సరికాదు

## బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతలను కప్పిపుచ్చుకోడానికి కేంద్రాన్ని, బిజెపిని నిందించడం సరైనది కాదని, కేంద్ర ప్రభుత్వం రైతుల, వ్యవసాయ రంగానికి నిరంతరం మద్దతు ఇస్తుందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో ప్రభుత్వం ఉందా? ఉందంటే, కాంగ్రెస్ ప్రభుత్వానికి సమన్వయం ఉందా అనే సందేహం ప్రజల్లో ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ యూరియా కొరత లేదని, సమస్య కేవలం పంపిణీలోనే ఉందని చెబుతున్నారు.కానీ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ యూరియా కొరత ఉందని, దానికి కేంద్రమే బాధ్యత అని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. మహేశ్ కుమార్ గౌడ్‌కి వాస్తవ పరిస్థితి తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడంలేదా? లేక కేవలం కమ్యూనికేషన్‌లో లోపమేనా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో అక్టోబర్ 31 వరకు అవసరాల మేరకు 9.3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందించింది, 2.8 లక్షల మెట్రిక్ టన్నులు బఫర్ స్టాక్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. మరి ఎరువుల కొరత ఇంకెక్కడిది?జులైలోనే 20శాతం మేర ఎక్కువ యూరియాను రాష్ట్రానికి కేంద్రం పంపించింది. టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కేంద్రాన్ని బదనాం చేసే ప్రయత్నం చేస్తూ, అసలు లోపాన్ని బయటపెట్టడం లేదన్నారు. ఆదిలాబాద్, మహబూబ్ నగర్, వికారాబాద్‌లో ఎరువుల లారీలు పట్టు బడినట్లు, ఎరువుల దుకాణాలు మూసివేసినట్లు వార్తలు వస్తున్నాయి.ఇక్కడ బ్లాక్ మార్కెటింగ్, పంపిణీ లోపాలు ఎక్కడ జరిగాయి అనే విషయం పరిశీలించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఓఆర్ఆర్‌పై సిట్ విచారణ చేపడతామని చెప్పింది. కానీ ఇప్పటివరకు ఏ విచారణ జరగడం లేదు. ఇందులో ఏమైంది, ఎక్కడ ఎంత డబ్బు ముట్టిందనే అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయి. గత బిఆర్ఎస్ సర్కారు కమీషన్లు తీసుకొని కాంట్రాక్టర్లకు అమ్మేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం దానిపై విచారణ చేయకుండా నిరక్ష్యం వహిస్తుందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రివ్యూ జరపకపోతే ప్రజల ఆగ్రహానికి బాధ్యత వహించాల్సి వస్తుంది. అవినీతికి నిదర్శనంగా ఓఆర్ఆర్ మారింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం వాహనదారులపై



భారం తగ్గనుంది.. కాంగ్రెస్ సర్కారు అసమర్ధతతో భారం పెరుగుతోంది.కేంద్రం జాతీయ రహదారులపై టోల్ ఛార్జీలను తగ్గించడంలో కీలక నిర్ణయం తీసుకుంది. అదే విధానాన్ని ఓఆర్ఆర్‌పై కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# 'వీర చంద్ర హాస' 19న గ్రాండ్ రిలీజ్

కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎమ్‌వీ రాధాకృష్ణ తెలుగులో విడుదల చేస్తున్న కన్నడ చిత్రం "వీర చంద్రహాస". మంచి టేస్ట్ ఉన్న ప్రొడ్యూసర్‌గా రాధాకృష్ణకు గుర్తింపు ఉంది. గతంలో శివరాజ్ కుమార్ నటించిన వేద, ప్రజ్వల్ దేవరాజ్ నటించిన 'రాక్షస' చిత్రాలను తెలుగులో రిలీజ్ చేసిన ఆయన. తాజాగా "వీర చంద్రహాస" తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. సెప్టెంబర్ 19న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఇటీవల ఇండియన్ బాక్సాఫీస్ దగ్గర రికార్డులు సృష్టించి మూడు వందల కోట్లు కలెక్షన్స్ రాబట్టిన "మహావతార్ నరసింహా" తర్వాత హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో విడుదల చేస్తున్న "వీర చంద్రహాస" చిత్రంపై అంచనాలు నెలకొన్నాయి. ఆ చిత్రం తరహాలోనే ఇది కూడా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందని నిర్మాతలు అన్నారు. కేజీయఫ్, సలార్ లాంటి యాక్షన్ చిత్రాలకు సంగీతం అందించి మ్యూజిక్ డైరెక్టర్‌గా ఒక సంచలనం సృష్టించిన రవి బస్రూర్. వీర చంద్రహాసచిత్రానికి దర్శకత్వం వహించారు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రంలో శిథిల్ శెట్టి, నాగశ్రీ జిఎస్, ప్రసన్న శెట్టిగార్ మందార్తి, ఉదయ్ కడబాల్, రవీంద్ర దేవాడిగ, నాగరాజ్ సర్వెగర్, గుణశ్రీ ఎం నాయక్, శ్రీధర్ కాసర్కోడు, శ్వేత అరెహోల్, ప్రజ్వల్ కిన్నాల్ ప్రధాన పాత్రలు పోషించారు. కన్నడ అగ్ర నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ సమర్పణలో ఓంకార్ మూవీస్ బ్యానర్‌పై ఎన్ ఎస్ రాజ్‌కుమార్ నిర్మించారు. కన్నడలో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. సందర్భంగా నిర్మాత ఎమ్‌వీ రాధాకృష్ణ మాట్లాడుతూ, కన్నడలో విడుదలైన' వీర చంద్రహాస" చిత్రం హిట్ టాక్‌తో పాటు మంచి వసూళ్లను రాబడుతోంది. ఈ మూవీ తెలుగు రైట్స్ దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉంది. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులకు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ చిత్రానికి కూడా తెలుగు ఆడియెన్స్ బ్రహ్మరథం పడతారని ఆశిస్తున్నా. సినిమా సక్సెస్ గ్యారెంటీ అని నమ్ముతున్నా. తనదైన సంగీతంతో అందర్నీ మెప్పించిన రవి బస్రూర్ దర్శకుడిగానూ సత్తా చాటడం సంతోషంగా ఉంది. ఇటీవల విడుదలైన 'మహావతార్ నరసింహ' చిత్రం తరహాలోనే ఈ చిత్రం కూడా ఉండటంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని బలంగా నమ్ముతున్నాం అని అన్నారు. సంగీత దర్శకుడు, దర్శకుడు రవి బస్రూర్ మాట్లాడుతూ. డైరెక్టర్‌గా నేను రూపొందించిన ఈ సినిమాను కన్నడ ప్రేక్షకులు బాగా ఆదరించారు. తెలుగు ఆడియెన్స్‌కు కూడా కచ్చితంగా నచ్చుతుందని భావిస్తున్నా. శివరాజ్‌కుమార్‌తో పాటు ఇందులో నటించిన నటీనటులంతా చాలా బాగా సపోర్ట్ చేశారు.






# 'అర్జున్ చక్రవర్తి' బెస్ట్ సినిమాటో గ్రాఫర్

'అర్జున్ చక్రవర్తి' చిత్రంతో కెమెరా మెన్‌గా జగదీష్ చీకటి పేరు ఎక్కువగా విని పిస్తోంది. విజువల్ ట్రీట్‌గా మూవీని తెరకెక్కించిన జగదీష్ చీకటి పనితనం గురించి ప్రస్తుతం అందరూ మాట్లాడుకుంటున్నారు. 'అర్జున్ చక్రవర్తి' చిత్రానికి గానూ ఎన్నో అంతర్జాతీయ వేడుకల్లో బెస్ట్ సినిమాటో గ్రఫర్‌గా జగదీష్ చీకటి అవార్డుల్ని అందుకున్నారు.'అర్జున్ చక్రవర్తి' ప్రస్తుతం విజయవంతంగా దూసుకుపోతోండటంతో కెమెరామెన్ జగదీష్ చీకటి చెప్పిన సంగతులివే.

**మీ నేపథ్యం ఏంటి? మీ సినీ ప్రయాణం ఎలా మొదలైంది?** నాకు డ్రాయింగ్, ఫోటోగ్రఫీ అంటే చాలా ఇష్టం. ఫోటోగ్రఫీలోనూ మాస్టర్స్ చేశాను.దూరదర్శన్‌లోనూ పని చేశాను. స్టిల్ ఫోటోగ్రఫీలోనూ అవార్డులు వచ్చాయి. ఎన్నో కమర్షియల్ యాడ్స్,ఎన్నో ప్రాజెక్టులను చేశాను. అలా చేస్తున్న సమయంలోనే జత కలిసే మూవీకి అవకాశం వచ్చింది.

**మీఫ్యామిలీ నుంచి ఎలాంటి సపోర్ట్ ఉండేది?**మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగం చేస్తారు. నాకు ఎప్పుడూ కూడా ఫుల్ సపోర్ట్ ఇస్తుండేవారు. నచ్చిన పని ఏదైనా సరే చేయమని, అనేవారు. .అప్పుడు కూడా నాకు ఫుల్ సపోర్ట్ ఇచ్చారు.

**అర్జున్ చక్రవర్తి విషయంలో మీ వర్క్ ఎక్స్‌పీరియెన్స్ గురించి చెప్పండి.** హాలీవుడ్ స్థాయికి ధీటుగా మనం తీస్తున్నాం. మా అర్జున్ చక్రవర్తి కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఆ స్థాయి లుక్ వచ్చేందుకు నేచురల్ లైటింగ్‌లోనే షూటింగ్ చేశాం.

**అర్జున్ చక్రవర్తి షూటింగ్ టైంలో ఎదురైన సవాళ్లు?** మంచు కురిసే ప్రాంతం కదా అని కాశ్మీర్‌కు వెళ్లాం. కానీ మేం వెళ్లినప్పుడు అక్కడ మంచు పడటం లేదు. దీంతో అక్కడే మంచు కురిసే వరకు ఎదురుచూశాం. అలా చివరకు మైనస్ 8 డిగ్రీల వరకు వెళ్లింది.అలా మంచు కురుస్తుంటే స్వర్గమంటే ఇదేనేమో అన్నట్టుగా కనిపించింది. దీంతో మేం అనుకున్న దానికింటే బాగా షూట్ చేశాం.




# సెన్సార్ పనులు ముగిసిన 'కిష్కింధపురి'




**టాలీవుడ్ లో** తెరకెక్కుతున్న చిత్రాల్లో 'కిష్కింధపురి' కూడా ఒకటి. హారర్ జోనర్ లో వస్తున్న ఈ సినిమాలో బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమా పై సాలిడ్ అంచనాలు పెంచింది.

ఇక ఇప్పుడు ఈ సినిమా సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. ఈ సినిమాలోని కంటెంట్ కేవలం పెద్ద వారికే అని ఈ సర్టిఫికెట్ ఇష్యూ చేసింది. హారర్ ఎలిమెంట్స్ వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర యూనిట్ చెబుతోంది.

అయితే, ఈ సినిమా లో ఒక్క కట్ కూడా లేకుండా సెన్సార్ ఈ నిర్ణయం తీసుకోవడం తో చిత్ర యూనిట్ హర్షం వ్యక్తం చేస్తోంది. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాని కౌశిక్ పెగళ్లపాటి డైరెక్ట్ చేస్తున్నాడు. సెప్టెంబర్ 12న ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ కి రెడీ అయింది.

# ఓ.. చెలియా' చిత్రం నుండి.. నువ్వే చెప్పు చిరుగాలి పాట విడుదల

**ఎస్‌ఆర్‌ఎస్ మూవీ క్రియేషన్స్,** ఇందిరా దేవీ ప్రొడక్షన్స్ బ్యానర్‌ల మీద రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్న చిత్రం ఓ.. చెలియా. ఈ మూవీకి కథ, కథనం, దర్శకత్వ బాధ్యతల్ని ఎం. నాగ రాజశేఖర్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు. నాగ ప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన ఈ మూవీకి సంబంధించిన ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. రాకింగ్ స్టార్ మంచు మనోజ్ చేతుల మీదఓ.. చెలియా నుంచి ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేయించారు.

నువ్వే చెప్పు చిరుగాలి అంటూ సాగే ఈ పాటను మంచు మనోజ్ విడుదల చేశారు. పాటను రిలీజ్ చేసిన అనంతరం చిత్ర యూనిట్‌కి మంచు మనోజ్ అభినందనలు తెలియజేశారు. ఈ పాటను సాయి చరణ్ ఆలపించగా.. ఎంఎం కుమార్ బాణీని అందించారు. ఇక సుధీర్ బగడి రాసిన సాహిత్యం ఆకట్టుకునేలా ఉంది. లిరికల్ వీడియోని చూస్తుంటే మంచి ప్రేమ కథా చిత్రాన్ని అందించబోతోన్నట్టుగా కనిపిస్తోంది. ఇక హీరో హీరోయిన్ల కెమిస్ట్రీ చాలా ఫ్రెష్‌గా, ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా ఉంది. ఈ మూవీకి సురేష్ బాలా కెమెరామెన్‌గా, ఉపేంద్ర ఎడిటర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించబోతోన్నారు.



# ' టన్నెల్' ట్రైలర్ విడుదల



అథర్వా మురళీ క్రైమ్, సస్పెన్స్, థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకున్నాడటే బ్లాక్ బస్టర్ పక్కా అన్నట్టే. ప్రస్తుతం అథర్వా యాక్షన్ ప్యాక్డ్ థ్రిల్లర్ జానర్‌లో' టన్నెల్' అనే మూవీని చేశారు. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయికగా నటించారు. అశ్విన్ కాకుమాను విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న థియేటర్లలోకి రానుంది. ఈ మూవీని తెలుగులోకి ఎ.రాజు నాయక్ లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. తాజాగా ట్రైలర్ విడుదల చేసి అంచనాలు పెంచేశారు. 'యూనిఫామ్ వేసుకున్న తరువాత అందరూ ఫ్యామిలీనే' అని ట్రైలర్ లో హీరో చెప్పిన డైలాగ్ చూస్తే టన్నెల్ సినిమా ఎలా ఉంటుందో అర్థం అవుతుంది. ఇక ఇందులో సస్పెన్స్ థ్రిల్లర్ యాక్షన్‌కి ఎంత ఇంపార్టెన్స్ ఉందో లవ్ ట్రాక్ కి కూడా అంతే ప్రాధాన్యం ఉందని తెలుస్తోంది. లావణ్య త్రిపాఠి, అథర్వ కాంబో అందరినీ అలరించేలా ఉంది. గ్రిప్పింగ్, అదిరిపోయే యాక్షన్ సీక్వెన్స్‌లతో ట్రైలర్‌ను కట్ చేశారు. జస్టిన్ ప్రభాకరన్ ఈ మూవీకి సంగీతాన్ని అందించారు. శక్తి శరవణన్ సినిమాటోగ్రాఫర్‌గా పని చేశారు. కలైవానన్ ఈ సినిమాకు ఎడిటర్. తెలుగు వెర్షన్ ప్రమోషన్లు త్వరలో ప్రారంభం కానున్నాయి. అథర్వా మురళీ తెలుగు ప్రమోషన్స్‌లో సందడి చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

# 'రీ ర్యాంప్' నుంచి స్పెషల్ పోస్టర్

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం " రీర్యాంప్ సినిమా నుంచి 'ఓనమ్' పండుగ శుభాకాంక్షలతో స్పెషల్ పోస్టర్ విడుదల, దీపావళి సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా " రీర్యాంప్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. "రీర్యాంప్" సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.ఈ రోజు 'ఓనమ్' పండుగ సందర్భంగా " రీర్యాంప్" సినిమా నుంచి విశెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. కేరళ నేపథ్యంగా జరిగే కథను " రీర్యాంప్" మూవీలో సరికొత్తగా చూపించబోతున్నారు. ఓనమ్ పండుగ సెలబ్రేషన్స్‌తో సాగే పాటను కూడా ఈ మూవీలో ప్రత్యేకంగా చిత్రీకరించారు. ప్రస్తుతం ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ సక్సెస్‌ఫుల్ గా జరుగుతున్నాయి. ఈ నెల 9న "రీర్యాంప్" సినిమా నుంచి మ్యాజికల్ లవ్ మెలొడీ సాంగ్ 'కలలే కలలే' విడుదల చేయబోతున్నారు.నటీనటులు: కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెలకిషోర్ తదితరులు.రచన, దర్శకత్వం: జైన్స్ నాని.



# 'ది గేమ్ :యు నెవర్ ప్లే ఎలోన్' అక్టోబర్ నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్



శ్రద్ధా శ్రీనాథ్, రాజేష్ ఎం. సెల్వా గ్రిప్పింగ్ థ్రిల్లర్ 'ది గేమ్: యు నెవర్ ప్లే ఎలోన్ " అక్టోబర్ 2న నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్ లో నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలసి చేస్తున్న న్యూ థ్రిల్లర్ "ది గేమ్: యూ నెవర్ ప్లే ఎలోన్" అక్టోబర్ 2న నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ కానుంది. బ్లాక్ వారంట్ తర్వాత నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయికలో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని రాజేష్ ఎం. సెల్వా డైరెక్ట్ చేస్తున్నారు.

లీడ్ రోల్‌లో శ్రద్ధా శ్రీనాథ్ నటిస్తుండగా, సంతోష్ ప్రతాప్, చందినీ, శ్యామహరిని, బాలహసన్, సుబాష్ సెల్వం, వివియా సంతోష్, ధీరజ్, హెమా ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. స్ట్రాంగ్ స్టోరీటెల్లింగ్‌తో పాటు టైమ్‌లి థీమ్స్‌ని మిక్స్ చేస్తూ ఆడియన్స్‌కి డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనుంది నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ మాట్లాడుతూ.. 'ది గేమ్' మా ఈ ఏడాది ఫస్ట్ తమిళ సిరీస్. సరికొత్త స్టోరీని తీసుకొస్తున్నాం. ఒక ఫీమేల్ గేమ్ డెవలపర్‌పై జరిగే కోఆర్డినేటెడ్ అటాక్ వెనక వాళ్లను ట్రాక్ చేసే ఆమె జర్నీని ఈ థ్రిల్లర్ గా ప్రజెంట్ చేస్తునాం. అప్లాజ్ తో మా కలయికలో ఇప్పటికే బ్లాక్ వారంట్ వచ్చింది. ఇప్పుడు ఈ సిరీస్ కూడా చాలా రెలివెంట్‌గా ఉంటుంది. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎండీ సమీర్ నాయర్ మాట్లాడుతూ, ది గేమ్ అనేది డిజిటల్ యుగం రియాలిటీలను చూపించే టైమ్‌లి స్టోరీ. రాజేష్ సెల్వా స్టైల్‌తో స్ట్రాంగ్ స్టోర్బీటెల్లింగ్ తో ఆడియన్స్‌కి చాలా కనెక్ట్ అవుతుంది.డైరెక్టర్ రాజేష్ ఎం. సెల్వా మాట్లాడుతూ.. ది గేమ్ కేవలం థ్రిల్లర్ మాత్రమే కాదు, మనం ఉన్న రియల్ వరల్డ్‌కి అద్దం పడుతుంది. ఇది పీపుల్, వాళ్ల ఛాయిస్‌లు, బలహీనతలు, నిజం - అబద్ధం మధ్య సన్నని లైన్ గురించిన కథ. నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ కలయిక వలన మాకు క్రియేటివ్‌గా కొత్త ఎక్స్‌పెరిమెంట్స్ చేసే లిబర్టీ దొరికింది. థ్రిల్లర్ సస్పెన్స్‌తో పాటు, ఫ్యామిలీ కాంఫ్లిక్ట్ కి సంబంధించిన ఎమోషన్స్‌ని కూడా కలిపి చూపించే ఈ సిరీస్ ఆడియన్స్‌కి సరికొత్త అనుభూతిని అందించబోతోంది.

# ఆమె కొలువుదీర్చిన విగ్రహాలు



**చుట్టూ గణపతి నవరాత్రుల కోలాహలం! పోటాపోటీగా కొలువుదీర్చిన విగ్రహాలు... చూపరులకు కనుల పండగే. కానీ వాటిని తీర్చడం వెనక ఎంతోమంది శ్రమ దాగుంటుంది. వారిలో ప్రత్యేకంగా నిలుస్తూ కితాబులు అందుకుంటోంది దీపిక పాల్!**

విగ్రహాల తయారీలో మహిళలూ కనిపిస్తున్నా ఇదీ పురుషాధిక్య రంగమే. అలాంటిదానిలో తన ఉనికిని చాటుకుంటుంది దీపిక, గువాహటిలో విగ్రహాలు తయారుచేసే ఏకైక మహిళగా ఈమెకు పేరు. కనీసం ఆరునెలల ముందు ఆర్డర్ ఇచ్చి మరీ తయారు చేయించుకుంటారు. ఆమె తీర్చిదిద్దే విగ్రహాలకు అసోంలో అంతటి పేరు వచ్చింది. నాన్న నుంచి ఈ వారసత్వాన్ని అందుకుంది దీపిక ఆయన విగ్రహాలు తయారుచేస్తోంటే మట్టి తీసుకుని సరదాగా ప్రయత్నించడమే. ఆదే తనకు ఉపాధి అవుతుందని అప్పటికి ఆమె కూడా ఊహించి ఉండదు. పెళ్లయ్యేవరకూ దీపిక కూడా సాధారణ అమ్మాయే. తరవాతే కష్టాలు చుట్టుముట్టాయి. ఇద్దరు పిల్లలు పుట్టాక భర్త ఆమెను వదిలేశాడు. అందరూ 'ఎలా బతుకుతుందో' అంటే.. దీపిక తనకు ప్రావీణ్యమున్న విగ్రహాల తయారీనే ఎంచుకుంది. 'మగవాళ్లకే కష్టం. రెండు రోజుల్లో దుకాణం మూసేస్తావ్! పెట్టుబడి దండగే' అన్నారంతా. ఆమె మాత్రం ఆధైర్యపడలేదు. కాబట్టే 15 ఏళ్లుగా ఈ రంగంలో కొనసాగుతోంది. 'శివశంకర్ శిల్పాలయం' పేరుతో వర్క్‌షాప్ ద్వారా తాను ఉపాధి పొందడమే కాదు, మరికొందరికి జీవితాన్ని కలిగిస్తోంది. 'వినాయకుడు, దుర్గ మాత్రమే కాదు... మరెన్నో శిల్పాలను తీర్చిదిద్దుతాను. మట్టి, వెదురు వంటివాటితో వీటిని తయారుచేస్తాం. ఉదయం మొదలు పెడితే అర్ధరాత్రి వరకూ మా పని కొనసాగు తుంది. ఒక్కో విగ్రహం ఎత్తునుబట్టి రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకూ తీసుకుంటాం. నేను మొదలు పెట్టిన తొలిరోజుల్లో అంతా నవ్వినవారే. చుట్టుముట్టిన ఆర్థిక కష్టాలు బోలెడే. నా మీద ఆధారపడ్డ కుటుంబాలకోసం ఎన్ని కష్టాలేదురైనా కొనసాగించా. నాకంటూ గుర్తింపు తెచ్చుకున్నా'నన్నే దీపిక... పనికి చిన్నా పెద్దా ఉండదు. ఎవరిమీదా ఆధారపడకుండా చేస్తే కష్టమేదైనా గొప్పదే అంటుంది. కాబట్టే ఆమె విగ్రహాలకే కాదు... తన పట్టుదల, కష్టాలకు లొంగని తత్వం, తనపై తనకు నమ్మకం... వంటి లక్షణాలకూ సలామ్ కొడతారంతా. □

# జీవనోపాధి కోసం ట్రాక్టర్లను నడిపిస్తూ..

**ఒకప్పుడు అమ్మాయిలు సైకిల్ నేర్చుకుంటానంటేనే నీ వల్ల కాదనేవారు... తర్వాత బైక్ నడుపుతుంటే మగరాయుడంటూ హేళన చేసేవారు.అలాగని చాలామంది మహిళలు అక్కడితఆగిపోలేదు. కాలక్రమంలో కారు, ఆటో, బస్సు... వంటి వాటిమీద దూసుకుపోతున్నారు. అలాంటివారిలో తాళ్లూరు మండలం తురకపాలెం మగువల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సుమారు 20 మంది మహిళలు జీవనోపాధికోసం ట్రాక్టర్లను అవలీలగా నడిపిస్తున్నారు. ..**

అది ప్రకాశం జిల్లాలోని తురకపాలెం, మహిళా సాధికారత అంటే వైట్ కాలర్ ఉద్యోగాల్లోనూ, బోర్డు స్థానాల్లో మాత్రమేకనిపించడం కాదనుకున్నారేమో! ఆ ఊళ్లోకి అడుగు పెట్టగానే ట్రాక్టర్లపై దూసుకెళ్లే మహిళలు చాలామందే కనిపిస్తారు. అలాగని ఒకరో ఇద్దరో అలా సరదాగానేర్చు కుంటున్నారేమో అనుకునేరు. అక్కడ ఇరవైమంది మహిళలు ట్రాక్టర్లు నడపుతున్నారు. అది వారి దినచర్యవాళ్లలో కొందరు వాటిపై పశువులకు మేత కోసుకొస్తుంటే, ఇంకొందరు దుక్కి దున్నడానికి, ఎరువులు తేవడానికి... వెళ్తారు. నిజానికి ఈ దృశ్యం మనకి కొత్తగా అనిపించినా... వాళ్లంతా దాన్ని చాలా సాధారణంగా తీసుకుంటారు. ఎందుకంటే ఈ గ్రామంలో ఎక్కువగా సన్న, చిన్నకారు కుటుంబాలు ఉన్నాయి. వీళ్లంతా వ్యవసాయం, అనుబంధంగా పాడిపరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నవారే. భార్యాభర్తలు ఇద్దరూకష్టపడితేనే కానీ, నిలదొక్కుకోలేం అన్న ఆలోచనతో ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తిని పొంది ఈ పని చేస్తున్నారు. ఆ గ్రామానికి చెందిన కుమ్మిత నాగమల్లీశ్వరి తొలిసారిగా ట్రాక్టరు నడిపి ఇతరులకు మార్గదర్శకం అయ్యారు. దాదాపు పన్నెండు సంవత్సరాలకు పైగా ఆమె కుటుంబ అవసరాల కోసం ట్రాక్టరు నడుపు తున్నారట. అవసరం ఏ పనైనా నేర్పిస్తుంది. చిన్నప్పటి నుంచీ నాకు బాగా చదువుకోవాలన్న కోరిక. అమ్మానాన్నలు సోము వెంకటరెడ్డి, సుబ్బాయమ్మలు వ్యవసాయం చేసేవారు. వారికి మేం నలుగురం సంతానం, అందులోనూ ముగ్గురం ఆడపిల్లలమే కావడంతో మమ్మల్ని చదివించడంలో నాన్న స్థోమతకు మించిన పనైంది. దాంతో అక్కను, తమ్ముడిని బడిలో చేర్చారు. చెల్లి చిన్నది కావడం, పనులకు సాయంగా ఉంటానని భావించి నన్ను చదివేందుకు ఇష్టపడలేదు. అయినా, నేను పట్టు వదలక ఐదువరకూ చదువుకున్నా. తర్వాత కొనసాగించలేకపోయింది. పొలంలో నాన్నతోపాటు పనికి వెళ్లేదాన్ని. చేదోడు వాదోడుగా. ఉంటున్నానని భావించి ట్రాక్టర్ నడపడం నేర్పించారు. దాంతో అప్పటి నుంచి దాన్ని కొనసాగిస్తున్నా. పెళ్లయ్యాక మావారు వెంకటరెడ్డి అభ్యంతరం పెట్టలేదు. పైగా తను అక్కడ లేకపోయినా నేను పనులు చక్కబెట్టుకునేలా ప్రోత్సహించారు. సాగు లాభసాటి ప్రత్యక్ష పాడిపైనే ఎక్కువగా ఆధారపడుతుంటాం. దాంతో రోజూ దానికి పచ్చగడ్డి కోసుకురావడం, వ్యవసాయపనులు మొదలయ్యాక దమ్ము చేయడం, దుక్కి దున్నడం వంటివన్నీ చేస్తుంటారు. మొదట్లో కొందరు మగ రాయుడిలా ఏర్పాటు చేస్తున్నారు అంటూ వెనక గుసగు సలాడు. తర్వాత్తర్వాత అవసరాన్ని గుర్తించి మరి కొందరు ఆడవాళ్లు నన్ను స్ఫూర్తిగా తీసుకుని నేర్చుకోవడానికి ముందుకొచ్చారు అంటారామె. అరుణ, కళావతి, అశ్విని, రమణమ్మ, రమాదేవి, పెదనాగమ్మ, మల్లీశ్వరి, రాజేశ్వరి, మనీషారెడ్డి, పూజిత, రమాదేవి.. ఇలా సుమారు ఇరవైమందికిపైగా స్త్రీలు ట్రాక్టర్లు నడిపేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ పనులు సీజన్‌లో డ్రైవర్లు దొరక్కపోవడం, పశువులకు గడ్డి తీసుకురావాల్సిన సమయంలో ఇంటి యజమాని అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలను చూసి తామంతా స్వయంగా ట్రాక్టర్లు నడపడం నేర్చుకున్నామంటారు వీరంతా. మంచి ఆలోచనే కదూ! □






# ఈ ఫ్యాషన్లదే హవా

అమ్మాయిలు కోరుకునేదే కొత్తదనం. అందుకే ఆ ముచ్చట తీర్చేస్తూ అటు అమ్మాయిల్నీ ఇటు అబ్బాయిల్నీ ఆకట్టుకోవడానికి ఈ ఏడాది బోలెడన్ని ఫ్యాషన్లు రంగంలోకి దిగాయి. వాటిల్లో కొన్ని..



**పలాజో..** అమ్మాయిల మనస్సు పలాజో పైకెళ్లింది. కాస్త పాదాలపైకి ఉండే ఈ పలాజోలు అన్ని రకాల కుర్తాలకూ సరిపోయేలా వచ్చాయి.



**స్టైలిష్ కఫ్తాన్... న**డెస్సు ఫంకీగా ఉంటూనే సౌకర్యంగా ఉండాలనుకునేవారి మనసును దోచుకున్న కఫ్తాన్ ఫ్యాన్.



**మెరిసిన లంగా ఓణీ :** ఆడపిల్లల్ని ఆకుట్టుకునే లంగా ఓణీల్లో బోలెడన్ని ఫ్యాషన్లు. అయితే ఒకప్పుడు పట్టుతోనే అలరించిన లంగా ఓణీ. ఈ ఏడు మెరుపుల దోలా సిల్క్ క్లాత్‌తో మార్కెట్లోకి వచ్చింది. రంగురంగుల్లో పిఛ్‌వాయి నుంచి కలంకారి వరకూ ఎన్నెన్నో ప్రింట్ల డిజైన్లతో సరికొత్తగా కనువిందు చేస్తుంది.



**చిల్లుల జాకెట్ :** బ్లౌజుల్లో ఎన్ని రకాలొచ్చినా.. ఆడవాళ్లు అస్సలు సంతృప్తి చెందరు. అందుకే మరి ఎప్పటికప్పుడు జాకెట్లలో కొత్తకొత్త ట్రెండ్స్ పుట్టుకొస్తూనే ఉంటాయి. అలా ఈ ఏడాది అతివల కోసం చాలానే వచ్చాయి వాటిల్లో ఒకటి ఈ చిల్లుల బ్లౌజు.

# పులిహోర పౌడర్ ఇంట్లోనే ..

పూజ,వ్రతం, పెళ్లి, పేరంటం.. ఇలా ఎన్నో సందర్భాల్లో పులిహోర తప్పనిసరిగా ఉంటుంది. దీన్ని ఇష్టపడనివాళ్లు దాదాపుగా ఉండరు. చింతపండు పులుసు ఉడికించటానికి ఎక్కువ టైం పడుతుంది. పులిహోర మిక్స్ గనుక ఉందంటే క్షణాల్లో పనైపోతుంది. అది కొనకుండా మనమే చేసుకోవచ్చు.



**కావలసినవి :** యాపిల్ పండంత చింతపండు, అందులో ఎండు బెల్లం, అర కప్పు కొబ్బరి తురుము, 6 చెంచాల ఉప్పు (మీకు తగ్గట్టు కాస్త ఎక్కువ లేదా తక్కువ వేసుకోవచ్చు), 5 చెంచాల నువ్వులు, 15 ఎండుమిరప కాయలు, 4 చెంచాల చొప్పున శనగ, మినప్పప్పులు, జీలకర్ర, ధనియాలు, అరంచా, మిరియాలు, ఆవలు తాలింపు.. 5 చెంచాల పల్లీలు,నువ్వులు, 2 చెంచాల చొప్పున శనగ, మినప్పప్పులు, చెంచ ఆవాలు, చారెడు జీడిపప్పు, పావు కప్పు నూనె, ఆరేడు కరివేపాకు రెబ్బలు తీసుకోవాలి.

**తయారీ:** నువ్వులు, ఎండుమిర్చి, శనగ మినప్పప్పులను విడివిడిగా వేయించాలి. వాటిని తీసి.. ఆవాలు, మెంతులు, మిరియాలు, ధనియాలు, జీలకర్రలను మంచి వాసన వచ్చేదాకా వేయించాలి. అన్నీ చల్లారాక కొబ్బరి తురుము, పసుపు, ఇంగువ, జత చేసి గ్రైండ్ చేయాలి. చింతపండు పొడిపొడిలాడేలా దాన్ని కూడా కొంచెం వేయించి.. బెల్లం పొడి, ఉప్పు కలిపి నూరి... పప్పుల మిశ్రమంలో కలపాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక.. పల్లీలు, ఆవాలు, శనగపప్పు, మినప్పప్పు, జీడిపప్పు, నువ్వులు, కరివేపాకు ఒక్కొక్కటిగా వేయాలి. ఈ తాలింపు చల్లారనిచ్చి. పౌడర్‌లో కలపాలి. దీన్ని తడిలేని గాలిచొరబడని సీసాలో భద్రం చేసుకుంటే వేడి అన్నంలో కలిపి ఎంచక్కా తినొచ్చు. □

# కొత్తిమీర ప్రయోజనం-2..

ఆరోగ్య భాగ్యం



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

విటమిన్ 'కె' వల్ల గాయాలైనప్పుడు రక్తస్రావాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డకట్టడానికి ఉపయోగపడుతుంది. కొత్తిమీరలోని అధిక కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్ జింక్ కాపర్ వల్ల దంతాలు, ఎముకలు ఆరోగ్యంగా ఉండి ఎముకల వ్యాధులు, కీళ్ళనొప్పులు, ఆస్టియోఫోరోసిస్ వ్యాధులు రావు. కొత్తిమీరలోని అధిక ఆంటి ఆక్సిడెంట్స్ వల్ల శరీరంలో ఫ్రీరాడికల్స్‌ని తొలగించి కేన్సర్, గుండెజబ్బులు, దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా, వృద్ధాప్య చిహ్నాల్ని తగ్గిస్తుంది. బరువు తగ్గుతారు. రక్త నాళాల్ని శుభ్రపరిచి, అడ్డంకుల్ని తొలగించి చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజ్‌రైడ్స్‌ని తగ్గిస్తుంది. ఇది నిద్రలేమి, టెన్షన్, ఆందోళన అలసట, తలనొప్పి, చిరాకును తగ్గించి, ఆంటి డిప్రెసెంట్‌గా పనిచేస్తుంది. వివిధ రకాల కాలుష్యాల వల్ల శరీరంలో కలిగే వివిధ భారీ లోహాల్ని (సీసం, ఆర్సెనిక్, పారసం, కాడ్మియం) స్థాయిల్ని తగ్గిస్తుంది. అలాగే కీమోథిరపీ పొగ త్రాగడం వల్ల కలిగే నష్టాల్ని తగ్గిస్తుంది. విషపురుగులు కుట్టిన చోట వాటి విషాన్ని హరిస్తుంది. స్త్రీలలో బహిష్టులోని హెచ్చు తగ్గుల్ని అధిక రక్తస్రావాన్ని, బహిష్టునొప్పి, నడుంనొప్పి, పిఎమ్ఎస్, మూర్ఛల్ని మెన్స్ట్రువల్ క్రాంప్స్‌ని, హార్మోన్ల ఇంబాలెన్స్‌ని తగ్గిస్తుంది. శరీరంలోని ఎంజైమ్‌ల్ని, హార్మోన్లని, స్రావాల్ని ప్రేరేపించడం ద్వారా, బి.పి. షుగర్ సాయిల్ని తగ్గిస్తుంది.

**జాగ్రత్తలు:** కొత్తిమీరను రోజూవారీ ఆహారంలో అధికంగా తింటే కొన్ని దుష్ఫలితాలు ఏర్పడతాయి. కడుపునొప్పి, అతిసారం, ఎలర్జీ, లో బిపి. స్పృహతప్పడం శ్వాస తక్కువగా తీసుకోవడం, ఛాతీనొప్పి, ఎండవేడిమికి, యువి కిరణాలకి సునితత్వం కల్గుతుంది. ఆపరేషన్స్‌కి ముందు, తర్వాత, నిద్రమత్తు కల్గిస్తుంది. పురుషుల్లో ప్రోస్టేట్ గ్రంధి పనులకి, గర్భిణీ స్త్రీలలో ఎక్కువగా తినకుండా ఉంటేనే మేలు. హోమియోలో కొత్తిమీరతో తయారు చేసిన కొరియాంనరడమ్ సాటైవమ్ మదర్‌టించర్ వల్ల ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. దీన్ని పిల్లలు, గర్భిణీలు నిరభంతర్యంగా వాడవచ్చు. ఆకలి లేకపోయినను, వికారం, విరేచనాలు, మొలలు, నేకిమిరోగాలు, పంటినొప్పి, కీళ్ళ నొప్పులు, హెర్నియా, మీజిల్స్, బాక్టీరియా ఫంగల్ ఇన్ఫెక్షన్స్‌కి వ్యాధి లక్షణాల్ని బట్టి 3-5 చుక్కలు రోజుకి 2-3 సార్లు చొప్పున వారానికి, నెలకొకసారి వైద్య పర్యవేక్షణలో వాడుకోవచ్చు. కొత్తిమీర ఎక్కువగా తీసుకోవాడం వల్ల కలిగే దుష్ఫలితాలకి విరుగుళ్ళుగా దాల్చినచెక్క, వేయించిన కోడిగ్రుడ్డు తేనె, లవంగాలు తీసుకుంటే సరిపోతుంది. □



# అన్నంతో మేలి ఛాయ

చర్మానికి మేలిమి ఛాయను అందించడంలో బియ్యం కడుగు బాగా పని చేస్తుందనేది తెలిసిన విషయమే. కానీ అన్నంతోనూ ఇది లభిస్తుందని తెలుసా. ఇంట్లో లభించే కొన్ని పదార్థాలను కలిపి ఫేస్‌ప్యాక్ వేసి బ్యూటీ పార్లర్‌లో పొందే గ్లాస్ స్కిన్‌ని పొందవచ్చు. అదెలానో తెలుసుకుందామా..

**పచ్చిపాలతో..** రెండు టేబుల్ స్పూన్ల అన్నాన్ని తీసుకోవాలి. దానికి తగినన్ని పచ్చిపాలు లేదా పెరుగు కలిపి పేస్టులా చేసుకోవాలి. దీన్ని ముఖానికి ప్యాక్‌లా చేసి పావుగంటాగి చల్లని నీటితో శుభ్రం చేస్తే సరి. రైస్‌లో ఉండే అమైనో ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు ముఖచార్మాన్ని తేమగా చేస్తూ వృద్ధాప్య ఛాయలను దరిచేరనివ్వవు.

**తేనెతో...** రెండు చెంచాల చొప్పున అన్నం, పులియబెట్టిన బియ్యం కడుగు, అరచెంచా చొప్పున తేనె, ఆరెంజ్ తొక్కలపొడి తీసుకుని మిశ్రమం చేసుకోవాలి. దీనినన ముకానికి పట్టించాలి. ఆరిన తర్వాత కడిగితే సరి. పులిసిన బియ్యం నీళ్ల జిడ్డుని తగ్గించి మొటిమలు, వాటి వల్ల ఏర్పడే మచ్చలను దూరం చేస్తాయి. వారానికి కనీసం రెండుసార్లు చేస్తే నిగారింపు మీ సొంతం అవుతుంది.



**కీరాతో..** రెండు చెంచాల మెత్తగా చేసిన అన్నానికి, అదే పరిమాణంలో కీరదోస గుజ్జు కలపాలి. దీన్ని ముఖం, మెడ భాగాలకు పట్టించి పావుగంటాగి కడగాలి. కీరా చర్మ రంధ్రాలను బిగుతుగా చేస్తుంది. విటమిన్- ఐసి, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు అలర్జీలను తగ్గిస్తాయి. అలసిన కళ్లకు ఉపశమనం కలిగించడమే కాకుండా కంటి చుట్టూ నల్లటి వలయాలను తగ్గిస్తుంది. అదనపు నూనెలను నివారించి చర్మాన్నిహైడ్రేట్ చేసి కాంతిమంతంగా కనిపిస్తుంది.

**క్యారెట్, అన్నం..** చెంచా చొప్పున క్యారెట్ ముక్కలు, అన్నం తీసుకుని మెత్తగా చేసుకోవాలి. దీన్ని ముఖానికి పట్టించి ఆరాక చల్లటి నీటితో శుభ్రం చేయాలి. క్యారెట్‌లో ఉండే బీటా కెరోటిన్,విటమిన్ సి ఫెనొలిక్ ఆమ్లాలు చర్మ ఛాయను మెరుగుపరుస్తాయి. ఎండవల్ల ఏర్పడే డార్క్‌స్పాట్స్‌ను తగ్గిస్తుంది. ఫ్రీరాడికల్‌తో పోరాడి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. □

# గణాధిపత్యం !

ఆధ్యాత్మికం

వినాయక చవితిని పిల్లలచేత తప్పనిసరిగా ఎందుకు చేయించుకోవాలి అనే సందేహం కొందరికి వస్తుంటుంది. అందుకో స్పష్టమైన ఉదాహరణ.. గణాధిపత్యం ఎవరికి ఇవ్వాలనే విషయంలో పరమేశ్వరుడు పెట్టిన పరీక్షలో వినాయకుడే గెలిచాడు. కుమారస్వామి, విఘ్నేశ్వరుల్లో భూమండలాన్ని ముందుగా ఎవరు చుట్టి వస్తే వారికే గణాధిపత్యమన్నది శివయ్య మాట. కుమారస్వామి వద్ద వేగంగా ప్రయాణించే నెమలి వాహనం ఉంది. కానీ గణపయ్యకు కదిలేందుకు ఇబ్బందిగా ఉండే పెద్ద బొజ్జ.. దానికి తోడు చిట్టెలుక వాహనం. ఈ క్లిష్ట పరీక్షకు కుంగి పోలేదు ఉండ్రాళ్లయ్య. ఎంతో ధైర్యంగా, స్థైర్యంగా ఉన్నాడు. ధర్మమే అన్నీ సమకూర్చి పెడుతుందని ముందడుగు వేశాడు. తనయుడిగా తన లక్ష్యం ఒక్కటే. అమ్మానాన్నలను పూజించాలి, గౌరవించాలి. ఆ కర్తవ్యనిర్వహణతో కూడిన ధర్మాన్నే ఆయన ఆచరించాడు. తల్లిదండ్రులకు ప్రదక్షిణలు చేశాడు.. భూమండలాన్ని చుట్టిన ఫలితాన్ని వెనువెంటనే పొందాడు. ప్రతి తీర్థాన్నీ, క్షేత్రాన్నీ షణ్ముఖుడి కంటే ముందు చేరాడు. గణాధిపత్యానికి అర్హత సాధించాడు. తల్లిదండ్రులను గౌరవిస్తే జీవితానికి కావలసిన అన్నీ సులభ సాధ్యాలవుతాయన్న ధర్మ సూక్ష్మాన్ని వినాయకుడు ఇక్కడ అందించాడు. అంతే కాదు గజాననుడిగా మారేందుకు ముందు అమ్మ మాటను పాటించటం ధర్మమని నిర్ణయించుకుని వాకిట్లోనే శివయ్యను ఆపాడు. నలుగుపిండితో బొమ్మను చేసే ప్రాణం పోసింది. పార్వతి స్నానానికి వెళ్తూ. ఎవరినీ లోపలికి రానివ్వొద్దని గడపలో కాపలాగా ఉంచింది. పరమేశ్వరుడొచ్చి లోపలికి వెళ్లే ప్రయత్నం చేశాడు. అమ్మ ఇచ్చిన ఆజ్ఞను పాటించటం తన ధర్మమని శివయ్యను లోపలికి పంపలేదు. గణపయ్యకు శిరచ్ఛేదమయ్యింది. కానీ ధర్మాన్ని పాటించిన కారణంగా గజానత్వం సిద్ధించింది. □

# ప్రత్యేకమైన స్థలం అవసరం

**బాగా చదువుకొమ్మని పిల్లలకు చెబుతాం కానీ.. ఇంట్లో అందుకు తగ్గ వాతావరణం ఉందా అని ఎప్పుడైనా గమనించారా? ప్రత్యేకించి వాళ్లకంటూ ఓ స్థలం లేకపోతే చదువుపై ఏకాగ్రత ఎలా పెంచుకుంటారు**

✦ పిల్లల చదువుకొనే చోటే కదా ఎక్కడో అక్కడ కాస్త జాగా ఉంటే చాలు అనుకోవద్దు. పిల్లలు చదువుకొనే స్థలం. వంటగది పక్కన, బాత్‌రూమ్, బెడ్ రూమ్‌లకు దూరంగా ఉండేట్టు చూడండి. అలాగే మెట్ల పక్కన కూడా వద్దు. ఎందుకంటే ఆ శబ్దాలకి చదువుపై మనసు పెట్టలేరు. అలాగే స్టడీ రూమ్‌ని గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేచోట ఏర్పాటు చేసుకోవాలి. ✦ స్టడీ టేబుల్ దీర్ఘ చతురస్రాకారంలో సౌకర్యంగా ఉండేట్టు చూసుకోవాలి. అలానే గదిగోడలు ఆకుపచ్చ, నీలం, పసుపు, తెలుపురంగుల్లో ఉంటే మంచిది. ఈ రంగులు ఏకాగ్రతను పెంచుతాయి. పిల్లలను చురుగ్గా ఉంచుతాయి. ఎరుపు, నలుపు వంటి రంగులైతే.. పిల్లల జ్ఞాపకశక్తిపై ప్రభావం చూపిస్తాయి. ✦ పిల్లల గదిలో వాళ్లకు ఇష్టమైన రోల్‌మోడల్స్, మ్యాప్స్, గడియారం వంటివి పెడితే ఇవన్నీ వారికి కొంత జ్ఞానం, సమయపాలన, క్రమశిక్షణ దిశగా నడిపిస్తాయి. టివి, మ్యూజిక్ సిస్టమ్, అద్దాలు ఏర్పాటు చేయొద్దు.ఇవి వాళ్ల దృష్టిని పక్కకు మళ్లిస్తాయి. ✦. చిన్న కుండీలో మనీప్లాంట్ వంటి మొక్కల్ని పెంచితే పిల్లలు చదివే వాతావరణం ఆహ్లాదంగానూ, ఆరోగ్యవంతంగానూ ఉంటుంది. □



# ఆసియా కప్‌లో.. భారత్‌దే ఆధిపత్యం

## టైటిల్ అందించిన కెప్టెన్లు


సునీల్ గవాస్కర్


దిలీప్ వెంగసర్కర్


అజారుద్దీన్


ఎంఎస్ ధోనీ


రోహిత్ శర్మ

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ ప్రారంభమైనప్పటి నుంచి భారత జట్టుదే ఎక్కువ ఆధిపత్యం. ఇప్పటివరకు జరిగిన 16 ఎడిషన్లలో భారత్ అత్యధికంగా 8 సార్లు టైటిల్ గెలుచుకుంది. ప్రతి టైమ్ లైన్‌లో ప్రతి కెప్టెన్ తనదైన శైలితో జట్టుని గెలిపించడం భారత క్రికెట్ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం. అలా ఆసియా కప్‌లో ఇప్పటివరకు భారత్‌కు 5 కెప్టెన్లు టైటిల్ అందించారు. 1984లో జరిగిన తొలి ఆసియా కప్‌లో భారత్‌కు సునీల్ గవాస్కర్ నాయకత్వం వహించాడు. అప్పట్లో కేవలం మూడు జట్లే భారత్, పాకిస్థాన్, శ్రీలంక పాల్గొన్నాయి. గవాస్కర్ కెప్టెన్సీలో భారత్ పాకిస్థాన్‌పై 54 పరుగుల తేడాతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. మొదటి కెప్టెన్‌గా ఆసియా కప్ ట్రోఫీని లిఫ్ట్ చేసిన గర్వకారణం ఆయనకే దక్కింది. అలాగే 1988 ఆసియా కప్‌లో భారత్ రెండోసారి విజేతగా నిలిచింది.
ఈసారి దిలీప్ వెంగసర్కర్ కెప్టెన్సీ వహించారు. శ్రీలంక, పాకిస్థాన్‌వంటి జట్లతో పోటీపడుతూ జట్టుని సమర్థవంతంగా నడిపించాడు. ఇక 1990/91, 1995లో భారత్ 2 సార్లు ఆసియా కప్ గెలుచుకుంది. ఈ రెండు విజయాలకు కెప్టెన్‌గా అజారుద్దీన్ ఉన్నారు. ప్రత్యేకంగా 1995లో జరిగిన ఫైనల్లో ఆయన 90 పరుగులు నాటౌట్‌గా చేసి జట్టుని విజేతగా నిలిపారు. భారత క్రికెట్‌లో మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్లలో ధోనీ ఒకడు. 2010లో శ్రీలంకపై భారత్ విజయం సాధించి ఆసియా కప్ ట్రోఫీని గెలుచుకుంది. ఆ తర్వాత 2016లో జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై గెలిచి మరోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈసారి మ్యాచ్ టి20 ఫార్మాట్‌లో జరిగింది. అందుకే ధోనీ ఒడిఐ, టి20 రెండు ఫార్మాట్లలో ఆసియా కప్ గెలిపించిన ఏకైక భారతకెప్టెన్‌గా చరిత్రలో నిలిచాడు. కాగా 2018లో బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ భరితమైనఫైనల్లో భారత్‌గెలిచి టైటిల్ సాధించింది. ఆ సమయంలో కెప్టెన్‌గా రోహిత్ శర్మ జట్టుని ముందుండినడిపాడు. 2023లో శ్రీలంకపై ఫైనల్లో విజయం సాధించినప్పుడు మాత్రం పూర్తి అధికారిక కెప్టెన్‌గా ట్రోఫీ లిఫ్ట్ చేశారు. ఆ ఫైనల్లో భారత్ అద్భుత ప్రదర్శనతో శ్రీలంకని కేవలం 50 పరుగు లకే ఆలౌట్ చేసింది. ఈ స్వల్పలక్ష్యాన్ని టీమ్ ఇండియా 6.1ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఇది ఆసియా కప్ చరిత్రలోనే ఒక రికార్డు విజయంగా నిలిచింది.



## మహిళల హాకీ ఆసియా కప్.. భారత్ చేతిలో థాయిలాండ్ చిత్తు

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఆసియా కప్-2025, ప్రారంభ మ్యాచ్‌లో భారత మహిళలు థాయిలాండ్‌పై ఆధిపత్యం సంపాదించారు. చైనాలో శుక్రవారం జరిగిన ఈ తొలి మ్యాచ్‌లో భారత్ థాయిలాండ్‌ను 11-0 తేడాతో ఓడించింది. బ్యూటీ డంగ్ డంగ్, ఉదిత చెరో రెండు గోల్స్ చేశారు. పూల్ బి మ్యాచ్‌లో భారత్ తరఫున ముంతాజ్ ఖాన్ (7 నిముషం, 49 నిముషం), ఉదిత (30, 52), బ్యూటీ డంగ్ డంగ్ (45, 54) రెండేసి గోల్స్ చేయగా, సంగీతా కుమారి (10), నవనీత్ కౌర్ (16వ నిముషం), లాల్‌రెమ్సియామి (18), షర్మిలా దేవి (57)తో పాటు డిదాసో (57) స్కోర్ చేశారు. తొలి క్వార్టర్‌లో ముంతాజ్ ఖాన్ (7), సంగీతా కుమారి (10) చేసిన 2 ఫీల్డ్ గోల్స్‌తో భారత్ ఆరంభంలోనే తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. 2వ క్వార్టర్‌లో భారత్ తన దాడి తీవ్రతను మరింత పెంచుకుని మరో 3 గోల్స్‌తో తమ ప్రయోజనాన్ని విస్తరించుకుంది. అనుభవజ్ఞులైన ఫార్వర్డ్ నవనీత్ కౌర్ (16) మరియు మిడ్‌ఫీల్డర్ లాల్రెమ్సియామి (18) వరుసగా 2 ఫీల్డ్ గోల్స్ చేశారు. ఆ తర్వాత ఉదిత (30) పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చి మొదటి అర్ధభాగాన్ని బలంగా ముగించారు. రెండవ అర్ధభాగం కూడా ఇదే ధోరణిని అనుసరించింది. భారత్ థాయిలాండ్ సర్కిల్‌లో నిరంతరం దాడులకు పాల్పడి మూడవ క్వార్టర్‌లో 4 పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. దీని ద్వారా బ్యూటీ డంగ్ డంగ్ (45) 45వ నిమిషంలో తన మొదటి గోల్ చేసింది. మ్యాచ్ చివరి క్వార్టర్‌లో భారత్ వరుసగా 5 గోల్స్ చేసి తొలి మ్యాచ్‌లో భారీ విజయాన్ని నమోదుచేసింది. ముంతాజ్ ఖాన్ (49), ఉదిత (52), షర్మిలా దేవి (57) పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్స్ చేయగా, బ్యూటీ డంగ్ డంగ్ (54) మరియు రుతుజా దాదాసో పిసల్ (60) తమ జట్టు తరఫున ఫీల్డ్ గోల్స్‌చేశారు. భారత్ తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 6, శనివారం జపాన్‌తో తలపడుతుంది.

## పసికూనపై పాక్ ప్రతాపం.. యుఎఇపై 31 పరుగుల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ ఫైనల్‌కు చేరింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)తో షార్జా వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాకిస్థాన్ 31 పరుగుల తేడాతో గెలుపొందింది. దీంతో ఈ ట్రై సిరీస్‌లో పాక్‌కు ఇది మూడో విజయం. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లో 5 వికెట్లు నష్టానికి 171 పరుగులు చేసింది. ఓపెనర్లు షాహిబ్‌జాదా ఫర్హాన్ (16), నయిమ్ ఆయుబ్ (11) విఫలం కాగా, వన్‌డౌన్ బ్యాటర్ జమాన్ అద్భుత అర్ధ శతకంతో ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ 44 బంతులు ఎదుర్కొని 10 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 77 పరుగులతో ఆఖరి వరకూ అజేయంగా నిలిచాడు. ఫఖర్ జమాన్‌కు తోడుగా మహ్మద్ నవాజ్ (27 బంతుల్లో 37 నాటౌట్) వేగంగా ఆడాడు. దీంతో పాక్ మెరుగైన స్కోరు సాధించగలిగింది. యుఏఈ బౌలర్లలో హైదర్ అలీ 2 వికెట్లు తీయగా, జునైద్ సిద్దిఖీ, మహ్మద్ రోషిద్ ఖాన్, ధ్రువ్ పరాశర్ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు. ఇక పాక్ విధించిన 171 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో యూఏఈకి ఆదిలోనే దెబ్బ తగిలింది. కెప్టెన్, ఓపెనర్ మహ్మద్ వసీం (19)ను అబ్రార్ అహ్మద్ స్వల్ప స్కోరుకే పెవిలియన్‌కు పంపించాడు. అయితే మరో ఓపెనర్ అలీశాన్ షరాఫూ మాత్రం హాఫ్ సెంచరీతో రాణించాడు. 51 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 68 పరుగులు సాధించాడు. కానీ పాక్ బౌలర్ల విజృంభణతో మిగిలిన బ్యాటర్లంతా పెవిలియన్‌కు క్యూ కట్టడంతో షరాఫూ అర్ధ శతకం వృధా అయింది. ఎథాన్ డిసౌజా (9), ఆసిఫ్ ఖాన్ (7), రాహుల్ చోప్రా (0), హర్షిత్ కౌశిక్ (3), జునైద్ సిద్దిఖీ ఇలా వచ్చి అలా వెళ్లగా ధ్రువ్ పరాశర్ (18 నాటౌట్), హైదర్ అలీ (12 రనౌట్) డబుల్ డిజిట్ స్కోరు చేయగలిగారు. ఈ క్రమంలో నిర్ణీత 20 ఓవర్ల ఆట పూర్తయ్యేసరికి యూఏఈ 7 వికెట్లు నష్టానికి 140 పరుగులు చేయగలిగింది.




## యుఎస్ ఓపెన్ సెమీఫైనల్ మహిళల సింగిల్స్.. ఫైనల్‌కు సబలెంకా

### పెగులా సంచలన ఓటమి

**న్యూఢిల్లీ:** ఉత్కంఠభరితమైన మూడు సెట్ల సెమీఫైనల్లో టాప్ సీడ్, డిఫెండింగ్ ఓపెన్ ఛాంపియన్ అరినా సబలెంకా 4-6, 6-3, 6-4 తేడాతో నాల్గవ సీడ్ జెస్సికా పెగులాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఆర్థర్ ఆషే స్టేడియంలో శుక్రవారం జరిగిన టోర్నీలో సబలెంకాకు ఇది వరుసగా ఐదవ యుఎస్ ఓపెన్ సెమీఫైనల్. ఇది సబలెంకాకు ఏడవ గ్రాండ్ స్లామ్ ఫైనల్ అవుతుంది. పెగులా ప్రారంభంలోనే పూర్తి ప్రయోజనాన్ని పొందింది. ప్రారంభ సెట్‌ను ఆడి సబలెంకాను సమతుల్యత నుండి దూరంగా ఉంచింది. ఆమె తనను తాను మూడు అనవసర తప్పిదాలకు మాత్రమే పరిమితం చేసుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ మరియు రోలాండ్ గారోస్ ఫైనల్స్, అలాగే వింబుల్డన్ సెమీస్ రెండింటిలోనూ విఫలమైన 27 ఏళ్ల సబలెంకా, రెండవ సెట్‌లో మళ్ళీ మొదటి స్థానంలో నిలిచింది, ఈసారి ప్రారంభంలో 3-0 ఆధిక్యం కోసం పటిష్టం చేసింది, మూడో సెట్‌ను 30-40తో ప్రారంభించడంలో సహాయపడుతూ, పెగులా ఫోర్‌హ్యాండ్‌ను బేస్‌లైన్ దాటి పంపింది. ముఖ్యంగా తొమ్మిది నిమిషాల పాటు కొనసాగిన ఆరో గేమ్‌లో అమెరికన్ సబలెంకా సర్వీస్‌పై ఒత్తిడి తెస్తూనే ఉంటుంది. కానీ 30 ఏళ్ల పెనుగులా ఏడు బ్రేక్ అవకాశాలలో రెండింటిని మాత్రమే గోల్‌గా మార్చగలిగింది. మ్యాచ్ కోసం 5-4, 40-30తో సర్వ్ చేస్తూ, సబలెంకా నెట్‌లోకి కొట్టి పెగులా మరో మ్యాచ్ పాయింట్‌ను సేవ్ చేయగలిగింది. కానీ మూడవదాన్ని సేవ్ చేయలేకపోయింది, రెండు గంటల ఐదు నిమిషాల్లో పడిపోయింది.

## యుఎస్ ఓపెన్‌లో యుకీ భాంబ్రీ జోడీ ఓటమి



**న్యూఢిల్లీ:** ఓటమితో యుకీ భాంబ్రీ జోడీ యుఎస్ ఓపెన్-2025 టోర్నీ కలల పరుగు ముగిసింది. యుఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో భారత్‌కు చెందిన యుకీ భాంబ్రీ-న్యూజిలాండ్‌కు చెందిన మైఖేల్ వీనస్ జోడీ బ్రిటిష్ ద్వయం జో సాలిస్‌బరీ-నీల్ స్కుప్స్కి చేతిలో ఓడిపోయారు. బ్రిటిష్ ద్వయంతో జరిగిన ఉత్కంఠభరితమైన సెమీఫైనల్లో 7-6(72), 6-7(58), 4-6 తేడాతో భాంబ్రీ-వీనస్ జంట ఓడిపోయారు. లూయిస్ ఆర్మ్‌స్ట్రాంగ్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఈ పోటీ, కనీసం మొదటి సెట్ టైబ్రేక్ ప్రారంభమయ్యే వరకు హోరాహోరీగా సాగింది. ఆ తర్వాత, భాంబ్రి-వీనస్ 7-6(2)తో మొదటి ఫ్రేమ్‌ను కైవసం చేసుకోవడానికి కేవలం 2 పాయింట్లు మాత్రమే వదులుకున్నారు. రెండవ సెట్‌లో, భాంబ్రి-వీనస్ మొదటి గేమ్‌లో తమ ప్రత్యర్థుల సర్వీస్‌ను బ్రేక్ చేయడం ద్వారా నియంత్రణ సాధించారు. భాంబ్రి-వీనస్ కూడా సర్వీస్‌ను వదులుకునే వరకు, ఆటలో ఎదురుదెబ్బ తప్పదని అనిపించింది. ఆ తర్వాత మరికొన్ని గట్టి, ఉత్కంఠభరితమైన ఆటలు జరిగాయి, ఫలితంగా మరో టైబ్రేక్ వచ్చింది. ఈసారి, టైబ్రేక్ మరియు సెట్ 7-6 (5)తో బ్రిటిష్ వారికి దక్కింది. మూడవ సెట్‌లో, సాలిస్‌బరీ-స్కుప్స్కి అకస్మాత్తుగా ఆధిపత్యం చెలాయించారు. ముఖ్యంగా నెట్ వద్ద. 5-3తో ఆధిక్యంలో, బ్రిటిష్ 3 మ్యాచ్ పాయింట్లను సంపాదించారు. వాటిలో మూడింటినీ వారు వృధా చేశారు. కానీ సాలిస్‌బరీ-స్కుప్స్కి 6-4తో నిర్ణయాత్మక సెట్‌ను గెలుచుకున్నారు.

## రూ.855కోట్లకు ఛార్టర్డ్ స్పీడ్ ఐపిఒ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** ఛార్టర్డ్ స్పీడ్ సంస్థ రూ.855 కోట్ల ఐపిఒకోసం సెబీవద్ద డిఆర్‌హెచ్‌పి దాఖలుచేసింది. ఈక్విటీద్వారా 655 కోట్లు, ఆఫర్‌ఫర్‌సేల్ ద్వారా 200 కోట్లు సమీకరించేందుకు నిర్ణయించింది.ప్రమోటర్లు పంకజ్ గాంధీ, అల్కా పంకజ్ గాంధీలకు ఉన్న వాటాలను ఆఫర్‌ఫర్‌సేల్‌ద్వారా విక్రయిస్తారు. ఈ నిధుల్లో రూ.97 కోట్లు విద్యుత్ బస్సుల్లో పెట్టుబడులుపెడుతుంది. మరో 396.4 కోట్లు రుణాలచెల్లింపులకు వినియోగిస్తుంది. ఇతర మొత్తాన్ని సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తామని తెలిపింది. కంపెనీ ప్రిఐపిఒ ప్లేస్‌మెంట్‌కింద రూ.131కోట్లకు నిధులు సమీకరించాలనినిర్ణయించింది. అహ్మదాబాద్‌కేంద్రంగా ఉన్న ఛార్టర్డ్ స్పీడ్ 2007నుంచి అమలులో ఉంది. 2018లో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా కన్వర్ట్ అయింది.
భారత్‌లోని ప్యాసింజర్ రవాణా సంస్థల్లో ఒక లీడింగ్ సంస్థగా కొనసాగుతోంది. ఈ యేడాది జూన్‌నాటికి కంపెనీ రెండువేల బస్సులను 500 నగరాల్లో నడిపింది. 3.5 లక్షలమంది ప్రయాణీకులను ప్రతినిత్యం తమ బస్సుల్లో చేరవేస్తున్నట్లు తెలిపింది. గుజరాత్, ఒడిశా,మధ్యప్రదేశ్; రాజస్థాన్,అ స్సాం రాష్ట్రాల్లో అంతర్‌రాష్ట్ర సర్వీసులు కూడా నడుపుతోంది. ఆపరేషన్స్‌తో రాబడులు 666.7 కోట్లు ఉండగా 2023లో 332 కోట్లు వచ్చాయి. తొలిత్రైమాసికంలో నికరలాభం 70 కోట్లుగా కంపెనీ ప్రకటించింది. మొత్తం




945 విద్యుత్ బస్సులు అనుబంధ సంస్థలద్వారా నడుపుతోంది. ఇష్యూకు మోతీలాల్ ఓస్వాల్ ఇన్వెస్ట్‌మెంట్ సలహాదారులుగాను, ఎస్‌బిఐ కేపిటల్ మార్కెట్లు బుక్‌రన్నింగ్ లీడ్‌మేనేజర్లుగా ఉన్నారు.

## సెన్సెక్స్,నిఫ్టీలకు ఎఫ్‌ఎంసిజి, ఐటి రంగాల షాక్!



**ముంబయి, సెప్టెంబరు 6:** ఎఫ్‌ఎంసిజి, ఐటి రంగాల్లో ట్రేడర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించడంతో మార్కెట్లు లాభనష్టాల్లో ఊగిసలాడాయి. జిఎస్‌టి 2.0 వచ్చినా లాభాలు ఒక్కరోజుకే పరిమితం అయ్యాయి. నిఫ్టీ 24,621.60 పాయింట్లవద్దనే నిలిచిపోయింది. ఇక బిఎస్‌సి సెన్సెక్స్ 7.25 పాయింట్లు క్షీణించి 80,710.76 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివస్తే నిఫ్టీ 50 సూచీ కేవలం 6.70 పాయింట్లు మాత్రమే లాభపడింది. ఐటిసి 2.01శాతం, టిసిఎస్ 1.53శాతం, ఇన్ఫోసిస్ 1.29శాతం చొప్పున అమ్మకాలు సాగడంతో క్షీణించాయి. ఇక బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.10శాతం క్షీణిస్తే స్మాల్‌క్యాప్‌సూచీ 0.09శాతం పెరిగాయి. మార్కెట్లపరంగా 2134 కంపెనీల షేర్లు పెరిగితే 1957 కంపెనీలషేర్లు క్షీణించాయి. 181 షేర్లు స్థిరంగా కొనసాగాయి. భారత్‌పదేళ్ల బెంచ్‌మార్క్ బాండ్లు 0.46శాతం క్షీణించి 6.461శాతానికి చేరింది. విదేశీ కరెన్సీ మార్కెట్‌పరంగా రూపాయి మారకం విలువలు క్షీణించాయి. 88.25 వద్ద కొనసాగి చివరకు 88.12 వద్ద ముగిసింది.ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు అక్టోబరు 3వ తేదీనాటికి 0.33శాతం పెరిగి 106,770వద్ద ముగిసాయి. అమెరికా బాండ్లుకూడా 0.48శాతం క్షీణించి 4.156 కూపన్‌రేట్‌తో నడిచాయి. ఇక ప్రపంచ మార్కెట్లపరంగా యూరోపియన్ మార్కెట్లు శుక్రవారం భారీగానే ముగిసాయి. అమెరికా జాబ్ రిపోర్టుపై ఇన్వెస్టర్లు ఎదురుచూసారు. అలాగే రానునన ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లకోతలపైనా ఆసక్తిచూపించారు. జపాన్ నిక్కీ సేర్లు ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా ట్యారిఫ్‌లే ఇందుకు కారణం. ఇక స్టాక్స్‌పరంగా ఓలా ఎలక్ట్రిక్ 7.25శాతం, ప్రోస్టార్మ్ ఇన్ఫోసిస్టమ్స్ 9.79శాతం, ట్రాన్స్‌వరల్డ్ షిప్పింగ్‌లైన్స్ 8.15శాతం చొప్పున పెరిగాయి. అలాగే పిఎన్‌సి ఇన్‌ఫ్రాటెక్ 2.35శాతం, ఇండోటెక్ ట్రాన్స్‌షార్మర్స్ 2.35శాతం, పెరిగితే జైడస్ లైఫ్‌సైన్సెస్ 0.21శాతం క్షీణించాయి.

## స్పైస్‌జెట్‌కు రూ.238 కోట్ల నష్టం




**ముంబయి, సెప్టెంబరు 5:** ప్రైవేటురంగంలోని స్పైస్‌జెట్ జూన్‌త్రైమాసికంలో రూ.238 కోట్ల నష్టం చవిచూసింది. ఇదే కాలంలో గత ఏడాది 150 కోట్ల లాభాలను చవిచూసిన సంస్థ ఈ సారిమాత్రం నష్టాలు నమోదుచేసింది. ట్రావెల్ డిమాండ్ మందగించడం, కొన్ని రూట్లలో మరింతగా సర్వీసులు నిలిపి వేయడంకూడా ఇందుకు కారణం అయింది. దీనికితోడు ఆపరేషన్ సింధూర్‌తో రూట్లు అన్ని నిలిచిపోయాయి. దీనితో ఆపరేషన్‌కూడా సంస్థ నష్టాలకు కొంత కారణం అయింది. అలాగే పాక్‌గగనతలం మూసివేయడం కూడా ఒక కారణంగా చెపుతున్నారు. కొన్ని విమాన సర్వీసులు సర్వీసుకు గ్రౌండ్ అవడం, కొన్నింటికి లీజు వివాదాలు, ఆర్థిక ఒత్తిళ్లు కూడా పనితీరుపై ప్రభావంచూపించాయి. ఆపరేషన్స్ ద్వారా రాబడులు 35శాతంతగ్గాయి. 1695 కోట్ల నుంచి 1106 కోట్లకు పడిపోయాయి. ఇబిఐడిటిఎ కూడా 402 కోట్లనుంచి 18 కోట్లకు పడిపోయింది. సంస్థ ఛైర్మన్ అజయ్‌సింగ్ మాట్లాడుతూ అనుకోని తీవ్రస్థాయి సవాళ్లు రావడంతో సంస్థకు కొంతమేర రికవరీ కష్టం అయిందని, రానున్న కాలంలో అన్నింటినీ అధిగమిస్తామని వెల్లడించారు. జూన్‌త్రైమాసికంలో సంస్థ సంపద మొత్తం 446 కోట్లుపెరిగింది. గత ఏడాది 2398 కోట్ల లోటునుంచి ఈసారి కొంతమేర సంపదను పెంచుకోగలిగింది.

వాణిజ్యం

## జీఎస్టీ హేతుబద్ధీకరణతో ప్రభుత్వ రాబడుల లోటు తక్కువే!


### ఎస్‌బిఐ రీసెర్చి నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 5:** దేశంలో వస్తు, సేవల పన్ను (జిఎస్టీ) విధానంలో చేపట్టిన సంస్కరణల వల్ల ప్రభుత్వ ఖజానాపై పడే భారం చాలా స్వల్పమేనని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తన తాజా పరిశోధన నివేదికలో వెల్లడించింది. జీఎస్టీ మండలి తీసుకున్న రేట్ల హేతుబద్ధీకరణ నిర్ణయం వల్ల ప్రభుత్వానికి ఏటా కేవలం రూ. 3,700 కోట్ల మేరకు ఆదాయం తగ్గుతుందని అంచనా వేసింది. ఈ మొత్తం చాలా తక్కువ కావడంతో ద్రవ్య లోటుపై ఎలాంటి ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది. 56వ జిఎస్టీ మండలి సమావేశంలో జీఎస్టీ శ్లాబులు ఇకపై రెండే ఉంటాయని చెప్పిన సంగతి తెలిసిందే. వాటిని ఈనెల 22వ తేదీనుంచే అమలుకు తెస్తామని కూడా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఇప్పటివరకు ఉన్న 5%, 12%,18%, 28%అనే నాలుగు అంచెల పన్ను విధానాన్ని రద్దు చేశారు. దీని స్థానంలో 5%, 18% అనే రెండు శ్లాబులతో పాటు కొన్ని ఎంపిక చేసిన వస్తు, సేవలపై 40%డీమెరిట్ రేటును ప్రవేశపెట్టారు. ఈ మార్పుల వల్ల ప్రభుత్వానికి ఏటా రూ. 48,000 కోట్ల నష్టం వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా, ఎస్బీఐ అంచనా దీనికి పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. ఈ సంస్కరణల వల్ల వినియోగం పెరిగి ఆర్థిక వృద్ధికి దోహదపడుతుందని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా, సామాన్యులకు ఇది ఎంతో ఊరటనిచ్చే అంశమని తెలిపింది. దాదాపు 295 నిత్యావసర వస్తువులపై పన్ను రేటును 12%నుంచి 5% లేదా సున్నా శాతానికి తగ్గించడంతో రిటైల్ ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గుతుందని అంచనా వేసింది. దీనివల్ల ఈ ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుల ధరల సూచీ (సిపిఐ) ద్రవ్యోల్బణం 25 నుంచి 30 బేసిస్ పాయింట్ల వరకు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. 2026-27 నాటికి ద్రవ్యోల్బణం మొత్తం మీద 65 నుంచి 75 బేసిస్ పాయింట్ల మేర తగ్గుముఖం పడుతుందని వివరించింది. ఈ సంస్కరణల ఫలితంగా జీఎస్టీ సగటు భారిత రేటు కూడా గణనీయంగా తగ్గనుంది. 2017లో జీఎస్టీని ప్రవేశపెట్టినప్పుడు 14.4%గా ఉన్న ఈ రేటు, తాజా మార్పులతో 9.5 శాతానికి దిగి వస్తుందని ఎస్బీఐ నివేదిక పేర్కొంది. అంతేకాకుండా, వ్యయాలు తగ్గడం వల్ల బ్యాంకింగ్ రంగానికి కూడా ఈ సంస్కరణలు సానుకూల ఫలితాలనిస్తాయని అభిప్రాయపడింది.




## భారత్‌లో తొలి టెస్లాకారు కొనుగోలుచేసిన మహారాష్ట్ర మంత్రి

**ముంబయి, సెప్టెంబరు 5:** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఈ ఏడాది జులై 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఆ తర్వాత ఢిల్లీలో రెండో షోరూంను కూడా లాంచ్ చేసింది. భారత విపణిలోకి అడుగుపెట్టిన తర్వాత టెస్లా తాజాగా తన తొలి కారును కస్టమర్‌కు డెలివరీ చేసింది. తెలుపు రంగు టెస్లా 'వై మోడల్' కారును మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ కొనుగోలు చేశారు. ముంబై బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్ నుంచి తొలి కారును ఇవాళ మంత్రికి సంస్థ ప్రతినిధులు డెలివరీ చేశారు. కారు తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా దేశంలోనే తొలి టెస్లా కారును కొనుగోలు చేయడం పట్ల మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. విద్యుత్ వాహనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే తాను ఈ కారును కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది టెస్లా. రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్‌రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్‌వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్‌రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే ఆర్‌డబ్ల్యుడి వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్‌రేంజ్ వెర్షన్ ఆన్‌రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జిఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. అయితే, భారత్‌లో సగటు ఎలక్ట్రిక్ కారు ధర రూ.22 లక్షలు ఉంది. టెస్లా మోడల్ వై ధర దాదాపు రూ.60 లక్షల వరకు ఉంది. మరోవైపు ఎన్నో అంచనాలతో భారత మార్కెట్‌లోకి అడుగుపెట్టిన ఈ సంస్థకు నిరాశే ఎదురైంది. ఆశించిన స్థాయిలో బుకింగ్స్ జరగలేదని సమాచారం. జులై నుంచి ఇప్పటి వరకూ మొత్తం 600 బుకింగ్స్ మాత్రమే వచ్చాయి. కంపెనీ అంచనాల కంటే ఇవి చాలా తక్కువ. ఎందుకంటే టెస్లా ప్రపంచ వ్యాప్తంగా కేవలం నాలుగు గంటల్లోనే ఈ సంఖ్య కార్లను విక్రయిస్తుంది. దీంతో భారత్‌లో టెస్లాకు అనుకున్నంత స్పందన రాలేదని కంపెనీకి చెందిన కీలక వ్యక్తులను ఊటంకిస్తూ ఆంగ్లమీడియా వెల్లడించింది. టెస్లాకు బ్రాండ్ పేరు ఉన్నప్పటికీ ఎక్కువ ధర కారణంగా భారత్ ఈవీ మార్కెట్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోతోందన్నది మార్కెట్ టాక్.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.